ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-4-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 85 పేజీలు: 10+4 వెల: 8.00


ఇరాన్‌తో చర్చల కోసం పాక్‌కు వెళ్లొద్దని చెప్పా: ట్రంప్ 2లో

కొత్త గ్యాస్ సిలిండర్ల కనెక్షన్లకు బ్రేక్ 5లో

# పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం



శనివారం ముంబైలో ఎకనమిక్ టైమ్స్ అవార్డును సీఎం చంద్రబాబుకు ప్రదానం చేస్తున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

## సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగు

## ప్రధాని మోడీ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్

## నారీ శక్తి బిల్లుతో మహిళలకు మేలు: సీఎం

## ముఖ్యమంత్రికి ఎకనమిక్ టైమ్స్ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025' పురస్కారం ప్రదానం

## అవార్డును అందజేసిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థాయి దేశంగా మారుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్ అని ప్రశంసించారు. శనివారం సాయంత్రం తరువాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు అందుకున్నారు.అవార్డు స్వీకరించిన అనంతరం సీఎం ప్రసంగించారు. టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు స్వీకరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు ద్వారా మరికొన్ని పెట్టుబడులు ఏపీకి వస్తాయని ఆశిస్తున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఏపీలో అనుమతుల వేగాన్ని పారిశ్రామికవేత్తలు గుర్తించాలని కోరారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. దేశంలో సంస్కరణలు అమలవుతున్నాయని ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని తెలిపారు. ఇది పెట్టుబడులకు కూడా మెరుగైన సమయమని చెప్పుకొచ్చారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాల ద్వారా సుపరిపాలన అందిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమి లాంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రప్రభుత్వ నిర్ణయం సరైనదేనని వ్యాఖ్యానించారు. లింగ సమానత్వం, మహిళలకు సమాన అవకాశం కల్పించేందుకు తీసుకువచ్చిన బిల్లు ఇదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో నారీ శక్తి బిల్లును ప్రతిపక్షాలు ఎందుకు వ్యతిరేకించాయో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్ల కంటే 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని ప్రస్తావించారు. నారీ శక్తి బిల్లు అమలైతే మహిళలకు, పురుషులకు ఎక్కువ అవకాశాలు దక్కి ఉండేవని తెలిపారు. ఈ బిల్లు అమలు చేయకపోవడంతో మహిళలు అవకాశాలు కోల్పోయారని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. దేశంలోని మహిళలంతా గట్టిగా సంకల్పిస్తే ఈ బిల్లు ఎలాగైనా అమలు అవుతుందని స్పష్టం చేశారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తేనే అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రగతిశీల ఆలోచనలు ఉన్న నాయకుడని అభివర్ణించారు. నిబంధనలను సరళీకృతం చేస్తూ పెట్టుబడులను మోదీ ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. పెట్టుబడులకు ప్రోత్సాహం అందిస్తేనే సంపద సృష్టి జరుగుతుందని వెల్లడించారు. మూడు దశాబ్దాల క్రితం జనాభా నియంత్రణను గట్టిగా అమలు చేశామని వివరించారు. సంపద సృష్టికి సంస్కరణలే పునాది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. నాలుగున్నర దశాబ్దాల తన రాజకీయ జీవితంలో సంస్కరణలకు ముందు తర్వాత భారతదేశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని చెప్పారు

**పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందించాం:** ఇప్పుడు జనాభా కొరతను ఎదుర్కొంటున్నామని సీఎం వ్యాఖ్యానించారు. అందుకే ఈ జనాభా నిర్వహణ ప్రక్రియను చేపట్టాలనే పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందించామని స్పష్టం చేశారు. డబ్బులు ఉంటే పరిశ్రమలు, ప్రాజెక్టులు పెట్టవచ్చని. కానీ భవిష్యత్తులో >>2




శనివారం లోక్‌భవన్‌లో ఎపి హైకోర్టు సిజెగా జస్టిస్ లీసాగిల్‌చే ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

# హైకోర్టు కొత్త సిజెగా లీసా గిల్ ప్రమాణం

## గవర్నర్ అబ్దుల్ నజీర్ సమక్షంలో లోక్‌భవన్‌లో వేడుక

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** లోక్‌భవన్‌లో ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ లీసా గిల్ చే రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ లీసా గిల్‌తో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. నిన్న జస్టిస్ దీరజ్‌కుమార్ సింగ్ ఠాగూర్ సిజెగా పదవి విరమణ చేసారు.ఆయన స్థానంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం సుప్రీం కోర్టు కోలిజియం జస్టిస్ లీసాగిల్‌ను నియమించింది.ఇప్పటికే లీసా గిల్ ఏపీ హైకోర్టులో న్యాయ మూర్తిగా పనిచేస్తున్నారు. శనివారం సిజెగా ఆమె లోక్‌భవన్‌లో ప్రమాణం చేసారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేయడంతో ఆ బాధ్య >>2

## మరో 47మంది మావోయిస్టులు లొంగుబాటు

**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌ఘడ్‌లోని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, పీపుల్స్ లెబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్, దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీలోని మూడు, తొమ్మిది, 30వ బెటాలియన్‌కు చెందిన 47 మం ది అజ్ఞాత నక్సలైట్లు శనివారం డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా వీరు తమ వద్ద వున్న 32 ఆయుధాలను, 515 తూ టాలు, మందు పాతరలను పేల్చేందుకు వాడే వంద కిలోల కార్డ్‌టెక్స్ వైర్లు, 26 మ్యాగజైన్లను సమర్పించారు.ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఇప్పటికే మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారగా ఛత్తీస్‌ఘడ్ కూడా ఇదే దిశలో కొనసాగుతోందన్నారు.



## నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా డా.అశోక్

**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** నీతి ఆయోగ్‌లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. దీనికి కొత్త టీమ్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.నీతి ఆయోగ్‌కు వైస్ ఛైర్మన్‌గా సీనియర్ ఆర్థికవేత్త డాక్టర్ అశోక్ లాహిరిని నియమించింది. అలాగే మాలిక్యులర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ గోబర్దన్ దాస్ సభ్యుడిగా నియమితులయ్యారు. వైస్ ఛైర్మన్‌గా నియమితులైన అశోక్ లాహిరి నాలుగు దశాబ్దాలకు పైగానుదీర్ఘ అనుభవం ఉన్న దేశంలోని అత్యంత సీనియర్ ఆర్థికవేత్తలలో ఒకరుగా ఉన్నారు. ఆయన గతంలో భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా పనిచేశారు. అంతేకాకుండా ఫైనాన్స్‌కమిషన్ సభ్యునిగా కూడా విశేష సేవలందించారు.అదేవిధంగా ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధిబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటిముఖ్యమైన అంతర్జాతీయ సంస్థల్లో వివిధ హోదాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.




శనివారం మంగళగిరిలో ఈగిల్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిజిపి హరీశ్‌కుమార్ గుప్తా

## డ్రగ్స్ కేసులు విచారణకు

# 13 ప్రత్యేక కోర్టులు

## ఈగల్ హెడ్‌క్వార్టర్స్‌ను లాంఛనంగా నప్రారంభించిన డిజిపి హరీష్ కుమార్ గుప్తా

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** గంజాయి, డ్రగ్స్ కేసుల్లో నిందితుల విచారణకు రాష్ట్రంలో 13 ప్రత్యేక కోర్టులను పెట్టనున్నామని రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. ఈ కోర్టుల ద్వారా కేసుల విచారణ వేగవంతం కానున్నట్లు ఆయన వివరించారు. మంగళగిరిలోని రత్నాల చెరువులో కొత్తగా ఏర్పాటు చేసిన ఈగల్ హెడ్‌క్వార్టర్ కార్యాలయాన్ని డీజీపీ లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ కార్యకలాపాలను ఇక్కడి నుంచే పర్యవేక్షణ చేయనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ హరీశ్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ అక్రమరవాణా చేసే వారిపై ఈగల్ >>2

## ఉడుకుతున్న రాష్ట్రం

### నగరడోనలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

**విజయవాడ,ఏప్రిల్ 25, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఎండలు మండుతున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలకు తోడు వడగాడ్పులు తీవ్రంగా ఉన్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. శనివారం కర్నూలుజిల్లాలోని నగరడోనలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కడపలో 44.2 డిగ్రీలు అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, నంద్యాలజిల్లాలోని ఆళ్లగడ్డలో 44, మార్కాపురం జిల్లాలోని కంభం, శ్రీసత్యసాయి జిల్లాలోని తలుపలలో 43, అన్నమయ్య జిల్లాలోని నూలివీడు, పల్నాడు జిల్లాలోని గురజాలలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నెల్లూరుజిల్లాలోని కొమ్మిపాడులో 42.6, తిరుపతిజిల్లాలోని బేస్తపల్లిలో 42.5 అనకాపల్లి జిల్లాలోని దేవరపల్లె, పోలవరం(జి) ఎర్రంపేటలో 42.1డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. 28 జిల్లాలకుగాను 18జిల్లాల్లోని 172 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా >>2

# వడివడిగా 'పోలవరం'



## జూన్‌నాటికి అనకాపల్లి దాకా గోదావరి జలాలు

## శరవేగంగా సాగుతున్న ఎడమకాలువ పనులు

## నిర్మాణాలను పరిశీలించిన మంత్రి నిమ్మల

**కాకినాడ, ఏప్రిల్25,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం చెప్పింది చేస్తుంది, చేసేదే చెబుతుంది. ప్రజలకు జవాబు దారీతనంగా ఉంటుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ పనులను ఆయన శనివారం నాడు అన్నవరం సమీపంలోని పంపా ఆక్విడెక్టు, తుని మండలం లోని కుమ్మరిలోవ గ్రామం మరియు తదితర ప్రాంతాలలో క్షేత్ర స్థాయి లో పర్యవేక్షించారు. తునిలో ఈ కాల్వ పనులకు సంబంధించిన ఇంజనీరింగ్ నిపుణులు, అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన పర్యటన తాలూకు విశేషాలను, సమీక్షలో చర్చించిన అంశాలను మీడియా దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి జలాలను మొదటి దశ లో, జూన్ లోగా అనకాపల్లి వరకు తీసుకెళ్తామని రామానాయుడు చెప్పారు.నాడు జగన్ ఐదేళ్ల వికృత పాలన, విధ్వంసపాలన, తిరోగమన పాలనలో పోలవరం ఎడమ కాలువ పనులను గాలికి వదిలేసారని విమర్శించారు. అర బస్తా సిమెంట్ గాని, తట్టమట్టి గాని వేసిన దాఖలాలు లేవన్నారు. ఐదేళ్ల ఆ పాలనకు అలవాటు పడ్డ అధికార యంత్రాంగం తమ తీరు మార్చుకోవాలని,గడువు లోపల పనులు పూర్తిచేయాలని హెచ్చరించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు తన తొలి ప్రాధాన్యం గా పోలవరం ప్రాజెక్టుని సందర్శించారన్నారు. ఆ వెనువెంటనే అనకాపల్లి కొచ్చి ఎడమ కాలువ పనులు సందర్శించి జూన్ లోగా పనులు పూర్తి చేయాలని గడువు నిర్దేశించిన విషయాన్ని రామానాయుడు గుర్తు చేశారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు ఇప్పటివరకు 76 శాతం పూర్తయినట్లు రామానాయుడు చెప్పారు. జగన్ హయాంలోఎక్కడి పనులు అక్కడే ఆపేయడం వల్ల ప్రగతిని 20 ఏళ్లు వెనక్కి నెట్టేసాడని మంత్రి ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు కి, కుడి, ఎడమకాలువలకు భూములు, ఆస్తులు ఇచ్చిన నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని నిమ్మల వివరించారు. నిర్వాసితులకు జగన్ హయాంలో తీవ్ర అన్యాయం చేయగా చంద్రబాబు హయాంలో 2016, 2025 లలో మొత్తం మూడు దఫాలుగా 2200 కోట్లు ఇచ్చి నిర్వాసితులను నిండు మనసుతో >>2



## రాజమండ్రి జైలుకు ఎమ్మెల్సీ అనంతబాబు

### 14 రోజుల రిమాండ్

**కాకినాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కారు డ్రైవర్ తిరిమీది సుబ్రహ్మణ్యం హత్య కేసులో బెదిరించి డబ్బులతో ప్రలోభ పెట్టడం వంటి అభియోగాలపై ఎమ్మెల్సీ అనంత బాబుపై నమోదు చేసిన రెండో కేసులో శుక్రవారం రాజమహేంద్రవరం కోర్టు వద్ద అరెస్టయిన వైసిపి ఎమ్మెల్సీ అనంత బాబును కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు శనివారం మొబైల్ కోర్టులో హాజరుపర్చారు. తొలుత సర్పవరం పోలీస్ స్టేషన్ >>2

## హనీ ట్రాప్‌లో 'ప్రకంపనలు'

# మరో ఆరుగురు పోలీసులు ఔట్





## ఆలయ కమిటీ నుంచి అనంతకుమారి తొలగింపు

## దబ్బర రాజేష్ నాయుడుకు ఉద్వాసన

## రోజుకో మలుపుతో ఉత్కంఠ

## స్టేషన్ మెట్లెక్కిన మరో బాధితుడు

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** అనంత వలపు వల కేసులో ప్రకంపనలు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ హనీ ట్రాప్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ నయా హనీ ట్రాప్ దందాలో ముఠా సభ్యులతో చేతులు కలిపిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంతో పోలీసుశాఖలో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ ముఠా సభ్యులతో ఇదివరకే ప్రత్యక్ష పరోక్ష సంబంధాలు కలిగి ఉన్న ఇద్దరు సీఐలపై ఉన్నతాధికారులు విఆర్ కు పంపుతూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి ఉత్తర్వులు జారీ చేసి చేయడం తెలిసిందే. ఎంతో క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖ ప్రతిష్టను దిగజారే విధంగా ప్రవర్తించిన తీరుపై పోలీసు ఉన్నతాధికారులు కన్నెర్ర చేశారు. ఇందులో భాగంగానే రాప్తాడు శ్రీహర్ష తో పాటు అనంతపురం సీఐ రాజేంద్రనాథ్ కర్నూలు డిఐజి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇది కాస్త పోలీస్ శాఖలో దడ పుట్టిస్తున్నాయి. తాజాగా శనివారం మరో ఆరుగురు పోలీసులపై ఉక్కు పాదం మోపారు. అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఓ ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, మరో ముగ్గురు కానిస్టేబుళ్లు, అలాగే ఇటుకులపల్లి పోలీస్ స్టేషన్లో పనిచేసే మరో కానిస్టేబుల్‌ను విఆర్‌కు పంపుతూ >>2




డిజిటల్ సేవలకుగాను జాతీయ అవార్డు అందుకుంటున్న ఐటీవిభాగం చీఫ్ ఇంజనీరు వై. శ్రీనివాసరావు

# ఆర్టీసీకి మరో ప్రతిష్టాత్మక అవార్డు

## ఉత్తమ స్థాయిలో డిజిటల్ సేవలకు పురస్కారం

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్‌ఆర్టీసీ మరో ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు లభించింది. ప్రయాణికులకు ఉత్తమ సేవలతోపాటు మారుతున్న సాంకేతికతను సమర్థంగా అందిపుచ్చుకొని డిజిటల్ సేవల్లో ముందువరుసన కొనసాగుతున్నందుకు ఏపీఎస్‌ఆర్టీసీ ఈ అత్యు >>2



శనివారం ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ లీసా గిల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సిఎం చంద్రబాబు

## జస్టిస్ లీసా గిల్‌కు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ,ఏప్రిల్25,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ లీసాగిల్‌కు ఏపీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లీసా గిల్‌తో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు తెలిపి, పుష్ప గుచ్ఛాన్ని, జ్ఞాపికను అందజేసారు.

## హైకోర్టు కొత్త సిజెగా లీసా గిల్ ప్రమాణం

>> తలను జస్టిస్ లీసా గిల్ చేపట్టారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన ఆమె విజయవాడలోని లోక్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారులు హాజరయ్యారు.ఇక35 ఏళ్లకు పైగా సుదీర్ఘ అనుభవం: జస్టిస్ లీసా గిల్‌కు న్యాయవ్యవస్థలో 35 ఏళ్లకు పైగా సుదీర్ఘ అనుభవం ఉంది. మాజీ న్యాయమూర్తి జస్టిస్ హర్పాల్ సింగ్ బ్రార్ కుమార్తెన జస్టిస్ లీసా గిల్ నవంబర్ 17, 1966న చండీగఢ్‌లో జన్మించారు. పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి బీఏ ఎల్ ఎల్‌బీ, ఎల్ ఎల్ ఎం పూర్తి చేశారు. 1990లో న్యాయవాదిగా నమోదు చేసుకుని, పంజాబ్ హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 24 ఏళ్లపాటు సివిల్, క్రిమినల్, రెవెన్యూ విభాగాలకు సంబంధించిన కేసులు వాదించారు. ఆపై చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి సుదీర్ఘకాలం ప్రభుత్వ న్యాయవాదిగా, పలు బోర్డులు, కార్పొరేషన్లకు ప్రతినిధిగా పనిచేశారు. 2014 మార్చి 31న పంజాబ్ హరియాణా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

## రాజమండ్రి జైలుకు ఎమ్మెల్సీ అనంతబాబు

>> నుంచి కాకినాడ జిజిహెచ్‌కు తరలించి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయనను నేరుగా మొబైల్ కోర్టులో హాజరుపర్చారు. ఇదిలావుండగా శుక్రవారం రాత్రంతా అనంత బాబును పోలీసులు విచారించారు. ఈ సందర్భంగా పోలీస్ విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించలేదని తెలుస్తోంది. పోలీసులు 30 ప్రశ్నలు సంధిస్తే.. కేవలం ఆరు ప్రశ్నలకు మాత్రమే అనంతబాబు జవాబు ఇచ్చారు. ఈ హత్య కేసులో సాక్షులకు నగదు ఇచ్చిన వాళ్లు ఎవరో తనకు తెలియదంటూ పోలీసులతో సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను నగదు ఇచ్చి లొంగదీసుకునేందుకు వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు ప్రయత్నించారు. తన మాట వినకుంటే చంపేస్తామంటూ వారిని బెదిరించారు. ఈ విషయం బహిర్గతం కావడంతో.. కాకినాడలోని సర్పవరం పోలీసులు రంగంలోకి దిగారు. సదరు సాక్షులను పోలీసులు విచారించారు. అనంతబాబు బెదిరింపులు నిర్ధారిఃచుకుని అనంతబాబును అరెస్ట్ చేసేందుకు కాకినాడలోని నివాసానికి పోలీసులు వెళ్లారు. అప్పటికే ఆయన అక్కడి నుంచి తప్పించుకున్నారు. అయితే శుక్రవారం రాజమండ్రి జిల్లా కోర్టులో విచారణకు అనంత బాబు హాజరయ్యారు. దీంతో ఆయన్ని పోలీసులు అరెస్ట్ చేసి సర్పవరం పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ కేసు లో విచారణ అనంతరం కాకినాడ మొబైల్ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు అనంతబాబును కస్టడీలోకి తీసుకొని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

# వడివడిగా 'పోలవరం'

>> కుమ్మరిలోవ గ్రామంలోని 472 కుటుంబాలకు 30.3 కోట్లు నష్టపరిహారం అందించామన్నారు.అత్యంత ప్రతిష్టాకరమైన, అలాగే ఉత్తరాంధ్ర ఉజ్వల భవిష్యత్తుకు మూలమైన పోలవరం ఎడమ కాలువ పనులు చేపట్టు నిమిత్తం రూ.1460 కోట్లు కేటాయించిన ఘనత తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వానిదే నన్నారు. అన్నవరం సమీపంలోని ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల దగ్గర హైవే క్రాసింగ్ వంతెనల నిర్మాణ పనులను పర్యవేక్షి ంచారు. నేషనల్ హైవేల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పనులు ఆలస్యం చేస్తే, ఉపేక్షి ంచేది లేదని అధికారులు, ఏజెన్సీ లను మరో మారు హెచ్చరిం చారు.ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో గోదావరి జలాలు ఎంతో కీలక మైనవిగా స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర కు గోదావరి జలాలు తరలించడానికి, పోలవరం ఎడమ ప్రధాన కాలువే ఆధారం కనుక ఫస్ట్ పేజ్ పూర్తి చేయడం ఎంతో కీలకమని అధికార యంత్రాంగానికి తెలియచెప్పారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు సైతం నీటి సమస్య లేకుండా గోదావరి జలాలు అందిస్తా మన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులను ప్రీ క్లోజర్ చేసి ఉత్తరాంధ్ర ప్రజలపై జగన్ కక్ష కట్టిన వైనాన్ని ఎండగట్టారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుండి 8,122 క్యూసెక్కులకు తగ్గిస్తూ ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు జగన్ నాడు గండికొట్టాడన్నారు. పోలవరం ఎడమ కాలువ పూర్తి చేయడం ద్వారా కాలువ మొదటి నుంచి తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండి, 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిజ్ నిర్మాణం పూర్తయి 67674 ఎకరాల, ఏలేరు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని మంత్రి చెప్పారు. అలాగే ఎడమ ప్రధాన కాలువ ప్రవహించే మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మంది జనాభాకు తాగు నీరు సౌకర్యం కలుగుతుందన్నారు. పాయకారావుపేటకి ఎగువన ఉన్న 98 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని రామానాయుడు వివరించారు. ఈ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వసలహాదారు యం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ, ఛీఫ్ ఇంజనీరు కె.నర్సింహ మూర్తి, ఎల్ఎంసి, ఎస్ఈ ఏసుబాబు, తుని ఈఈ గోవింద్, జగ్గపేట ఈఈ శ్రీనివాసు పాల్గొన్నారు.

# ఉడుకుతున్న రాష్ట్రం

>> ఉష్ణోగ్రతలు రికార్డిం దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.ఎండలో బయటకు వెళ్లేటప్పుడు టోపిలాంటివి ధరించాలి. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలన్నారు. అదేవిధంగా కళ్ళ రక్షణ కోసం నాణ్యమైన సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదన్నారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 23 మండలాల్లో ఆదివారం (2604 26) వడగాల్పులు వీచే అవకాశం ఉందనిరాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు వడగాలులు, ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం వడగాల్పులు 23 మండలాల్లో వీచే అవకాశం ఉందన్నారు.విజయనగరం జిల్లా:లో బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, మెంటాడ, రామభద్రాపురం, వంగర మండలాలు.పార్వతీపురంమన్యం జిల్లా:.. బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతానగరం, వీరఘట్టం మండలాలు,అల్లూరి జిల్లా జికె వీధి మండలం పోలవరం జిల్లాలో చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించారు.

## ఇరాన్‌తో చర్చలకోసం పాక్‌కు వెళ్లొద్దని చెప్పా: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 25:** ఇరాన్‌తో చర్చలకోసమని పాకిస్తాన్‌కు వెళ్లబోయే అమెరికా ప్రతినిధిబృందానికి ఆదేశం వెళ్లవద్దని ట్రంప్ ఆదేశించారు. ఫలితంలేని చర్చలకోసం అంతదూరం ఎందుకని తానే వద్దన్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికాతో నేరుగా చర్చలు ఉండవని చెప్పిన ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరాగ్చీ బృందం పాకిస్తాన్‌నేతలతో సమావేశం అయి తమ డిమాండ్ల జాబితాను అందచేసి తిరిగి వెళ్లిపోయింది. దీనితో ట్రంప్ ఆగ్రహానికి లోనయ్యారు. అలాగే వైట్‌హౌస్‌నుంచి ఊట్ విట్కాఫ్, జారెడ్‌కుష్ణర్‌లు కూడా శాంతిచర్చలకోసం ఇస్లామాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధం అయ్యారు. ఉపాధ్యక్షుడు జెడివాన్స్ మాత్రం చర్చలను వైట్‌హౌస్‌నుంచి పర్యవేక్షిస్తారు. ఫలితంలేని చర్చలకోసం ఎందుకని చెప్పానని, అయితే ఇరాన్ తమను ఎప్పుడయినా సంప్రదించవచ్చని అన్నారు. అమెరికా ట్రంప్ వ్యాఖ్యలతో ఇస్లామాబాద్‌లోజరగాల్సిన రెండో విడత చర్చలకు బ్రేక్‌పడింది. ఈ భేటీపై పాక్‌ప్రధాని షెహబాజ్‌షరీఫ్ స్పందిస్తూ ప్రస్తుత పరిస్థితులతోపాటు మరికొన్ని ఇతర అంశాలపైనా సమగ్ర చర్చలు జరిపామని అన్నారు. అమెరికా చర్చల విషయం మాత్రం స్పష్టం చేయలేదు.

# పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

>> జనాభాను సాధించలేమని అన్నారు. భారత ఫెర్టిలిటీ రేటు 1.9 శాతం ఉందని.. ఏపీలో అది 1.5శాతం మాత్రమే ఉందని.. అందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. భవిష్యత్తులో జనాభా ఉన్న దేశాలే అత్యంత సంపన్న దేశాలుగా మారుతాయని వివరించారు. ఈ నేపథ్యంలోనే ఏపీలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని తీసుకువచ్చి అమలు చేయాలని నిర్ణయించామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**సంస్కరణలతో మిగులు విద్యుత్ సాధించాం..**

గతంలో విద్యుత్ సంస్కరణలను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసి మిగులు విద్యుత్ సాధించాం. రాష్ట్రంలో వినియోగదారులకు మేలు కలిగేలా నియంత్రణా కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశాం. సౌర, పునరుత్పాదక విద్యుత్‌కు పెద్ద ఎత్తున ప్రోత్సాహం కల్పించాం. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ, బ్యాటరీ, పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ అమ్మోనియా లాంటి రంగాల్లో విద్యుత్ ఉత్పత్తి కావాలి. అప్పుడే ఇంధన రంగంలో భారత్ అగ్రస్థానంలో ఉంటుంది. డీజిల్, పెట్రోలు, గ్యాస్ లాంటి ఇంధనాలతో పాటు విద్యుత్ ఉత్పత్తి అనేది కీలకం. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేస్తేనే ప్రయోజనాలు ఉంటాయి. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పాదన చేయాలని ప్రధాని లక్ష ్యం విధిస్తే అందులో ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష ్యం పెట్టుకున్నాం. ఇప్పటికే 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా ముందడుగు వేశాం. ప్రొజ్యూమర్ అనే విధానంలో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పాదన చేసి త్వరలోనే ఎగుమతులు సాధించగలుగుతాం. గతంలో సౌర విద్యుత్ ప్యానళ్ల కోసం చైనాపై ఆధారపడే వాళ్లం. ఇప్పుడు వాటిని దేశీయంగానే ఉత్పత్తి చేయగలుగుతున్నాం. గ్రీన్ అమ్మోనియా లాంటి వాటి ద్వారా ఈ ఇంధన లక్ష్యాలను చేరుకోగలుగుతాం. డేటా సెంటర్లకు కూడా పెద్ద ఎత్తున విద్యుత్ కావాలి. గూగుల్ సంస్థ విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. 28న మేం విశాఖలో గూగుల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయబోతున్నాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ఫ్యూచర్ సిటీగా అమరావతి నిర్మాణం:** "ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం ద్వారా దేశానికి టెక్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేయగలి గాం. రాష్ట్ర విభజన అనంతరం ఇప్పుడు అమరావతి రాజధాని నిర్మాణం ద్వారా నాకు మరో నగర నిర్మాణం చేసే అవకాశం దక్కింది. ఫ్యూచర్ సిటీగా గ్రీన్, బ్లూ సిటీ, నెట్ జీరో కాన్సెప్టుతో హైదరాబాద్ ప్లస్ నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. రెవెన్యూ వస్తేనే సంక్షేమం చేయగలం. అభివృద్ధితో పాటు సంక్షేమం కూడా కీలకమైన అంశం. మన సమా జం కేవలం మిలియనీర్లు, బిలియనీర్ల కోసం మాత్రమే కాదు. సాధారణ ప్రజలది కూడా. అందుకే పీ4 పేరిట వారిని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపకల్పన చేశాం. సమాజంలో ప్రతీ ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందాలి. పది శాతం మంది ధనవంతులు మార్గదర్శులుగా మారిసమాజంలో 20 శాతం మంది పేదలను ఆదుకునేలా పీ4 కార్యక్రమాన్ని రూపొందించాం. ఎంబీకే 1020 అనే ఫార్ములాతో సమాజంలో అట్టడుగున ఉండిపోయిన వారిని సంపద ఆర్జించిన వారు ఆదుకోవటమే ఈ కార్యక్రమం."అని




సంక్షోభ నివారణపై అధ్యయనం చేస్తున్న ఏపీ మంత్రుల బృందం

## సంక్షోభ నిర్వహణపై అధ్యయనం

### సింగపూర్‌లో కొనసాగిన మంత్రుల బృందం పర్యటన

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:**సంక్షోభ నిర్వహణ వ్యవస్థ గురించి మంత్రుల బృందం సింగపూర్‌లో అధ్యయనం చేస్తోందిఏపి మంత్రుల పర్యటన సింగపూర్‌లో ఐదోరోజు శనివారం కొనసాగుతోంది. విపత్తు వేళల్లో ప్రభుత్వం ఏవిధంగా పని చేస్తుందో.. ఎస్‌యూఎస్‌ఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రజ్వానా వివరించారు. సంక్షోభంలో నాయకత్వం, నైతిక నిర్ణయాల ప్రాధాన్యత, రాబోయే ప్రమాదాలను ముందే ఊహించి సిద్ధంగా ఉండటం వంటి అంశాలపై చర్చించారు. మంత్రుల బృందంలో అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, వంగలపూడి అనిత, సత్యకుమార్, తదితరులు ఉన్నారు.

# 13 ప్రత్యేక కోర్టులు

>> దృష్టి పెట్టిందన్నారు. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ మా లక్ష్యం అన్నారు. ఆ దిశగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి కొన్ని ముఠాలు మాదకద్రవ్యాల క్రయ విక్రయాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నాయి, వారిని అదుపులోకి తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. డ్రగ్స్ వినియోగం, సరఫరాపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలి. ఈగల్ సంస్థ ఏడాదిన్నర కాలంలో గంజాయి, డ్రగ్స్ నిరోధించడంలో మంచి పనితీరు కనపరిచిందని ప్రశంసిం చారు.డ్రగ్స్ పరీక్షలకు 10వేల కిట్లు: రాష్ట్రంలో వేల ఎకరాల్లో ఉండే గంజాయి సాగును ప్రస్తుతం జీరో స్థాయికి తెచ్చారని గుర్తు చేశారు.

ఎన్డీపీఎస్ యాక్టు అమలులో రాష్ట్రం ముందు వరుసలో ఉం దన్నారు. గంజాయి వినియోగదారులపై ప్రస్తు తం దృష్టి పెడుతున్నామని, విజయవాడలో డ్రగ్స్ టెస్టింగ్ కిట్స్ ద్వారా అనుమానితులకు పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్ర మంతటా డ్రగ్స్ పరీక్షలు చేయనున్నామని 10వేల కిట్లను తెప్పిస్తున్నామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ నిరోధానికి సాంకేతికను పకడ్బందీగా అమలు చేస్తున్నామని డీజీపీ చెప్పారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ సొసైటీగా మార్చడమే తమ లక్ష ్యమని డీజీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ ఐజి ఆకే రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ కార్యకలాపాలను విస్తరించినట్లు తెలిపారు. 28 జిల్లాల్లో ఈగల్ సెల్స్ ఏర్పాటు పూర్తయ్యాయని, మూడు ప్రాంతాల్లో ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌లు పనిచేస్తున్నాయని చెప్పారు.గంజాయి నిర్మూలనకు 'ఆపరేషన్ చైతన్యం' చేపట్టగా, డ్రోన్స్, శాటిలైట్స్‌తో పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. ఒడిశాలోని గంజాయి సాగు రాష్ట్రాలపై నిఘా పెట్టి అక్కడి ఏజెన్సీలతో సమన్వయం కొనసాగిస్తున్నామని తెలిపారు. 21 రైళ్లపై ప్రత్యేక మానిటరింగ్ నిర్వహిస్తూ, జీఆర్పీ, ఆర్పీఎఫ్, డాగ్ స్క్వాడ్‌లతో సంయుక్త కార్యాచరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులను డ్రగ్స్ నుంచి దూరంగా ఉంచేందుకు ఆపరేషన్ "సేఫ్ క్యాంపస్ జోన్స్ ను ప్రారంభించినట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల మంది విద్యార్థులకు రక్షణ కవచంగా ఈ కార్యక్రమం పనిచేస్తుందని పేర్కొన్నారు."వజ్ర ప్రహార్‌తో 849 హాట్‌స్పాట్స్ గుర్తించగా, "ఆపరేషన్ గరుడ్తాతో డ్రగ్స్ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓపియాడ్ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుం టున్నామని ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ స్థాయిల ఉన్నత పోలీ సు అధికారులు ఆర్.జయలక్ష్మి ్మ,బి.రాజ కుమారి, బి. సత్య ఏసుబాబు, ఆర్.యన్. అమ్మిరెడ్డి, జి. కృష్ణకాంత్, బి.కృష్ణారావు. ప్రకాష్, ,కే.శ్రీనివాస్, కేయమ్ మహేశ్వర రాజు, కే.నగేష్ బాబు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మరో ఆరుగురు పోలీసులు ఔట్

>> ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఖాకి వర్గాల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఇలా ఈ హనీ ట్రాప్ కేసు రోజుకో మలుపు తిరగడంతో పోలీసు ఉన్నతాధికారులు రేపు ఎవరిపై చర్యలు తీసుకుంటారోనని ముఠా సభ్యులతో చేతులు కలిపిన పోలీసులు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనంతపురం జిల్లాలో ఒకేసారి 8 మంది పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవడం హాట్ టాపిక్ గా మారింది. జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా హనీ ట్రాప్ కేసు విషయాలు చర్చకు దారితీస్తున్నాయి. ఈ వలపు వల కేసులో ఇప్పటికే హాని ముఠాలో ఐదు మందిని అరెస్టు చేయడం జరిగింది. ఇందులో ప్రధాన సూత్రదారి పాత్ర పోషించిన అనంత కుమారికి ఆలయ కమిటీ నుండి శాశ్వతంగా తొలగించడం మరింతగా చర్చానీయంశం అయింది. అనంతపురం మొదటి రోడ్డు లో ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయంలో గత ఏడాది నిర్వహించిన ఆలయ కమిటీలో బిజెపిపార్టీకి చెందిన అనంత కుమారిని నియమించారు. అయితే గత కొంతకాలంగా జిల్లాలో మార్మోగుతున్న హనీ ట్రాప్ విషయం గురించి తెలుసుకున్న దేవాలయ కమిటీ ఛైర్మన్ నరేంద్ర చౌదరి, పాలకమండలి సభ్యులు ఆమెను పాలకమం డలి కమిటీ సభ్యురాలుగా ఉండకుండా తొలగించారు. ఈమెరకు వారు శనివారం సాయంత్రం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇకపోతే హాని ట్రాప్ ముసుగులో నిందితుడుగా ఉన్న అనంతపురం టిడిపి నాయకుడు దబ్బర రాజేష్ నాయిడుపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడంతో టిడిపి అధిష్టానం ఉద్వాసన పలికింది. టిడిపి నుండి దుబ్బర రమేష్ నాయుడు ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోవడంపై చర్చకు దారి తీసింది. తమ పార్టీ పరువును దిగజార్చి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొన్న రాజేష్ పై టిడిపి వాటినుండి తొలగించేసింది. వలపు వలలో ఇరుక్కున్న మరో 62 ఏళ్ళ బాధితుడు ధైర్యంతో శనివారం ముందడుగు వేసినట్లు సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పోలీసు అధికారులు అతను ఇచ్చిన ఫిర్యాదు పై లోతుగా దర్యాప్తు చేపట్టారు.

ముఖ్యంగా రుద్రంపేట మాజీ ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి విషయంలో అటు వైసీపీ ఇటు టిడిపి ద్వంద వైఖరిని అవలంబిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నరేంద్ర రెడ్డిని వైసీపీ నుండి ఎప్పుడో తొలగించామంటూ నగర మాజీ మేయర్ మహమ్మద్ వసీమ్, అనంతపురం నగర వైసిపి అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి ప్రకటించడం రాజకీయ దుమారాన్ని లేపింది. అలాగే ప్రస్తుత అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ గెలుపునకు సహకారం అందించిన నరేందర్ రెడ్డి టిడిపికి చెందిన వాడేనంటూ వైసీపీ నేతలు పేర్కొనడంతో పొలిటికల్ హీట్ ఎక్కింది. మరో వైపు అనంతపురం అర్బన్ టిడిపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించి నరేందర్ రెడ్డి వైసీపీ పార్టీ తరఫున ఉపసర్పంచిగా గెలుపొందాడని, ఇతను ముమ్మాటికి వైసిపి పార్టీకి చెందిన వాడేనంటూ ఆరోపణలు చేయడం రాజకీయ రంగంలో ప్రకంపనలు సృష్టించాయి.



శనివారం లోక్‌భవన్‌లో జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో సిఎం చంద్రబాబు

# గవర్నర్ నజీర్‌కు అస్వస్థత

### లోక్‌భవన్‌లో పరామర్శించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ .అబ్దుల్ నజీర్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు.స్థానిక ఒక ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఆయన తిరిగి లోక్‌భవన్‌కు చేరుకున్నారు. స్వల్ప అస్వస్థత కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన గవర్నర్ ను సీఎం పరామర్శించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై కొద్దిసేపు గవర్నర్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. మరో 10 రోజుల్లో నిర్వహించనున్న మూడు రోజుల ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల గురించి సీఎం చంద్రబాబు జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు వివరించినట్లు సమాచారం. మహిళా బిల్లుపై విపక్షాలు వ్యతిరేకించిన విషయం ఈ మూడు రోజుల సమావేశాలు కీలక అజెండా ఉంటుందని జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు సీఎం వివరించినట్లు సమాచారం.

## ఆర్టీసీకి మరో ప్రతిష్టాత్మక అవార్డు

>> న్నతమైన జాతీయ అవార్డును అందుకుంది. గతంలో 2025 సంవవత్సరానికి పీఎస్ఈ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అవార్డుకు ఏపీఎస్ ఆర్టీసీ ఎంపికైంది. ప్రధానంగా సంస్థలోని యూనిఫైడ్ కమ్యూనికేషన్స్ విభ ాగంలో డిజిటల్ సేవల సామర్థ్యాన్ని పెంపొం దించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సమర్థంగా వినియోగించనందుకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండియా పీఎస్ఈ సమ్మిట్‌లో ఆర్టీసీ వీసీ ఎండీ బాలసుబ్రమణ్యం తరఫున ఐటీవిభాగం చీఫ్ ఇంజనీరు వై.శ్రీనివాసరావు ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుపై ఆర్టీసీ వీసీఎండీ బాలసుబ్రమణ్యం హర్షం వ్యక్తంచేస్తూ ఇందుకు కృషి చేసిన అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందిని అభినందించారు.గతంలో సైతం ఏపీఎస్ ఆర్టీసీకిఎన్నో పురస్కారాలు వరించగా ఈ అవార్డుతో మరో కలికితురాయి ఆర్టీసీ ఖాతాలో చేరినట్లైంది.

# తిరుపతిలో 'గ్రీన్ షాప్'

**తిరుపతి,ఏప్రిల్25ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రయోగాత్మకంగా తొలిసారిగా తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి గ్రామ పంచాయతి షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఎక్స్‌క్లూజివ్ గ్రీన్ షాప్ ప్రారంభమైంది. ఈ దుకాణాన్ని శనివారం మధ్యాహ్నం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని,తిరుపతి డి.పి.ఒ సుశీల దేవి ప్రారంభోత్సవం చేశారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను జీరో వేస్ట్ పంచాయతీలుగా మార్చడానికి చేపడుతున్న చర్యలలో భాగంగా మరొక నూతన ప్రయోగాన్ని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ ఆదేశానుసారం ఈ గ్రీన్‌షాప్‌కు శ్రీకారం చుట్టారు. ఇదివరకే చెర్లోపల్లి గ్రామ పంచాయతీలో హరిత రాయబారుల ద్వారా చేపడుతున్న చెత్త సేకరణలో తడి చెత్తను, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్ట్ గా తయారుచేసి విక్రయిస్తున్న విషయం తెలిసిందే. అదేవిధంగా పొడి చెత్తను స్వచ్ఛ రథాల ద్వారా సేకరిస్తూ కుటుంబాలకు చెత్తకు బదులుగా నిత్యవసర వస్తువులను అందిస్తూ మొదలుపెట్టిన వినూత్న ప్రయోగం రాష్ట్రవ్యాప్తంగా నిర్విరామంగా కొనసాగుతుంది. మేజర్ గ్రామపంచాయతీలలో రీసైక్లింగ్ కు అనుకూలమైన వ్యర్థాలను అందించి వాటి విలువకు సమానమైన వస్తువులను పొందుటకు ప్రయోగకాత్మకంగా తీసుకొచ్చిన కొత్త విధానమే ఈ" "గ్రీన్ షాప్". స్వచ్ఛ రథాల తరహాలో వారానికి ఒకటి రెండు రోజులు గ్రామంలో అందుబాటులో ఉండే విధంగా కాకుండా ఈ గ్రీన్ షాపులు ప్రతిరోజు పనిచేస్తాయి.

వినియోగదారులు తమ కుటుంబాలలో వాడేసిన న్యూస్ పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్, ఇనుము, అల్యూమినియం మొదలగు వస్తువులు రీసైక్లింగ్కు అందించకుండా పడేయడంతో అవి వాతావరణ కాలుష్యాన్ని కలుగ చేయడమే కాకుండా కుటుంబానికి ఎటువంటి ఉపయోగం లేకుండా పోతున్నాయి. ఇవే వస్తువులు గ్రీన్ షాపుకి అందించడం ద్వారా ఆ తూకానికి సమానమైన ధరకు తగిన పప్పులు, నూనెలు, పుస్తకాలు, స్టీల్ సామాన్లు, సబ్బులు, షాంపులు వంటి నిత్యవసర వస్తువులను వస్త మార్పిడి విధానం ద్వారా పొందవచ్చును. తద్వారా గృహాల్లోని వ్యర్థాలు ఆదాయ వనరుగా మారుతుంది. ఈ నూతన గ్రీన్ షాప్ విధానం ద్వారా ఉపాధి కల్పనతో పాటు గృహాలలో ఉత్పన్నమయ్యే చెత్తను పూర్తి సాంకేతికంగా ప్రాసెసింగ్ చేయుటకు అలానే గ్రామాలను వ్యర్థాల రహిత గ్రామాలుగా మార్చడానికి ఎంతో తోడ్పాటున అందిస్తుందని ఎమ్మెల్యే పులివర్తి నాని గారు తెలిపారు. అదేవిధంగా చెర్లోపల్లి గ్రామపంచాయతీ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాలు వాళ్లు కూడా ఈ గ్రీన్ షాపును వినియోగించవలసిందిగా కోరారు.

## వారం - వర్జ్యం

26-04-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
దశమి సా.6.11
మఖ రా.8.30
వర్జ్యం : ఉ.8.19-ఉ.9.57, 2)తె.4.47-ఉ.6.26
దు.సా.4.40-సా.5.31
శుభసమయం: ఉ.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వారఫలం

**మేషం:**విలువైన వస్తువులు భద్రత కొత్త వస్తువులను కొనుగోలుచేయునప్పుడు ఇన్సూరెన్స్ విషయమై మరువకండి.

**వృషభం:**అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం రెండు ముప్పుగా పరిణ మిస్తాయి. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వస్త్రలాభం.

**మిథునం:**అర్థం లేని రాద్ధాంతాలతో కాలాన్ని వృధాగా గడుపుతున్నటువంటి శ్రేయోభిలాషులకు హితోపదేశం చేస్తారు.

**కర్కాటకం:**అభివృద్ధే ధ్యేయంగా అడుగులు ముందుకు వేస్తారు. కొంత పురోభివృద్ధిని కూడా సాధిస్తారు. బంధువుల కలయిక.

**సింహం:**కార్యలయంలో మెరుగైన పనితనాన్ని కనబరచి అధికారుల మెప్పును అందుకోగలుగుతారు. వస్త్రలాభం.

**కన్య:** వృత్తి పరంగా మీరు చూపే శ్రద్ధ ప్రశంసనీయంగా ఉంటుంది. వీసా, పాస్పోర్ట్ వంటి అంశాలు సానుకూల పడుతాయి.

**తుల :** నూతనగృహం, వాహనం కొనుగోలు దాదాపుగా ఖాయమవుతుంది. సోదరులను కలుస్తారు. వస్త్రలాభం.

**వృశ్చికం:**కీలక విషయాలలో ఆచితూచి వ్యవహరించడం మంచిది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా వుంటుంది.

**ధనుస్సు:** బంధువులతో ఏర్పడిన తగాదాలు తొలగుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.శుభవార్తలు అందుకుంటారు.

**మకరం:** చేపట్టిన పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. పుణ్యక్షేత్ర సందర్శనం దక్కుతుంది.వాహనసౌఖ్యం.

**కుంభం:** కుటుంబ ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. సుదీర్ఘమైన ఫోన్ సంభాషణలు సాగిస్తారు. వస్త్రలాభం.

**మీనం:**లాభం నష్టం రెండూ సరి సమానంగా ఉంటాయి. వస్తు భద్రతపట్ల జాగ్రత వహించండి. ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హెల్మెట్ భారం కాదు - బాధ్యత

**- అభయ గ్రామాలకు ప్రత్యేక సహాయం అందిస్తాం - కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**- జిల్లాలో తొలిసారిగా హెల్మెట్ బ్యాంకులు - ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** హెల్మెట్ ధరించడం భారం కాదు, ప్రతి వాహనదారుడి బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయట పడాలంటే హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 'అభయం' పేరిట హెల్మెట్ ధారణపై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరై ర్యాలీని ప్రారంభించి, స్వయంగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ అవగాహన కల్పించారు. ఈ ర్యాలీ రామలక్ష్మణ కూడలి నుండి సూర్యమహల్ జంక్షన్ మీదుగా అరసవెల్లి జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం 'అభయం - హెల్మెట్ బ్యాంక్'ను ప్రారంభించి, పోస్టర్, అభయం యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి హెల్మెట్ ఒక రక్షణ కవచంలా పని చేస్తుందని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో అధిక శాతం ద్విచక్ర వాహనదారులేనని పేర్కొన్నారు. లక్షల రూపాయల విలువైన వాహనాలు కొనుగోలు చేసే వారు తక్కువ ధరలో లభించే హెల్మెట్ కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చూపకూడదని తెలిపారు. హెల్మెట్ ధరించడం అలవాటుగా చేసుకొని, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, శ్రీకాకుళం నగరాన్ని సురక్షిత నగరంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయికి విస్తరించి అవగాహన పెంపొందిస్తామని, ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించే గ్రామాలను 'అభయ గ్రామాలు'గా గుర్తించి, ఆయా గ్రామాలకు ప్రత్యేక సహాయం అందిస్తామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. అలాగే అతివేగం, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న వారిలో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. తలకు గాయాలు తీవ్రమైన ప్రమాదాలకు దారి తీస్తాయని, హెల్మెట్ ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని అన్నారు. శ్రీకాకుళంలో సుమారు రెండు లక్షల వాహనాలు ఉన్నప్పటికీ, వాటిలో సుమారు 5 శాతం మంది హెల్మెట్‌ను వినియోగించడం గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా చేయాలనే ఉద్దేశంతో హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. హెల్మెట్ బ్యాంక్ ద్వారా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి తాత్కాలికంగా హెల్మెట్ అందజేసి, వారి వివరాలు నమోదు చేసి, వారు స్వయంగా హెల్మెట్ కొనుగోలు చేసిన తరువాత నిర్దిష్ట కాలంలో తిరిగి అందజేయించే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

## తెలుగుభాషను కాపాడుకుందాం

**ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**

**పలమనేరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** కన్నతల్లి లాంటి తెలుగుభాషను కాపాడుకుందామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరులోని సాయినగర్‌లో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ పరభాషా వ్యామోహంలో తెలుగు భాషను మరువవద్దని పూర్వవైభవం తీసుకు రావడానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రాంతీయ గ్రంథాలయాలను బలోపేతం చేసుకోవాలని తెలుగుబాషా పరిరక్షణను ఈ తరం యువత కొనసాగించాలని సూచించారు. ముఖ్య అతిధిగా విచ్చేసి జాతీయ సభకు అధ్యక్షత వహించిన అవనిగడ్డ ఎమ్మెల్యే తెలుగుభాషా సంఘం పూర్వ అధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ మాతృభాష మనుడగకు ప్రభుత్వ సహకారం, ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రపంచం గర్వించే రచనలు తెలుగులో ఎన్నో వచ్చాయని తెలుగుబాషా సాహిత్యాలతో పాటు అనువాద సాహిత్యం కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని ప్రాంతాల గ్రంథాలయాలను బలోపేతం చేసుకోవాలని తెలుగుబాషా పరిరక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రముఖ రచయిత డా.జి.వి.పూర్ణచంద్ తెలుగు సాహిత్య వికాసానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వమంచి వికాసానికి మంచి పుస్తకాలు ఉపయోగపడతాయని అందుకే నీతి పుస్తకాలు లక్షలాది సంఖ్యలో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

### పంచాయతీల్లోనూ 5శాతం ఆస్తి పన్ను రాయితీ..

**- మే 1 నుంచి 31లోపు 2026- 27 ఆర్థిక సంవత్సరం పన్ను చెల్లించే వారికి ఈ అవకాశం**

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీల్లోనూ 5 శాతం ఆస్తి పన్ను రాయితీని ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పుర, నగరపాలక సంస్థల తరహాలో పంచాయతీల్లోనూ 5శాతం ఆస్తి పన్ను రాయితీ మొదటిసారి ప్రకటించారు. మే 1 నుంచి 31లోపు 2026- 27 ఆర్థిక సంవత్సరం పన్ను చెల్లించేవారికి రాయితీ ఇవ్వనున్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం శుక్రవారం ఈ ప్రకటన చేసింది. మే 1 నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్లో ఆస్తి పన్ను చెల్లించొచ్చు. ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ విజ్ఞప్తి చేశారు.

# గంజాయి చోరీకి పాల్పడిన కానిస్టేబుల్ రాంబాబు 'డిస్మిస్'

**- విజయనగరం ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**

**విజయనగరం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా ఎస్.కోట పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ, పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసిన గంజాయిలో దాదాపు 20 కిలోలను 2022 సంవత్సరంలో చోరీకి పాల్పడిన ఘటనలో శాఖాపరమైన విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో విధుల నుండి 'డిస్మిస్' చేస్తూ జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ ఏప్రిల్ 25న ఉత్తర్వులను జారీ చేసారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ పోలీసు విధులు క్రమశిక్షణ, అంకితభావంతో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అటువంటి విధులను నిర్వహించడంలో అలసత్వం ప్రదర్శించినా, అసాంఘిక శక్తులతో ఏకమై నేరాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, వారిపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. కావున, పోలీసు సిబ్బంది, అధికారులు క్రమశిక్షణతో వ్యవహరించాలని, నిర్వర్తించాల్సిన విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసి, ఎస్.కోట పోలీసు స్టేషనులో భద్రపర్చిన గంజాయిలో దాదాపు 20కిలోల గంజాయిని అదే పోలీసు స్టేషనులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రాంబాబు 2022సంవత్సరంలో చోరీ చేయడంతో బి.రాంబాబును విధుల నుండి తాత్కాలికంగా తొలగించారన్నారు. అనంతరం, ఉన్నతాధికారులు ఈ సంఘటనపై శాఖాపరమైన విచారణకు ఆదేశించగా, విచారణలో నేరారోపణలు రుజువు అయ్యాయన్నారు. చట్టాన్ని పరిరక్షించాల్సిన వ్యక్తులే చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడడం సహించరాని తీవ్రమైన నేరంగా పరిగణించిన జిల్లా ఎస్పీ కానిస్టేబులు బి.రాంబాబును పోలీసు విధుల నుండి ఖిడిస్మిస్ఖి చేసినట్లుగా తెలిపారు. కానిస్టేబులు బి.రాంబాబుపై ఎస్.కోట, ఎల్.కోట పోలీసు స్టేషనుల్లో గంజాయి చోరీలకు పాల్పడినట్లుగా క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయన్నారు. ఈ కేసులు ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణలో ఉన్నాయని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. గంజాయి, ఇతర క్రిమినల్ కేసుల్లో నిందితుడై, గతంలో డిస్మిస్ కాబడిన మరో ఎపిఎస్పీ కానిస్టేబులు శివప్రసాద్, మరో కానిస్టేబులు సతీష్‌తో కలిసి బి.రాంబాబు కుమ్మక్కై గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతూ ఇటీవల విశాఖపట్నం సిటీ పోలీసులకు పట్టుబడి, ప్రస్తుతం ముగ్గురు జైలులో రిమాండు ఖైదీలుగా ఉన్నారని జిల్లా ఎస్పీ తెలిపారు. కానిస్టేబులు సతీష్ పై కూడా శాఖాపరమైన విచారణకు ఆదేశించామన్నారు. విచారణలో సతీష్ పై నేరారోపణలు రుజువైతే అతనిపై కూడా కఠినమైన క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఇటువంటి నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులను ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

## మొక్కజొన్న రైతులకు లోటు భర్తీ నిధి రూ.3 వేల కోట్లు చెల్లించాలి : పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మొక్కజొన్న ధరలో ఏర్పడిన లోటు భర్తీ చేసేందుకు ప్రభుత్వం తక్షణమే రూ.3 వేల కోట్లు చెల్లించాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. ధరలో ఏర్పడిన లోటు చెల్లిస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర లేక ఎకరాకు రైతులు రూ.25 వేల వరకు నష్టపోతున్నట్లు షర్మిల తెలిపారు. ఈ మేరకు షర్మిల ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి చాలా ఆశాజనకంగా ఉంది. 4.83 లక్షల హెక్టార్లలో 37.61 లక్షల మెట్రిక్ టన్నుల పంట చేతికొచ్చింది. మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఉంటే మార్కెట్‌లో రూ.1500 ధర పెట్టడం ఎంతవరకు న్యాయం? క్వింటాలుకు రూ.900 వరకు రైతులు నష్టపోతుంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? ఇదేనా కూటమి ప్రభుత్వ రైతు సంక్షేమం? ధరలో లోటు మొత్తాన్ని చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఎక్కడ? మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ఆచరణేది? అని షర్మిల ప్రశ్నించారు. రాష్ట్రంలో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడుతున్న మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లేఖ రాశారు. మొక్కజొన్న రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారు. పంట సాగుకు ఎకరానికి రూ.40 వేల వరకు ఖర్చవుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర లభించడం లేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో దళారులు క్వింటాలు రూ.1400 నుంచి రూ.1800 వరకు మాత్రమే కొంటున్నారని వ్యాఖ్యానించారు.

## వినూత్న పరిశోధనకు జాతీయ స్థాయిలో గుర్తింపు

**అన్నమాచార్య విశ్వవిద్యాలయానికి ఎంఎస్ఎంఇ 14 లక్షల గ్రాంట్**



గ్రాంట్ మంజూరు పత్రాన్ని చూపుతున్న వైస్ ఛాన్సర్ సాయిబాబా రెడ్డి

**రాజంపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** ఎంఎస్ఎంఈ ఐడియా హాకథాన్ 5.0 కింద కడప జిల్లా రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి 14 లక్షల గ్రాంట్ మంజూరు అయింది. అన్నమాచార్య విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. వెంకటేష్ అభివృద్ధి చేసిన వినూత్న పరిశోధనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. "స్పెషల్‌షేప్డ్ ఎన్‌డీఎఫ్ఈబీ మాగ్నెట్‌ల తయారీ కోసం డైరెక్ట్ ఇంక్ రైటింగ్ 3డీ ప్రింటర్ రూపకల్పన, అభివృద్ధి" అనే ప్రాజెక్ట్ ప్రతిష్టాత్మక ఎంఎస్ఎంఈ ఐడియా హాకథాన్ 5.0కు ఎంపికైంది. ఈ ప్రాజెక్టుకు మద్దతుగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఎస్ఎంఈ) 14 లక్షల గ్రాంట్‌ను మంజూరు చేసింది. ఈ ప్రతిపాదిత వ్యవస్థ డైరెక్ట్ ఇంక్ రైటింగ్ సాంకేతికతను ఉపయోగించి ఆధునిక 3డీ ప్రింటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుంది. దీని ద్వారా డిజిటల్ డిజైన్‌ల ఆధారంగా నేరుగా సంక్లిష్ట ఆకారపు మాగ్నెట్‌లను తయారు చేయడం సాధ్యమవుతుంది. ఇంజెక్షన్ మోల్డింగ్, కంప్రెషన్ మోల్డింగ్ వంటి సాంప్రదాయ తయారీ పద్ధతులతో పోలిస్తే, ఈ సాంకేతికత ఖరీదైన మోల్డ్‌ల అవసరాన్ని తొలగిస్తుంది. తద్వారా మెరుగైన డిజైన్ స్వేచ్ఛ, తక్కువ ఉత్పత్తి వ్యయం, కనిష్ట పదార్థ వ్యర్థం వంటి ప్రయోజనాలు లభిస్తాయి. ఈ ఆవిష్కరణ ప్రధానంగా గది ఉష్ణోగ్రత వద్ద వేగంగా క్యూర్ అయ్యే హైసాలిడ్ కంటెంట్ మాగ్నెటిక్ స్లర్రీ అభివృద్ధిపై కేంద్రీకృతమై ఉంది. దీని వల్ల తయారు చేసిన మాగ్నెట్‌లు సాంప్రదాయ ఎన్‌డీఎఫ్ఈబీ పదార్థాలతో సమానమైన బలమైన అయస్కాంత, యాంత్రిక లక్షణాలను ప్రదర్శిస్తాయి. సంక్లిష్ట మాగ్నెట్ జ్యామితులను సమర్థవంతంగా తయారు చేయగల ఈ సాంకేతికత డిజైన్ స్వేచ్ఛను పెంపొందించడంతో పాటు, పదార్థ వినియోగాన్ని మెరుగుపరచి, భారతదేశంలో స్మార్ట్ తయారీ రంగ అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ యాజమాన్యం, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఇ. సాయి బాబా రెడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. సురేష్ బాబు, ఐపీసీ డీన్ డాక్టర్ ఎన్.శివరామి రెడ్డి, వి.వెంకటేష్ విశిష్ట సాధనపై హర్షం వ్యక్తం చేశారు.

## 6 రాష్ట్రాల్లో 38 కొత్త క్యాంపస్‌లతో దేశవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల భారీ విస్తరణ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 25:** 6 రాష్ట్రాల్లో 38 కొత్త క్యాంపస్‌లతో దేశవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలు భారీ విస్తరణకు ప్లాన్ చేసింది. ప్రముఖ విద్యాసంస్థ నారాయణ విద్యాసంస్థలు తమ 47 ఏళ్ల విద్యా ప్రస్థానంలో మరో కీలక మైలురాయిని చేరుకున్నాయి. 2026-27 విద్యా సంవత్సరానికిగాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం 38 కొత్త క్యాంపస్‌లను ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. నాణ్యమైన విద్యను విద్యార్థులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ భారీ విస్తరణ చేపట్టినట్లు సంస్థ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధికంగా 15 కొత్త క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 11 పాఠశాలలు, 4 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, గుంటూరు నగరాల్లో ఇవి ప్రారంభం కానున్నాయి. దీంతో ఏపీలో నారాయణ క్యాంపస్‌ల మొత్తం సంఖ్య 407కు చేరుకుంది. తెలంగాణలో 10 కొత్త క్యాంపస్‌లను వాటిల్లో 5 పాఠశాలలు, 5 జూనియర్ కళాశాలలు ప్రారంభిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, సంగారెడ్డిలలో వీటినిఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం క్యాంపస్ల సంఖ్య 244కు చేరింది. మహారాష్ట్ర రాష్ట్రంలో ముంబై రీజియన్‌తోపాటు ధారాశివ్లో కలిపి 5 కొత్త క్యాంపస్లను (2 పాఠశాలలు, 3 కోచింగ్ సెంటర్లు) ఏర్పాటు చేశారు. గుజరాత్ రాష్ట్రంలో రాజకోట్, సూరత్, వడోదరలలో 3 కొత్త పాఠశాలలను ప్రారంభించడంతో అక్కడ మొత్తం క్యాంపస్ల సంఖ్య 3కి చేరింది. తమిళనాడు రాష్ట్రంలో ఈరోడ్, మధురై, చెన్నైలలో 3 కొత్త పాఠశాలలను ప్రారంభించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇండోర్, గుణలలో 2 కొత్త పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఈ విస్తరణలో 26 పాఠశాలలు, 9 జూనియర్ కళాశాలలు 3 కోచింగ్ సెంటర్లు ఉన్నాయి. దీంతో భారతదేశవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల మొత్తం క్యాంపస్ల సంఖ్య 952కు చేరుకుంది. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల ప్రెసిడెంట్ పునీత్ కొత్తప ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి జిల్లాలో ఒక నారాయణ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో కీలకమని నారాయణ భావిస్తోందన్నారు. నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరికి చేరువ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కొత్త క్యాంపస్ ఆ లక్ష్యానికి ఒక అడుగు దగ్గరగా తీసుకెళ్తుందన్నారు. విద్యార్థుల కలలను నిజం చేయడమే నారాయణ లక్ష్యమని పేర్కొన్నారు. అధునాతన డిజిటల్ లెర్నింగ్, పర్సనలైజ్డ్ మెంటరింగ్, సంపూర్ణ వికాసంతో కూడిన విద్యా విధానాన్ని అందించేందుకు నారాయణ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అందుకే ప్రతి ప్రాంతంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల కలలను సాకారం చేయడమే నారాయణ విద్యాసంస్థల ధ్యేయమని పేర్కొన్నారు.

## చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం వద్ద లారీ బోల్తా



**తిరుపతి,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరుజిల్లాలో శనివారం సాయంత్రం ఓ ప్రమాదం జరిగింది. చిత్తూరు- పుత్తూరు రహదారిలోని ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్టవద్ద ఈ సంఘటన లో లారీ బోల్తాపడింది. మొలకలచెరువు నుండి ఎస్ఆర్ పురం మండలంలోని మెదవాడ కోళ్ల ఫారం కు మొక్కజొన్నల లోడ్ తో వస్తూ లారీ టైరు పేలడంతో అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తా పడింది. స్వల్ప గాయాలతో డ్రైవర్ ,క్లీనర్ బయటపడ్డారు. క్షతగాత్రులను ఎస్ఆర్‌పురం ఆరి మాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించారు.

### చంద్రబాబు వ్యాఖ్యల్ని వక్రీకరిస్తూ వైసిపి విషప్రచారం : మంత్రి నారా లోకేష్

**విజయవాడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల తిరుపతి జిల్లాలో జరిగిన టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమం సందర్భంగా ఓ లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని వక్రీకరిస్తూ వైసీపీ నేతల అసత్య ప్రచారం చేస్తున్నారని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ దుయ్యబట్టారు. దీనిపై ఏపీ ప్రభుత్వం ఫ్యాక్ట్ చెక్ ద్వారా వివరణ ఇచ్చినా వైసిపి బుద్ది మారలేదని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. అంబిక అనే లబ్ధిదారు కష్టసుఖాలు తెలుసుకున్న చంద్రబాబు ఆమె భర్త ఆటో డ్రైవర్ కావడంతో ఆటో ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. సీఎం ఆ లబ్ధిదారు ఇంట్లోంచి బయటకొచ్చాక మరో మహిళ తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించాల్సిందిగా కోరారు. అంబికతో సీఎం మాట్లాడిన వ్యాఖ్యల్ని రెండో మహిళతో అన్నట్టు వైసిపి నాయకులు ఎడిటింగ్ చేసి చదువుకున్న వ్యక్తికి ఆటో కొనిపెడతారట అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలా చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం అని లోకేశ్ పేర్కొన్నారు.

# తిరుమల సమాచారం

## టిటిడి ట్రస్టులకు రూ.30 లక్షల విరాళం



**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానమ్ ఇతోధికంగా సేవలందించేందుకు పలు రకాల ట్రస్ట్‌లు, పథకాలు నిర్వహిస్తోంది. వీటికి దాతలు తమ వంతుగా విరాళాలందిస్తున్నారు. శనివారం ఉదయం టిటిడి శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కు 10 లక్షలు రూపాయలు, శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్ కు 10 లక్షలు, శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాల ట్రస్ట్ కు .10 లక్షలు రూపాయలు మొత్తం 30లక్షలు రూపాయలు అమెరికాలోని టెక్సాస్‌లో నివాసముంటున్న ఐటి సంస్థ యజమాని ససపు శ్రీనివాస్ విరాళాలను అందించారు. డిడిలను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నంకు చెందిన చీఫ్ ఇంజనీర్ డి. శ్రీనివాస్ రావు, రైల్వే అధికారి సురేష్ కుమార్ ఉన్నారు.

## అతి తక్కువ ప్రీమియంతో ఎస్‌బిఐ బీమా



**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమలలోని ఆర్టీసి ఉద్యోగులకు అతి తక్కువ ప్రీమియంతో ఎస్‌బిఐ బీమా పథకం గురించి అవగాహన కల్పించారు. శనివారం తిరుమల ఆర్టీసి డిపోలో ఎస్‌బిఐ హెల్త్ ఇన్సూరెన్స్ ఉద్యోగులు క్యాంపు నిర్వహించారు. కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ కింద ఉన్న ఉద్యోగులందరికీ ప్రత్యేక ఆఫర్ కింద ఆరోగ్యబీమాఅతి తక్కువ ప్రీమియం కు 55 లక్షల రూపాయలు వరకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ ,ఎస్‌బిఐ తిరుమల బ్రాంచ్ మేనేజర్, తిరుమల డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు , 70 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎస్వీ బాలమందిరంలో ప్రవేశాలకు ఆహ్వానం

**- మే 16 దరఖాస్తులకు చివరి తేదీ**

**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుపబడుతున్న అనాథ పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న శ్రీ వేంకటేశ్వర (ఎస్వీ) బాలమందిరంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులను టిటిడి ఆహ్వానిస్తోంది. దరఖాస్తుదారులు హిందూ మతానికి చెందినవారై ఉండాలి. ఏప్రిల్ 27కిఐదు సంవత్సరాలు నిండిన, 10 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలి. ఆసక్తి గల వాళ్ళు తిరుపతిలోని ఎస్వీ బాలమందిరంలో లభించే దరఖాస్తు పత్రాలను ,తెల్లకాగితంపై తమ వివరాలు రాసి సమర్పించవచ్చని టిటిడితెలిపింది. దరఖాస్తుతో పాటు తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రాలు, సంరక్షకుల/తల్లిదండ్రుల ఆదాయ ధృవీకరణ ప్రతులను, బాలబాలికలు జనన , కుల ధృవీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను సహాయ కార్యనిర్వహణాధికారి, శ్రీ వేంకటేశ్వర బాలమందిరం, టి.టి.డి, భవానీనగర్, తిరుపతి - 517501 చిరునామాకుదరఖాస్తులను స్వయంగా , పోస్టు ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు 0877 -2264613 నంబర్‌లో సంప్రదించవచ్చు.

## రేపు తిరుమలకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**- జిల్లా యంత్రాంగం భద్రతలో నిమగ్నం**



**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ రెండు రోజుల తిరుమల, తిరుపతి పర్యటనకు సోమవారం విచ్చేస్తున్నారు. పూర్తిస్థాయిలో అధికారిక పర్యటన కావడంతో తిరుపతి జిల్లా యంత్రంగం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలపై నిమగ్నమైంది. శనివారం సాయంత్రం తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) జి. నరసింహులు ,అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, డిఎస్పీలు, సిఐలు, జిల్లా రెవెన్యూ యంత్రాంగం, టిటిడి అధికారులు ఏర్పాట్లపై పర్యవేక్షిస్తున్నారు. సోమ, మంగళవారాలు రెండురోజులు తిరుపతి, తిరుమల పర్యటన నేపథ్యంలో భద్రత ,పరిపాలనా ఏర్పాట్లపై అధికారులు ముందస్తు సమీక్ష నిర్వహించారు. రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, రోడ్డుమార్గంలో అలిపిరి, తిరుమల ఆలయం వరకు ఉపరాష్ట్రపతి కార్యాలయ అధికారులతో బాటు జిల్లా పోలీస్ అధికారులు కాన్వాయ్‌ట్రయల్ రన్ నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు, రూట్ మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాట్లు, అత్యవసర సేవలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి, అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి పర్యటన విజయవంతం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి అంశాన్ని సమగ్రంగా సమీక్షి ంచి, ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు అధికారులను

# అనాథ పిల్లలకు జీవనాడి 'ఎస్వీ బాలమందిరం'

**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** 1943లో ఎస్వీ అనాధాశ్రమంగా ప్రారంభమైన ఈ సంస్థ, అనాథ పిల్లలకు కేవలం ఆశ్రయం మాత్రమే కాకుండా సంపూర్ణ జీవన వికాసాన్ని అందించాలనే లక్ష్యంతో 1961లో అప్పటి ప్రధానమంత్రి చాచా జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ఎస్వీ బాలమందిరంగా నామకరణం చేశారు. 2014లో ఈ ఎస్వీ బాలమందిరాన్ని శ్రీ ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్ పరిధిలోకి టిటిడి తీసుకొచ్చింది. ప్రస్తుతం ప్రతి సంవత్సరం వందలాది పిల్లలకు ఆశ్రయం కల్పిస్తూ, వారి సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తోంది. ఎంపిక విధానం హిందూ మతానికి చెందిన 5 ఏళ్లు నిండిన, 10 ఏళ్లలోపు వయసు ఉన్న పిల్లలను రెండు కేటగిరీలుగా ఎంపిక చేస్తారు. ఏ కేటగిరి: తల్లిదండ్రులు లేని పిల్లలకు మొదటి ప్రాధాన్యం బీ కేటగిరి: తల్లి లేదా తండ్రి లేని పిల్లలు టిటిడి జారీ చేసే నోటిఫికేషన్ ఆధారంగా సంరక్షకులు దరఖాస్తు చేసుకుంటే, నిబంధనల ప్రకారం ఎంపిక కమిటీ ద్వారా ఎంపిక జరుగుతుంది. విద్య వసతులు ఎంపికైన పిల్లలకు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఎస్వీ ప్రాథమిక పాఠశాలలో, 6వ నుండి 10వ తరగతి వరకు శ్రీ గోవిందరాజ స్వామి ఉన్నత పాఠశాలలో విద్య అందిస్తారు. బాలమందిరంలో విద్యార్థులకు రోజూ పాలు, టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనం అందిస్తారు. పుస్తకాలు, దుస్తులు వంటి మౌలిక అవసరాలను టిటిడి ఉచితంగా అందిస్తుంది. 10వ తరగతి అనంతరం బాలురను ఎస్వీ జూనియర్ కాలేజీలో, బాలికలను ఎస్వీడబ్ల్యూ జూనియర్ కాలేజీలో చేర్పిస్తారు. ప్రతిభ గల విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో కూడా చదువు అవకాశాలు కల్పిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్య డిసెంబర్ 4, 2025న జరిగిన శ్రీ ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్ సమావేశంలో, 10వ తరగతిలో 75 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్య అందించాలనే కీలక నిర్ణయాన్ని టిటిడి తీసుకుంది. ఇప్పటికే ఎస్వీ బాలమందిరంలో చదివిన పలువురు విద్యార్థులు ఎస్.ఎస్.సిలో 600కి 580 పైగా మార్కులు, ఇంటర్మీడియట్‌లో 1000కి 982 మార్కులు సాధించి ప్రతిభను చాటుకున్నారు. మరింత నాణ్యమైన విద్య అందించేందుకు టిటిడి పటిష్ట చర్యలు చేపడుతోంది.

ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు టిటిడి ఎస్వీ బాలమందిరంలో విద్యను అభ్యసించిన ఎందరో విద్యార్థులు ఉన్నత విద్య అనంతరం టిటిడిలో పలు ఉన్నత హోదాల్లోను, ఐటీ రంగంలో, మెడికల్, ప్రభుత్వ ఉద్యోగులు తదితర రంగాల్లో స్థిరపడ్డారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అవకాశాలు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు, శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి ప్రముఖ వేడుకల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎస్వీ బాలమందిరం విద్యార్థులకు టిటిడి ప్రత్యేక అవకాశాలు కల్పిస్తోంది.

అడవుల సంరక్షణతో పాటు వన్యప్రాణి సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. అడవుల నరికివేత ఒకవైపు జరుగుతుంటే అడవుల్లో ఉండే వన్య ప్రాణాలను వేటగాళ్లు విపరీతంగా వేటాడుతున్నారు. దాంతో అడవుల్లో జింకలు, దుప్పులు, అడవి పందులు ఇతర జంతువుల సంఖ్యతగ్గిపోయి కోతుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. అడవుల రక్షణతో పాటు అడవుల్లో ఉండే ప్రతి చిన్నజీవి సంరక్షణకు సంబంధితశాఖతో పాటు ప్రజల్లో కూడా మార్పువచ్చేలా చర్యలు ఉండాలి. ఎవరికివాళ్ళె మనకెందుకులే అనుకుంటే అడవుల్లో వన్యప్రాణాలు అసలు లేకుండాపోతే పులులు వాటి కడుపు నింపుకోవటానికి గ్రామాల్లోకి ప్రవేశించి పెంపుడు జంతువులను చంపటంతో పాటు మనుషులపై కూడా దాడిచేస్తాయి. ఈ విపత్తును అటవీ ప్రాంతాల్లో ఉండే ప్రజలు కూడా గుర్తించి వన్య ప్రాణులను, అడవుల్లో ఉండే పశుపక్షా దులను వేటాడకుండా వాటి మానాన్నవాటిని వదిలేస్తే వాటి సంతతి పెరిగి పర్యవరణ సమతుల్యత కాస్త మెరుగుపడుతుంది. ఇప్ప టికే రైతులు వ్యవసాయ భూముల్లో చీడ పీడలతో పంటలు నష్టపోతున్నారు. పంట పోలాల్లో ఉండే చిన్నపాటి పురిడూ, కౌజు పిట్టలు, నీటికోళ్ళు, కోంగలను విపరీతంగా చంపటంతో పంటపొలాల్లో పురుగుల శాతం పెరిగింది. పురుగుల నిరోధానికి రైతు రసాయనాలు వాడటం, ఖర్చు భారంగా మారింది. ఇప్పటికైనా పంటపొలాల్లో ఉండే చిన్నపాటి పక్షులను, జంతువులను వేటాడకుండా ప్రతి రైతు చర్యలు చేపట్టాలి. అడవుల్లో ఉండే వన్య ప్రాణుల రక్షణ బాధ్యత అటవిశాఖతో పాటు ప్రజలపై ఉంది అని ప్రతిఒక్కరు గుర్తించాలి. అప్పుడే పర్యవరణ సమతుల్యం, ప్రజా సంక్షే మం పదికాలల పాటు ఉంటుంది. ఎవరి స్వార్థానికి వారు పోతే చివరకు ప్రకృతి తెచ్చి పెట్టే అనర్థాలకు అందరు భాధ్యులు అవ్వాల్సి వస్తుంది.

# వేటకోసం జనారణ్యంలోకి వన్యప్రాణులు

**యస్.కె.మస్తాన్‌జాని**

అభివృద్ధి పేరుతో అడవులను విచ్చలవిడిగా నరికివేయటంతో ఒక వైపు పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. అడవుల్లో నివసించే పులులు, చిరుతలు, ఏనుగులు వంటి జంతు జాతులకు ఆహార కొరత ఏర్పడి అవి గ్రామాల వైపు పయనించి పంటలను నాశనం చేయటం, వన్యమృగాలు పెంపుడు జంతువులపై దాడిచేస్తున్న ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటువంటి ఘటనలు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా సంచలనలం సృష్టిస్తున్నాయి. మైనింగ్ పేరుతో అడవులను ధ్వంసం చేయటం, పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చటం కోసం గ్రామాల్లో అడవులను నరికివేసి పోడువ్యవసాయం చేయటం, రహదారుల నిర్మాణం వంటి కారణాలతో రోజురోజుకు అడవులు తరిగిపోతున్నాయి. అడవుల్లో ఉండే మూగజీవాలైన జింకలు, దుప్పులు, కుందేళ్ళు, అడవి పందులను విద్యుత్ ఉచ్చులు పెట్టి చంపటం లేదా, అవి తినే ఆహారంపై పురుగుల మందులు చల్లి వన్య ప్రాణులను మట్టు బెడుతున్నారు. దాంతో అడవుల్లో ఉండే వన్య ప్రాణుల సంఖ్య తగ్గిపోయి వన్యమృగాలు ఆకలి కేకలతో గ్రామాల వైపు పయనించి పెంపుడు జంతువులపై దాడి చేసి వాటిని చంపి తమ ఆకలిని తీర్చుకుంటున్నాయి. అంటే పరోక్షంగా దీనికి కారణం మనుషులే. పంటల పేరుతో మనుషులు అడవులను నరికివేసి ఆ ప్రాంతాల్లో పంటలను సాగు చేయటంతో ఎనుగులు, దుప్పులు, జింకలు వంటి జంతువులు మనుషులు సాగుచేస్తున్న పంటలను తమకు ఆహారంగా భావించి రాత్రి సమయంలో పంటలపై దాడిచేసి తమ కడపు నింపుకోవటంతో పాటు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఎనుగుల చేతిలో మనుషులు మృత్యువాత పడితే మనుషుల చేతిలో ఏనుగులు మృతిచెందిన ఘటనలు చాలా ఉన్నాయి. 2013 నుండి 2024-2025 వరకు చిత్తూరు, తిరుపతి, మన్యం జిల్లా జియం వలస, శ్రీకాకుళం, విజయ నగరం జిల్లాలో ఏనుగుల సంచారం అధికంగా ఉంటుంది. ప్రాథమిక అంచనాల ప్రకారం 2013 నుండి 2025 వరకు ఏనుగుల దాడిలో దాదాపు 26 మంది మృతిచెందారు. మనుషుల దాడిలో 21 ఏనుగులు మృతిచెందినట్టు లెక్కలు చెపుతున్నారు.

కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో అడవి ఆవులు పంటలను ధ్వంసం చేస్తున్నట్టు ఆ ప్రాంతం రైతులు గగ్గోలు పెడుతున్నారు. కృష్ణ, నల్లగొండల జిల్లాల పరిధిలో ఉన్న అడవుల్లో అడవి ఆవులు విస్తరించాయి. వాస్తవానికి వరదల సమయంలో కొట్టుకొచ్చి దారితప్పిన ఆవులు ఆడవుల్లో వాటి సంతతిని వృద్ధిచేసుకోని ఆలనా, పాలన లేక వాటి సంఖ్య ఆ ప్రాం



తంలోని అడవుల్లో విపరీతంగా పెరిగింది. దాంతో పంటలు ధ్వంసం చేస్తున్నాయని ఆ ప్రాంత రైతులు గగ్గోలు పెడుతున్నారు. కృష్ణాజిల్లా నందిగామ, చందర్లపాడు ప్రాంతంలో కృష్ణా నదీ తీరాన అడవి ఆవులు ఉన్నాయని ఇటివల అసెంబ్లీలో ఆ ప్రాంత యంయల్ఎ ప్రస్తావనకు తేవటంతో అడవి ఆవులు ఉన్నాయన్న విషయం బాహ్య ప్రపంచానికి తెలియటం గమనార్హం. అమ్రాబాద్ టైగర్ రిజర్వు తెలంగాణాలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుగా ఉంది. ఇది నల్లమల అడవులను ఆనుకోని ఉంటుంది. నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తరించి భారతదేశంలో అతిపెద్ద టైగర్ రిజర్వుగా పేరుగాంచింది. 2024-2025 లెక్కల ప్రకారం ఈ రిజర్వులో 36 పులులు ఉన్నట్టు గుర్తించారు. వాటిలో 13మగవి, 20ఆడ పులులు, రెండు కూనలు ఉన్నట్టు అటవీ శాఖ లెక్కలు తేల్చాయి. నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వులు రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోకి వస్తాయి. 3728 చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించిన ఈ రిజర్వులో నాగర్ కర్నూల్, నల్లగొండ, ప్రకాశం, పల్నాడు, నంద్యాల జిల్లాల పరిధిలో ఉన్న ఈ టైగర్ రిజర్వులో76 పలులు ఉన్నట్టు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. **కవ్వాల్ టైగర్ రిజర్వ్:** తెలంగాణాలోని మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలో ఉంది. ఈ రిజర్వులో 48 పులులు ఉన్నట్టు ప్రాథమిక అంచనా. **పాపికొండలు నేషనల్ పార్క్, టైగర్ రిజర్వు:** పాపికొండలు వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా 2008లో దీనిని జాతీయ పార్క్‌గా గుర్తించారు. ఇది టైగర్ రిజర్వు పరిధిలోకి వస్తుంది. ఎపిలోని అల్లూరి, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాలో విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో బెంగాల్ టైగర్, చిరుతలు ఉన్నాయి. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో పట్టుబడిన పెద్దపులిని, చిరుతను పాపికొండల అభయారణ్యంలో వదిలివేశారు. మహారాష్ట్ర తాడోభా టైగర్‌రిజర్వు నుండి దారి తప్పిన పెద్దపులి తెలంగాణా, ఛత్తీస్‌ఘడ్ మీదుగా ఎపిలోకి ప్రవేశించింది. ఈ పెద్దపులి అనేక సార్లు గోదావరి నదిని దాటినట్టు గుర్తించారు. 2025లో తెలంగాణాలోని ఆసీఫాబాద్, ములుగు ప్రాంతాల్లో సంచరించిన పెద్దపులి కొన్ని నెలల క్రితం గోదావరి నదిని దాటిచింతూరు అడవుల్లో సంచరించింది. కూనవరం మండలం బోదునూరులో పశువులపై దాడి చేసి హతమార్చింది. చింతూరు మండల కేంద్రానికి సమీపంలో నర్సింహాపురం గ్రామంలోకి పులి ప్రవేశించిన పాదముద్రలను అటవిశాఖ అధికారులు గుర్తించారు. ఆ తరువాత ఈ పులి శబరి నదిని దాటి పాపికొండల అభయారణ్యంలోకి ప్రవేశించింది. అక్కడి నుండి గోదావరి నదిని దాటి ఏలూరు జిల్లాలోకి అక్కడి నుండితూర్పుగోదావరి జిల్లాలోకి, రాజమండ్రి పట్టణ పరిసరాల్లో హైవేపై ఈ పులి సంచరించి హడలెత్తించింది. చివరకు అటవీ శాఖ అధికారులు పట్టుకొని పాపికొండల రిజర్వు ఫారెస్టులో విడిచిపెట్టారు. అక్కడ నుండి మళ్లీ గ్రామాలవైపు వచ్చిన పెద్దపులి పొలవరం జిల్లాలోని దేవీపట్నం, రంపచోడవరం ప్రాంతాల్లో దాదాపు 8 పశువులను హతమార్చింది. చివరగా ఈనెల 4న రామదుర్గం కొండలపై పులి ఉన్నట్టు గుర్తించారు. **పులులు సంచరించే ప్రాంతం:** పులులు నివసించే ప్రాంతాల్లో వాటిని ఆవాసంగా మార్చుకొని ఒక్కో పులి ఒక్కో రెడియస్(వ్యాసార్ధం) ప్రాంతాన్ని తన ఆవాసంగా భావిస్తుంది. అది ఆహార లభ్యతను బట్టి మారుతూ ఉంటుంది. సాధారణంగా ఆడపులులు 200 నుండి 1000చదరపు కిలోమీటర్ల వరకు తమ పరిధిగా భావిస్తాయి. మగ పులులు ఆడపులి కంటే దాదాపు 15రెట్లు ఎక్కవ పరిధిలో తమ ఆవాసంగా భావిస్తాయి. పెద్దపులి ఒక్క రాత్రిలో 16నుంచి 32కిలో మీటర్లు ప్రయాణిస్తుంది. తెలంగాణాలోని కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పాతశాల తండా సమీపంలో కట్టెలు ఏరుకోవటానికి వెళ్ళిన వ్యక్తిపై పెద్దపులి దాడి చేసింది. ఈ ఘటనలో ఆవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తాజా లెక్కల ప్రకారం పులుల దాడిలో 2021నుంచి 2025 వరకు 150మందివరకు ప్రాణాలు కోల్పోయారు. ఒక్క 2022లో 53 మంది మృతి చెందడటం విశేషం. పులుల సంఖ్యను ఎలా లెక్కిస్తారు? పెద్దపులుల సంరక్షణ కోసం భారత్ ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. పులుల సంఖ్య లెక్కించటం పెద్ద టాస్క్. ట్రాప్ కెమెరాల సహాయంతో ఫోటోలను తీసి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో ఫోటోలను గుర్తించి పులుల సంఖ్యను లెక్కిస్తారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన టైగర్ రిజర్వుగా కాజీరంగా టైగర్‌రిజర్వునుయూనెస్కో గుర్తించింది. ఇది అస్సాం రాష్ట్రంలోఉన్న ఈ రిజర్వులో పెద్దపులులతో పాటు ఖడ్గమృగాలు, బెంగాల్ టైగర్‌లు, ఏనుగులు, అడవి దున్నలు, నీటి ఏనుగులు, చిత్తడి జింకలను ఈ రిజర్వు పెట్టని కోట. 100చదరపు కిలో మీటర్ల పరిధిలో 18 పులులు కలిగిన టైగర్ రిజర్వుగా ఇది ప్రసిద్ది చెందింది. ఈ రిజర్వు గోలాఘాట్, నాగావ్, సోనిత్‌పూర్ జిల్లాలో విస్తరించి ఉంది. ఈ రిజర్వులో 148 పెద్దపులులు ఉన్నట్టు గుర్తించారు. భారతదేశంలో జిమ్‌కార్బెట్ టైగర్ రిజర్వు (ఉత్తారాఖండ్), భాంధవ్‌ఘర్, పెంచ్ (మధ్యప్రదేశ్), కన్హా, రణథంభోర్ (రాజస్థాన్) ప్రసిద్ధిగాంచినవి. జిమ్‌కార్బెట్ నేషనల్ పార్క్‌అత్యంత పులుల సాంద్రత కలిగిన టైగర్ రిజర్వు. ఇది హిమాలయాలకు దిగువన ఉంటుంది. భారతదేశవ్యాప్తంగా 58 టైగర్ రిజర్వులు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా70శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయి. రాయల్ బెంగాల్ టైగర్స్‌కు భారతదేశం ప్రసిద్ధి. పులుల సంరక్షణకు చర్యలు చేపడుతున్న ప్రభుత్వాలు వాటికడుపు నిండటానికి అవసరమైన వన్య ప్రాణుల పెరుగుదలకు చర్యలు చేపడితే అడవుల్లో ఉండాల్సిన పులులు బాహ్య ప్రపంచం వైపు రాకుండా ఉంటాయి. ●

పశ్చిమ బెంగాల్

పోటీలో ఎందరు ఉన్నా చివరికి గెలుపు వరించేది ఒక్కరినే. ఆ విషయం పోటీకి దిగిన ప్రతి ఒక్కరికి తెలిసినదే అయినా చివరి క్షణం వరకు విరామం లేని పరుగు పెడుతూనే ఉంటారు. గెలుపు ఎవరిదో ఆఖరి క్షణంలో మాత్రమే తెలుస్తుంది కానీ దాని సూచనలు ఎంతో కొంత ముందుగానే కనిపిస్తూంటాయి. తాజాగా ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్లో కూడా కనిపిస్తున్న దృశ్యం అటువంటిదే. ఐదు అసెంబ్లీలకు ఎన్నిలు జరుగుతున్నా, దేశంలో అందరి దృష్టి ఎక్కువగా పడింది బెంగాల్ పైనే. దానికి ప్రధాన కారణం. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వరుసగా నాలుగోసారి తన జాతకాన్ని పరీక్షిం చుకొంటూండగా, బెంగాల్ జాతకాన్ని ఈసారి తమ చేతుల్లోకి తీసుకొంటామని బిజెపి ధీమాగా చెబుతోంది. గత గురువారం(23, ఏప్రిల్) బెంగాల్లో జరిగిన తొలి విడత పోలింగ్ కూడా దేశ ప్రజలందరి దృష్టిని ఎక్కువగానే ఆకర్షించిం ది. దానికి కారణం అత్యధిక శాతం (92.72) ఓటింగ్ రికార్డు కావడమే. మరోవంక అదేరోజు తమిళనాడు అసెంబ్లీకి కూడా పోలింగ్ జరిగినా రాజకీయ విశ్లేషకులు ఎక్కువగా బెంగాల్ పైనే దృష్టికేంద్రీకరించారు. 16 జిల్లాల్లోని 152 నియోజక వర్గాలలో అనూహ్య రీతిలో నమోదైన ఓటింగ్ వల్ల లాభమెవరికి? అన్నదే ప్రస్తుతంమిలియన్ డాలర్ల ప్రశ్న. ఐదేళ్ల క్రితం ఇదే నియోజక వర్గాల్లో జరిగిన ఎన్నికల్లో 85శాతం ఓట్లు పోలవగా, ఈసారి మరో 8 శాతం పెరిగాయి. అంటే ఆ మేరకు కొత్తఓటర్లు పెరగడం, మహిళా ఓట్లు ఎక్కువగా నమోదు కావడం జరిగాయన్నమాట. అయితే ఈ పెరిగిన ఓట్ల శాతం ఎవరి ఖాతాలో పడిందనే ప్రశ్నకు రకరకాల సమాధానాలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు జరిగిన 152 సీట్లలో 110 దాకా తమకే వస్తాయని బిజెపి అగ్రనేత అమిత్ షా అంటుండగా, 134సీట్లు తమవేనని మమతా బెనర్జీ అంటున్నారు. ఎన్నికల ముందు 'సర్' ప్రక్రియ ద్వారా దాదాపు 90లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. దానిపైమమతా బెనర్జీ పెద్ద సమరమే చేశారు. ఆ మేరకుతమకు నష్టం వాటిల్లుతుందని ఆమె భావించారు. కానీ అనూహ్యంగా పోలింగ్ శాతం పెరిగింది. తొల

# అందలం అందేనా?

**ఎ.వి.వి ప్రసాద్**

గించిన ఓట్లలో ప్రతి 10మందిలోను 8 మంది తమ ఓటర్లేననీ, తనను ఓడించడానికే ఎన్నికల కమిషన్‌తో ఎన్డీయే ప్రభుత్వం కుమ్మక్కయిఓట్లు తొలగించిందనీ మమత ఆరోపణ. కానీ ఆవాదం నిజమనుకుంటే పోలయిన ఓట్ల శాతం తగ్గాలి. కానీ అనూహ్యరీతిలో పెరిగిందంటే అది బిజెపికి అనుకూలం కావొచ్చనే అభిప్రాయంవినిపిస్తోంది. ఈ అదనపు పోలింగ్ రాష్ట్రంలో మార్పు కోరుకునే ఓటర్ల దైతే అది బిజెపికి భారీ మెజారిటీనే కట్టబెట్టవచ్చనే అభిప్రాయంకూడా ఉంది. ఐదేళ్ల లోనే 3నుంచి 77 సీట్లకు ఎగబాకిన బిజెపి ఈ ఎన్నికల్లో ఆ సంఖ్యను రెట్టింపు చేసు కోవచ్చనీ, 29న జరిగే రెండో విడత పోలింగ్‌లో కూడా ఇలాగే అత్యధిక శాతం ఓట్లు నమోదైతే బిజెపి గెలుపు



మమతా బెనర్జీ

నల్లేరుపై నడకేఅవుతుం దనీ విశ్లేషకులు అంటున్నారు. సాధారణంగా తక్కువ స్థాయి పోలింగ్ నమోదయ్యే మాల్టా, ఝూర్ గ్రామ్, పశ్చిమ మేదినీపూర్‌లో కూడా ఈసారి 90శాతం పైగా పోలింగ్ నమోద వడం అందరిలో కొత్త అంచనాలను సృష్టిస్తోంది. నాలుగైదు నియోజక వర్గాల్లో ఘర్షణలు జరిగినా చివరికిఅక్కడ కూడా దాదాపు 90శాతం ఓట్లు నమోదు కావడం గమనించవలసిన అంశం. దేశం లోని ఇతర ప్రాంతాల్లో ఉన్న బెంగాలీలందరు ఈసారి అధికంగా తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకొన్నారనీ, అది కూడా పోలింగ్ శాతం పెరగడానికి మరో కారణమనీ అంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న బెంగాలీల ఓటు హక్కు తొలగించడానికి బిజెపి కుట్ర పన్నుతోం దని మమత చేసిన ఆరోపణల ప్రభావం ఈసారి ఎక్కువగానే కనిపించిందనీ, ఆ ఓట్లు టిఎంసికే పడి ఉంటాయనీ భావిస్తున్నారు. కొత్త పార్టీ నెల కొల్పిన హుమాయూన్ కబీర్, ముస్లింలీగ్‌ల ప్రభావం చాలా తక్కువేననీ, ప్రధాన పోటీ టిఎంసి, బిజెపి మధ్య మాత్రమేననీ, కాంగ్రెస్ కూడా పక్కకు వెళ్లిందనీ అంటున్నారు. పోలింగ్ సరళి ప్రకారం అదనపు ఓట్లు బిజెపికి లభించి ఉంటే ఆ పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరుగుతుంది. 2021 ఎన్నికల్లో టిఎంసికి దాదాపు 48 శాతం ఓట్లురాగా, బిజెపికి 38శాతం వచ్చాయి. ఆ ఎన్ని కల్లో కాంగ్రెస్‌కు నామమాత్రంగా దాదాపు3శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కొన్నిదశాబ్దాల పాటు రాష్ట్రంలో ఏకచ్ఛత్రాధిపత్యం చేసిన సిపిఎం ఓట్ల శాతం కూడాఖ్య గత ఎన్నికల నాటికే 4.5కు పడిపోయింది. వాటి ప్రకారం చూస్తే గణనీయంగా లబ్ధి పొందింది బిజెపియే అనే విషయం అర్థమవుతుంది. 2006లో కేవలం 2 శాతం ఉన్న బిజెపి ఓట్లు 2016నాటికి 10 శాతం దాటాయి. తర్వాత 38శాతానికి పెరిగాయి. అదే సమయంలో టిఎంసికి రెండు మూడు శాతం మాత్రమే ఓట్లలో పెరుగుదల కనిపించింది. అంటే ప్రతి ఎన్నికల్లోనూ ఓట్ల శాతం పెంచుకొంటున్నబిజెపి ఈ ఎన్నికల్లో మరో నాలుగైదు శాతం పెంచుకొంటే సీట్ల సంఖ్య కూడా తారుమారై అయితే హంగ్, లేదా బిజెపికి స్వల్ప ఆధిక్యత లభించవచ్చనే అంచనాలు కూడా ఉన్నాయి. బిజెపి ఎంత గట్టి పోటీ ఇస్తున్నా, స్వల్ప మెజారిటీతోనైనా టిఎంసియే విజయం సాధించవచ్చని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. ఆ ప్రకారం మమత పార్టీకి స్వల్ప ఆధిక్యత చేకూరినా, బిజెపి గెలుపు అవ కాశాన్ని పూర్తిగా కొట్టివేయలేమని కొందరు విశ్లే షకులు అంటున్నారు. గతంలో వామపక్షాలు బలంగా ఉన్న నియోజక వర్గాల్లో ఇప్పుడుబిజెపి బలం పుంజుకోవడం ఆపార్టీ నేతల్లో కొత్త ఆశలు పెంచుతోంది. లెఫ్ట్‌కు తగ్గిన ఓట్ల శాతం బిజెపికి పెరగడానికి తోడ్పడిందని వారు అంటున్నారు. గతంలో టిఎంసికి ఆధిక్యత ఉన్న చోట్ల ఇప్పుడు బిజెపి గట్టి పోటీ ఇస్తుండడంతో, పెరిగిన ఓట్లు బిజెపి ఖాతాలోకి చేరవచ్చని అంటున్నారు. అయితే నిజంగా అందలం

చిలీ

ప్రపంచదేశాల్లో శాంతి, సామరస్య వాతావరణం ఏర్పాటుకు సంధానకర్తగాను, అవసరమైతే ప్రత్యక్షంగానే జోక్యంచేసుకుంటూ శాంతిపరిరక్షక దళాలను పంపించే ఐక్యరాజ్య సమితి అత్యున్నతపదవికి ఈసారి పోటీపెరిగింది. గతంలో కూడా 13మంది పోటీలో ఉన్నప్పటికీ పదేళ్లపాటు ఈపదవిలో కొనసాగిన సెక్రటరీ జనరల్‌ఆంటోనియో గ్యుటెరెస్ పదవీకాలం ఈ ఏడాది చివరితో ముగుస్తోంది. వచ్చే ఏడాది నుంచే ఐక్యరాజ్యసమితికి కొత్త సెక్రటరీ జనరల్ ఎన్నిక కావాల్సి ఉంటుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అటు ఉక్రెయిన్ రష్యా యుద్ధం, ఆఫ్రికా దేశాల్లో కొనసాగే నరమేధం వంటి వాటిని చాకచక్యంగా పరిష్కరించాల్సిన నాయకులు ఈ అత్యున్నత పదవికి ఇప్పుడు అవసరం. ప్రస్తుత సెక్రటరీ జనరల్ అటు ఉక్రెయిన్, ఇటు పశ్చిమాసియా ఉద్రిక్తతలను పరిష్కరించడంలో సఫలం కాలేకపోయారన్న భావన ప్రపంచ దేశాల్లో వ్యక్తంఅవుతోంది. గల్ఫ్‌దేశాలపై దాడులు, అమెరికా ఇజ్రాయెల్‌లు ఒక్కటిగా ఏర్పడి ఇరాన్‌పై జరుపుతున్న దాడులు వంటివి ఇపుడు ప్రపంచదేశాధినేతలకు చిక్కువీడని సమస్యగా మారుతోంది. ఈక్రమంలో ప్రపంచ దేశాలకు పెద్దన్నగా వ్యవహరించే ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్‌పదవికి ఎన్నిక అని వార్యం అయింది. ప్రస్తుతం 193 సభ్యదేశా లున్న ఐక్యరాజ్యసమితి(యూఎన్)లో ఐదుగురు శాశ్వతసభ్యులున్న భద్రతా మండలి, మరో రెండేళ్లకోసారి నామినేట్ అయ్యే పది దేశాలు మొత్తం 15వరకూ ఉన్నాయి. మొదటిసారిగా యూఎన్ అత్యున్నత పదవికి మహిళల పేర్లు బహుళంగా వినిపిస్తున్నాయి. వారిలో చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెల్లీ బ్రాచ్‌లెట్, అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ ఛైర్మన్‌రాఫెల్‌గ్రోస్సీ యుఎన్ వాణిజ్యం అభివృద్ధి విభాగం చీఫ్ రెబెకా గ్రిన్ స్పాన్‌లతోపాటు సెనెగల్ మాజీ అధ్యక్షుడు మాకీ సాల్‌లు రేసులో కనిపిస్తున్నారు. వీరందరినీ ఆయా దేశాలు ముందు నామినేట్ చేయాల్సి ఉంటుంది. 800 కోట్లప్రపంచ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు ఈసారి ప్రాతినిధ్యం తప్పనిసరి అన్న వాదన వస్తోంది. ఈసారి ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధం అవుతున్న దేశాల్లో చిలీ, అర్జంటీనా,

# ఐరాస రేసులో తొలిసారి మహిళ!

**గన్ని మోహన్**

కోస్టారికా, సెనెగల్ దేశాల పేర్లేఎక్కువ వినిపిస్తున్నాయి. వీరిలో ఎక్కువగా చిలీప్రతినిధి పేరే వినిపిస్తోంది. బ్రాచ్‌లెట్ చిలీ దేశానికి రెండు పర్యాయాలు అధ్యక్షురాలిగా పనిచేసారు. ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించి 81 ఏళ్ల అయింది. ఈకాలంలో అత్యున్నత పదవిలో నామినేట్ అయిన వారు ఎవ్వరూ లేరు. తొలిసారిగా ఈ రేసులోకి మహిళలు వచ్చారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు అవసరమని, అగ్రరాజ్యాల ఆధిపత్యమే పెరుగుతోందన్న వాదన ఇటీవలి కాలంలో బలంగాపెరుగుతోంది. దీనికితోడు ఇటీవలి కాలంలో నెలకొన్న ప్రపంచ వ్యాప్త ఉద్రిక్తతలను సర్దుబాటు చేయడంలో సమితి విఫలం అయిందన్న



మిచెల్లీ బ్రాచ్‌లెట్

వాదనలే ఎక్కువ ఉన్నాయి. నిజానికి అన్ని దేశాలకు ప్రాతినిధ్యం లభించాలన్న సాంప్రదాయంతో ఈ పదవిని ఆఫ్రికా, ఆసియాపసిఫిక్, తూర్పు ఐరోపా, లాటిన్ అమెరికా, కరీబియన్, పశ్చిమ యూరప్‌దేశాల నుంచి ఎంపికచేస్తారు. ఇప్పటివరకూ పశ్చిమ యూరప్‌లోని పోర్చుగల్ నుంచే గ్యుటెరెస్ 2017 జనవరి నుంచి ఈ పదవిలో ఉన్నారు. రెండుపర్యాయాలుచేసిన ఆయన ఈసారి దిగిపోవాల్సి న అనివార్యపరిస్థితులు ఏర్పడ్డాయి. అగ్రరాజ్యాలు యుద్ధవిరమణ ప్రతిపాదనలపై సహకరించకపోవడం, సైనిక చర్యలకు చెరోవైపు మద్దతు పలుకుతుండటం వంటి పరిణామాలు సమితికి తలనొప్పిగా కూడా మారాయి. దీనికితోడు భద్రతా మండలిలో శాశ్వత ఐదు సభ్యదేశాల జోక్యం అన్ని సందర్భాల్లోను కనిపిస్తోంది లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రాంతాలకు ప్రాధాన్యం ఉండాలి. కానీ సెనెగల్ స్వదేశం ఆయనను బురిండీ నామినేట్‌చేస్తోంది. రెండూ ఆఫ్రికన్ దేశాలు మాకిసాల్ అభ్యర్థిత్వానికి సుమారు 20 ఆఫ్రికా దేశాల మద్దతులేదు. సెనెగల్ కూడా ఆయన్ను ప్రతిపాదించడంలేదు. చిలీకి బ్రాచ్‌లెట్ గతంలో యుఎన్ మానవ హక్కుల విభాగానికి హైకమిషనర్‌గా కూడా కొనసాగారు. బ్రెజిల్, మెక్సికో దేశాలు ఈమెను నామినేట్ చేసాయి. ఇక రాఫెల్‌గ్రోస్సీ అయితే అణుఇంధన ఏజెన్సీ ఛీఫ్‌గా కొనసాగుతున్నారు. అర్జెంటీనా, యూఎన్ వాణిజ్యం అభివృద్ధి విభాగం చీఫ్‌గా ఉన్న రెబెకా గ్రిన్‌స్పాన్‌ను స్వదేశం కోస్టారికాలు నామినేట్ చేస్తున్నాయి. ప్రస్తుత పోటీ ఇరువురు మహిళల మధ్యనే కొనసాగుతోంది. ప్రధాన కార్యదర్శి పదవిని భద్రతా మండలి సిఫారసులతోపాటు ఐదేళ్లకాలానికి 193 దేశాలతో సమితి సర్వప్రతినిధుల సభ మెజార్టీ ఓటుతో నిర్ణయించేది. గరిష్టంగా రెండుపర్యాయాలు మాత్రమే కొనసాగడానికి అర్హులు. 2016లో జరిగిన పోటీలో 13 మంది పోటీపడ్డారు. అయితే ఈసారి గణనీయంగా తగ్గింది. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. సమితి ప్రాభవం రానురాను తగ్గిపోవడమే. సభ్యదేశాలు నిధులు అందించడంలో చేస్తున్న జాప్యానికి తోడు, సమితి చేపట్టిన నిర్ణయాల అమలులో తాత్సారం కూడా ఒక ప్రధాన కారణం అని చెప్పాలి. నిధుల లేమితో సతమతం కావడం అగ్రరాజ్యాల నుంచి అందించే వార్షిక నిధుల కేటాయింపులు జాప్యం కావడం వంటి వాటితో సమితి ప్రాభవం తగ్గిపోతోందనే చెప్పాలి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణ స్థితుల్లో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు కొత్త సెక్రటరీ జనరల్ ఎంపికలో అత్యంత కీలకం అవుతాయని నిస్సందేహంగా చెప్పాలి. వీటిలో అమెరికాలో ప్రస్తుతం కొనసాగుతున్న పాలక వర్గం అయితే తమ పంతమే నెగ్గి తీరాలన్న మంకుపట్టుతో ఉంటుందన్న సంగతి ప్రపంచానికి తెలిసిందే. ఈ తరుణంలో యుఎన్ సెక్రటరీజనరల్ ఎంపిక ఇప్పుడు ప్రపంచ దేశాలకు ప్రతిష్టాత్మకమనే చెప్పాలి. ●

# యుద్ధం.. ఆధిపత్యాల మధ్య జరిగే నిరంతర పోరాటం

**డా. చిట్యాల రవీందర్**

ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ యవనికపై అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు ప్రపంచాన్ని ఒక సరికొత్త మలుపు వద్ద నిలబెట్టాయి. యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు, వ్యూహాత్మక ఒప్పందాల చుట్టూ తిరుగుతున్న ఈ పరిణామాలు కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణలు మాత్రమే కావు, ఇవి రాబోయే దశాబ్ద కాలపు ప్రపంచ క్రమాన్ని నిర్ణయించే కీలక అంశాలు. ముఖ్యంగా ఉక్రెయిన్ సంక్షోభం, మధ్యప్రాచ్యంలోని ఉద్రిక్తతలు, పసిఫిక్ రీజియన్‌లో పెరుగుతున్న చైనా ప్రాబల్యాన్ని అడ్డుకోవడానికి ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ దేశాలను వివిధ వర్గాలుగా విభజించాయి. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో ముందుకు వెళ్తున్న ట్రంప్, గతంలో ఉన్న అంతర్జాతీయ సంప్రదాయాలను పక్కనపెట్టి కేవలం అమెరికా ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేస్తున్నారు. ఈనేపథ్యంలో ట్రంప్ యుద్ధ తంత్రాన్ని ఏ దేశాలు సమర్థిస్తున్నాయి? చైనా అసలు వైఖరి ఏమిటి? భారత దేశం అనుసరిస్తున్న తటస్థ ధోరణి వెనుక ఉన్న మర్మమే మిటోలోతుగా విశ్లేషించాల్సి న అవసరం ఉంది. అంతర్జాతీయ సంబంధాలలో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్న మాట ట్రంప్ హయాంలో అక్షర సత్యంగా మారుతోంది. అమెరికా తన మిత్ర దేశాలైన యూరోపియన్ యూనియన్, నాటో సభ్యులతో సైతం రక్షణ వ్యయం విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. అయితే ఇదే సమయంలో ఇజ్రాయెల్ వంటి దేశాలకు అప్రతిహతమైన మద్దతు ఇస్తూ మధ్యప్రాచ్యంలో తన పట్టును నిరూపించుకుంటోంది. ట్రంప్ యుద్ధాన్ని లేదా యుద్ధ సన్నద్ధతను సమర్థించే దేశాల జాబితాను పరిశీలిస్తే, అక్కడ భౌగోళిక రాజకీయ ప్రయోజనాలే ప్రాధాన్యత వహిస్తాయి. ఇజ్రాయెల్ వంటి దేశాలు ట్రంప్ కఠిన వైఖరిని తమ ఉనికికి రక్షణగా భావిస్తుంటే, తూర్పు యూరప్‌లోని కొన్ని చిన్న దేశాలు రష్యా ముప్పు నుంచి తప్పించుకోవడానికి అమెరికా అండ కోరుతున్నాయి. కానీ ఇక్కడ గమనించాల్సి న విషయం ఏమిటంటే, ట్రంప్ యుద్ధం కంటే కూడా 'ఆర్థిక యుద్ధానికి' ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఆయన ప్రత్యక్ష సైనిక చర్యల కంటే తీవ్రమైన వాణిజ్య సుంకాలు, ఆర్థిక దిగ్బంధనాల ద్వారా శత్రు దేశాలను లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో చైనా పాత్ర అత్యంత కీలకంగా మారింది. చైనా యుద్ధానికి వ్యతిరేకమా లేక అనుకూలమా అన్న ప్రశ్నకు సమాధానం చాలా సంక్లిష్టంగా ఉంటుంది. బాహ్యంగా చైనా శాంతి ప్రవచనాలు పలుకుతున్నప్పటికీ, లోలోపల తన సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటూనే ఉంది. రష్యాతో చైనాకు ఉన్న బంధం ట్రంప్ వ్యూహాలకు సవాలుగా నిలుస్తోంది. ఉక్రెయిన్ విషయంలో రష్యాకు పరోక్షంగా మద్దతు ఇస్తూనే, ప్రపంచ వేదికపై తాను ఒక బాధ్యతాయుతమైన మధ్యవర్తిగా కనిపించాలని చైనా ప్రయత్నిస్తోంది. అయితే అమెరికా పెడుతున్న వాణిజ్య ఆంక్షలు చైనాను రక్షణ రంగం వైపు మొగ్గు చూపేలా చేస్తున్నాయి. తైవాన్ విషయంలో చైనా వైఖరి యుద్ధ మేఘాలను సూచిస్తున్నప్పటికీ, అమెరికాతో నేరుగా సైనిక ఘర్షణకు దిగడం తన ఆర్థిక వ్యవస్థకు నష్టమని చైనాకు తెలుసు. అందుకే చైనాది యుద్ధ వ్యతిరేకత కాదు, అది ఒక రకమైన వేచి చూసే ధోరణి. ఇక భారత దేశం విషయానికి వస్తే, ప్రపంచం రెండు వర్గాలుగా విడిపోయిన ప్రతిసారీ భారత్ తన ద్వైన ముద్రను వేస్తోంది. భారతదేశం అనుసరిస్తున్న తటస్థ వైఖరి బలహీనత కాదు, అది ఒక వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి. రష్యాతో ఉన్న చారిత్రక స్నేహాన్ని కాపాడుకుంటూనే, అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని భారత్ బలోపేతం చేసుకుంటోంది. ఉక్రెయిన్ యుద్ధం విషయంలోనైనా, ఇతర అంతర్జాతీయ ఘర్షణల విషయంలోనైనా భారత్ శాంతియుత చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని స్పష్టం చేస్తోంది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు చేసుకోవడం ద్వారా తన ఇంధన భద్రతను కాపాడుకుంటూ, అదే సమయంలో అమెరికాకు రక్షణ రంగంలో కీలక భాగస్వామిగా కొనసాగుతోంది. భారత ప్రధాని నరేంద్ర



మోదీ అనేకసార్లు చెప్పినట్లు ఇది యుద్ధాల యుగం కాదు, చర్చల యుగం. కానీ ట్రంప్ వంటి దూకుడు స్వభావంగల నాయకుడితో వ్యవహరించేటప్పుడు భారత్ చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. అమెరికాలో పెరుగుతున్నభారతీయుల ప్రాబల్యం, హెచ్1బి వీసావంటి అంశాలు కూడా ఈ విదేశీ విధానంలో అంతర్భాగంగా ఉన్నాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థ మందగమనంలో ఉన్న తరుణంలో యుద్ధాలు ఏ దేశానికీ మేలు చేయవు. కానీ ఆధిపత్య పోరులో భాగంగా జరిగే ఈ ప్రచ్ఛన్న యుద్ధాలు సామాన్య ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు కొన్ని దేశాలకు ఆశాకిరణంగా కనిపిస్తుంటే, మరికొన్ని దేశాలకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఐరోపా దేశాలు తమ రక్షణ కోసం అమెరికాపై ఆధారపడటం తగ్గించి స్వయం సమృద్ధి సాధించాలని భావిస్తున్నాయి. ఇదే సమయంలో రష్యా తన పట్టుకోల్పోకుండా ఉండటానికి చైనా వైపు చూస్తోంది. ఈ త్రిముఖ పోటీలో ఎవరు మెచ్చిన పనులువారు చేసుకుంటూ పోతుంటే, అంతిమంగా నష్టపోయేది ప్రపంచ శాంతి మాత్రమే. ట్రంప్ ఉద్దేశ్యం యుద్ధం ద్వారా అమెరికాను మళ్ళీ గొప్పగా చేయడంకావచ్చు, కానీ ఆ ప్రయాణంలో ఇతర దేశాల ప్రయోజనాలను పణంగా పెట్టడం వల్ల అంతర్జాతీయ అస్థిరత ఏర్పడుతూ ఉంది. చైనా తన పట్టు వదలకుండా ఆసియాపసిఫిక్ ప్రాంతంలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తుంటే, భారత్ మాత్రం ఒక సంతులనకర్తగా వ్యవహరిస్తోంది. ప్రపంచ దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించగల సత్తా నేడు భారత్‌కు ఉంది. అమెరికా, రష్యా రెండింటితోనూ సమానమైన సంబంధాలను కలిగి ఉన్న ఏకైక పెద్ద దేశం భారత్ మాత్రమే కావడంతో, రాబోయే రోజుల్లో ట్రంప్ యుద్ధ వ్యూహాలను అడ్డుకోవడంలో లేదా మలుపు తిప్పడంలో భారత్ పాత్ర కీలకం కానుంది. మొత్తానికి చూస్తే, ఈ అంతర్జాతీయ చదరంగంలో ప్రతి దేశం తన స్వార్థాన్ని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే పావులు కదుపుతోంది. ట్రంప్ నిర్ణయాలు ఒక వైపు ఉద్రిక్తతలను పెంచుతున్నట్లు అనిపించినా, మరోవైపు అవి ప్రపంచ దేశాలను తమ సొంత రక్షణ, ఆర్థిక విధానాలపై పునరాలోచన చేసేలా చేస్తున్నాయి. యుద్ధం అనేది కేవలం ఆయుధాలతో చేసేది మాత్రమే కాదు, అది ఆలోచనల మధ్య, ఆధిపత్యాల మధ్య జరిగే నిరంతర పోరాటం. ఈ పోరాటంలో ఎవరు గెలిచినా, ఓడినా మానవత్వం, ప్రపంచ అభివృద్ధి కుంటుపడకుండా చూడాల్సి న బాధ్యత అగ్రరాజ్యాలపై ఉంది. భారత్ తన తటస్థ వైఖరితో ఇదే విషయాన్ని ప్రపంచానికి చాటిచెబుతోంది. రాబోయే కాలంలో ట్రంప్ చైనా మధ్య జరిగే వాణిజ్య యుద్ధం ఎలాంటి మలుపులు తిరుగుతుందో, ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు ఎలా దొరుకుతుందో వేచి చూడాలి. ఈ పరిణామాలన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. అందుకే వీటిని విడివిడిగా చూడటంసాధ్యం కాదు. ప్రపంచ శాంతి కోసం అమెరికా తన అహంకారాన్ని, చైనా తన దురాక్రమణ బుద్ధిని పక్కనపెట్టి చర్చల మార్గంలో పయనించాల్సి న అవసరం ఎంతైనాఉంది. అదే సమయంలో భారత్ వంటిదేశాలు తమ స్వతంత్ర విదేశీ విధానాన్ని కొనసాగిస్తూ ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలవాలి. ఎవరు మెచ్చిన పనులు వారు చేసినా, చరిత్ర మాత్రం ఎవరు శాంతిని కాపాడారో వారినే గుర్తుంచుకుంటుంది. ట్రంప్ హయాం ముగిసేసరికి ప్రపంచ పటంలో అధికార కేంద్రాలు ఎక్కడికి మారుతాయో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. అంతర్జాతీయ సంబంధాల విశ్లేషణలో ఇదొక అత్యంత క్లిష్టమైన, కీలకమైన సమయం. ప్రతి అడుగులోనూ ఆచితూచి వ్యవహరించాల్సి న బాధ్యత అటు అగ్రరాజ్యాలపై, ఇటు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఉంది. యుద్ధాల వల్లకలిగే వినాశనాన్ని దృష్టిలో ఉంచుకుని, సహకారం, సమన్వయంతో ముందుకు సాగడమే నేటిఅవసరం. ఈ క్రమంలో భారతదేశం అనుసరిస్తున్న తటస్థ సమతుల్య విధానం మిగిలిన దేశాలకు ఆదర్శంగా నిలవాలి. ప్రపంచ రాజకీయాల్లో నిలకడ లేని ధోరణులు పెరుగుతున్న వేళ, స్థిరమైన, స్పష్టమైన విదేశీ విధానమే ఏదేశానికైనా శ్రీరామ రక్ష. ట్రంప్ యుద్ధ వ్యూహాలు ఏ దిశగా సాగినా, ప్రపంచం మాత్రం ఒక సుస్థిరమైన శాంతిని కోరుకుంటోంది. ఆశాంతి స్థాపనలో ప్రతిదేశం తనవంతుపాత్రను పోషించాలి. అప్పుడే మనం రాబోయే తరాలకు ఒకసురక్షితమైన ప్రపంచాన్ని అందించగలం. ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నాలు సఫలం కావాలని కోరుకుందాం. ●

# కొత్త సిలిండర్ కనెక్షన్లకు బ్రేక్



## పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం
## గ్యాస్ సరఫరాలో తీవ్రస్థాయికి సమస్యలు
## ఈ ఆంక్షలు నెలరోజులు ఉంటాయన్న కేంద్రం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా గ్యాస్‌సరఫరాలో ఉన్న అవాంతరాలను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త గ్యాస్ కనెక్షన్ లను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఇప్పుడున్న కస్టమర్లకు నిరంతరం గ్యాస్ సరఫరాను కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం అవుతోంది. హార్మూజ్ జల సంధి మూసివేతతో భారత్‌లో పరిస్థితులు తారుమారయ్యాయి. ముడిచమురు సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. అరబ్ దేశాల నుంచే భారత్ అత్యధికంగా చమురు, గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభం కాకముందు చమురు, గ్యాస్ ట్యాంకర్లు హార్మూజ్ జలసంధి గుండా సులభంగా భారత్ కు చేరేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అమెరికా, ఇరాన్ సైన్యం హార్మూజ్ నుంచి నౌకలను పంపించడం లేదు. దాంతో చమురు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఆ ప్రభావం భారత్ లోని వంట గ్యాస్ సరఫరాపైనా పడింది. దాంతో ప్రభుత్వ చమురు, గ్యాస్ సంస్థలు కొత్త గ్యాస్ కనెక్షన్లు జారీ చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది.

ఒక నెల రోజుల పాటు కొత్త గ్యాస్ కనెక్షన్స్ జారీ చేయకుండా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇది తాత్కా లిక నిలిపివేత మాత్రమేనని ఒక్కసారి దేశంలో పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత ఈ నిబం ధనను తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇక భారత్ కు ప్రతి ఏటా 3.3 కోట్ల టన్నుల ఎల్పీజీ అవసరం పడుతోంది. ఇందులో దాదాపు 65 శాతం దిగుమతుల నుంచే భారత్ కు చేరు తుంది. అది కూడా అరబ్ దేశాలనుంచే ఈ దిగు మతులకు హార్మూజ్ జలసంధి కీలకంగా మారింది. ఈ జలసంధిని మూసివేసిన కారణంగా ఎల్పీజీ ట్యాంకర్లు భారత్ కు వచ్చేందుకు తీవ్ర అడ్డంకులు ఏర్పడు తున్నాయి. దాంతో భారత్ లోని గ్యాస్ సరఫరాపై ఆందోళన నెలకొంది. సరఫరాలో అంతరాయం కారణంగా దేశంలో గ్యాస్ కొరత ఏర్పడిందని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేస్తు న్నాయి. ఇప్పుడు తమ వద్ద ఉన్న లక్ష్యం ఒకటేనని ప్రస్తుత కస్టమర్లకు ఎలాంటి ఆటంకం లేకుండా గ్యాస్ సరఫరా చేయడమేనని తెలిపాయి. అందువల్ల కొత్త గ్యాస్ కనెక్షన్స్ ను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు స్పష్టం చేశాయి.

అయితే ఇది కొద్దిరో జులు మాత్రమే ఉంటుందని అన్నాయి. ఇక కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ తెలిపిన వివరాల ప్రకారం. దేశంలోని 94 శాతం ఎల్పీజీ సిలిండర్లు అథెంటికేషన్ కోడ్ సిస్టమ్ ద్వారా డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఉన్నా దేశంలో ఇప్పటివరకూ ఎల్పీజీ, పీఎన్జీ, పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని అన్నారు.

# హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకుంటాం..


## బెంగాల్ ఎన్నికల ర్యాలీలో మమతా బెనర్జీ



**కోల్‌కత్తా ఏప్రిల్ 25:** పశ్చిమబెంగాల్ లో హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై తాము చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జి అన్నారు. కేంద్ర హోంమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేయ డం సహేతుకం కాదని ఆమె అన్నారు. హోం మంత్రి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేవిగా ఉన్నాయని విమర్శించారు. అలాంటి వ్యాఖ్యలతో బెంగాల్‌లో గెలువాలనుకుంటే ఎప్పటికీ గెలు వలేరని స్పష్టంచేశారు. బెంగాల్ ప్రజలు అలాంటి వ్యాఖ్యలను ఏమాత్రం అంగీకరించరని చెప్పారు. హుగ్లీలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో మమ తా బెనర్జి ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆమె మండి పడ్డారు. ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోం మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత బెంగాల్‌లోని టీఎంసీ గూండాలను తలకిందులుగా వేలాడదీస్తామని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను మమత తీవ్రంగా తప్పుపట్టారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాగా పశ్చిమబెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈనెల 29న రెండో విడత పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. బెం గాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్ వంటివారు పలుసార్లు బెంగాల్‌లో పర్యటనలు చేసారు. అలాగేప్రధానిమోడీసైతం బెంగాల్‌పై పట్టుకోసం మరిన్ని ర్యాలీల్లో ప్రసంగిస్తూ మమతా బెనర్జీ టార్గెట్‌గా తన ప్రసంగాలు కొనసాగించారు.

# సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని విపక్షాల నోటీసు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని విపక్ష పార్టీలు శుక్రవారం రాజ్యసభలో నోటీస్ అందజేశాయి. ఈ నోటీస్‌పై 27 మంది కాంగ్రెస్ ఎంపీలు సహా 73 మంది ఎంపీలు సంతకం చేశారు. తన పక్షపాత ధోరణిని సీఈసీ ఇంకా కొనసాగిస్తున్నందున ఆయనను అభిశంసించాలని విపక్షాలు నిర్ణయించాయని ఒక నేత తెలిపారు. అత్యంత వివరంగా నమోదు చేసిన, తిరస్కరించడానికో, కప్పిపుచ్చడానికో వీలులేని విధంగా సీఈసీపై తొమ్మిది నిర్దిష్ట ఆరోపణలతో ఈ నోటీస్ అందజేసినట్టు కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్‌తెలిపారు. అయితే ఆ ఆరోపణలు ఏమిటో ఆయన వివరించ లేదు. గతంలో కూడా ఒకపర్యాయం ఇండియా కూటమి నేతలు అంతా సంతకాలుచేసి జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలని నోటీసులు ఇచ్చారు. తర్వాత మళ్లీ తాజాగా మరోసారి 73 మంది ఎంపిలు సంతకాలుచేసి రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌లకు అందచేసినట్లు సమాచారం.

# పాకిస్థాన్‌లో 1.1కోట్ల మంది ఆకలికేకలు



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 25:** పాకిస్థాన్‌లో లక్షలాది మందికి కనీసం ఒక పూట తిండి దొరకడం కూడా గగనమైపోతోంది. తాజాగా విడుదలైన 2026 గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్ నివేదిక వెల్లడించిన వాస్తవాలు చూస్తే యుద్ధం, అంతర్యుద్ధాలతో అల్లాడుతున్న ఆఫ్ఘనిస్తాన్, సుడాన్, యెమెన్ వంటి దేశాల సరసన పాకిస్థాన్ చేరిపోయింది. ప్రపంచంలో అత్యంత తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న మొదటి పది దేశాల్లో ఒకటిగా పాకిస్థాన్ నిలవడం ఆ దేశ పతనానికి అద్దం పడుతోంది. కేవలం గణాంకాల పరంగా చూస్తేనే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థమవుతుంది. సుమారు 1.1 కోట్ల మంది ప్రజలు నేడు ఆకలితో అలమటిస్తున్నారు. కరువుకు అడుగు దూరంలో లక్షలాది మంది.. పాకిస్థాన్‌లోని సుమారు 93 లక్షల మంది సంక్షోభం అనే ప్రమాదకర స్థితిలో ఉండగా, మరో 17 లక్షల మంది పరిస్థితి అత్యవసర సాయంకోసం ఉన్నట్లుగా ఉంది. అంటే వీరు కరవుకు కేవలం ఒక్క అడుగు దూరంలో మాత్రమే ఉన్నారు. బలూచిస్తాన్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా వంటి ప్రావిన్సుల్లో పసిపిల్లలు పోషకాహార లోపంతో కంటికి రెప్పలా మారుతున్నారు. సరైన వైద్యం అందక, తాగడానికి సురక్షితమైన నీరు లేక, తినడానికి తిండి దొరకక లక్షలాది మంది జీవితాలు అంధకారంలో మగ్గిపోతున్నాయి. పాకిస్థాన్‌ను ఈ దుస్థితికి చేర్చడంలో ప్రకృతి కూడా తన వంతు పాత్ర పోషించింది. గత సంవత్సరం కురిసిన అకాల వర్షాలు, భీకర వరదలు సుమారు 60 లక్షల మంది జీవితాలను ఛిన్నాభిన్నం చేశాయి. లక్షలాది ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయాయి, మౌలిక సదుపాయాలు నాశనమయ్యాయి. అప్పుల ఊబిలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ వరదలు కోలుకోలేని దెబ్బ కొట్టాయి. సొంత దేశ ప్రజలకే అన్నం పెట్టలేని స్థితిలో ఉన్న పాకిస్థాన్, లక్షలాది మంది ఆఫ్ఘన్ శరణార్థులకు ఆతిథ్యం ఇవ్వడం ఆ దేశ వనరులపై పెను భారాన్ని మోపుతోంది. మరో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే దేశంలో అసలు ఎంతమంది ఆకలితో ఉన్నారో చెప్పడానికి ప్రభుత్వ వద్ద సరైనసమాచారం కూడా లేదు. ఇప్పుడు కేవలం 68 జిల్లాల డేటా ఆధారంగానే ఇంతటి ఘోరమైన వాస్తవాలు బయటపడ్డాయి. ఒకవేళ దేశం మొత్తాన్ని విశ్లేషిస్తే ఆకలి కేకలు ఇంకెంత తీవ్రస్థాయిలో ఉంటాయోనన్న భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.



# పార్టీని సవ్యదిశలో నడిపిస్తే ఎంపిలు వెళ్లే వారుకాదు: అన్నా హజారే

**అహల్యనగర్, మహారాష్ట్ర, ఏప్రిల్ 25:** ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ్ చద్దాతో పాటు మరో ఆరు మంది రాజ్యసభ ఎంపీలు ఆ పార్టీని వీడిన విషయం తెలిసిందే. ఆప్‌కు గుడ్‌బై చెప్పిన ఆ ఎంపీలు బీజేపీలో చేరారు. అయితే ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త హన్నా హజారే మాట్లాడారు. ఒకవేళ ఆమ్ ఆద్మీ పార్టీ సరైన మార్గంలో పయనిస్తే, బహుశా రాఘవ్ చద్దాతో పాటు ఇతర ఎంపీలు కూడా పార్టీని వీడేవారు కాదు అని అన్నాహజారే అన్నారు. ప్రజాస్వామ్యవ్యవస్థలో ప్రతి ఒక్కరికీ హక్కు ఉంటుందని, బహుశా ఆ ఎంపీలు ఏదైనా సమస్యను ఎదుర్కొని ఉంటారని, అందుకే వాళ్ల పార్టీ వీడినట్లు తెలుస్తోందన్నారు. మహారాష్ట్రలోని అహల్యనగర్ జిల్లాలో రిపోర్టర్లతో అన్నాహజారే మాట్లారు. అన్నాహజారేతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్యనేత కేజ్రీవాల్ అవినీతి ఉద్యమం సాగించిన విషయం తెలిసిందే.

# మంటల్లో పశ్చిమాసియా


## అమెరికాతో ప్రత్యక్ష చర్చల్లేవు: ఇరాన్



**టెహ్రాన్, ఏప్రిల్ 25:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే దిశగా అమెరికా-ఇరాన్ మధ్య పాకిస్థాన్ వేదికగా మలివిడత చర్చలు నేడు జరగనున్నాయి. ఇందుకోసం ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ నేతృత్వంలోని బృందం ఇస్లామాబాద్ చేరుకుంది. అయితే, తొలిదశ చర్చల మాదిరిగా ఈసారి రెండు దేశాల ప్రతినిధుల మధ్య నేరుగా చర్చలు జగరబోవట. ఈ విషయాన్ని టెహ్రాన్ తాజాగా వెల్లడించింది. 'ఇరాన్, అమెరికా ప్రతినిధుల మధ్య సందేశాలను పాక్ అధికారులు బదలీ చేస్తారు. అరాగ్చీ బృం దం పాక్ ఉన్నతాధికారులతోనే సమావేశమవు తుంది. అగ్రరాజ్యానికి మేం చెప్పాలనుకున్న విషయాలను వీరికే వివరిస్తాం' అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. అరాగ్చీతో అమెరికా ప్రతినిధులు నేరుగా చర్చలు జరుపుతారని అంతకుముందు వైట్‌హౌస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ క్రమంలోనే టెహ్రాన్ తాజాగా దీనిపై స్పష్టతనిచ్చింది.

ఈ చర్చల్లో అమెరికా తరఫున ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్కాఫ్, జేర్డ్ కుష్నర్ పాల్గొననున్నారు. వీరి చర్చల్లో పురోగతి కనిపిస్తే.. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కూడా పాక్‌కు వచ్చి సంప్రదింపుల్లో భాగమవుతారని శ్వేతసౌధం తెలిపింది. మరోవైపు, మలివిడత చర్చలకు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ దూరంగా ఉండటం గమనార్హం. అంతర్గత విభేదాల కారణంగా చర్చల బృందం నుంచి ఆయన వైదొలిగినట్లు తెలుస్తోంది. కాగా తాజా పరిణామాలపై ట్రంప్ స్పందించారు. ఈసారి చర్చల్లో అమెరికా డిమాండ్లకు అనుగుణంగా ఇరాన్ ప్రతిపాదనలు చేయనుందని, వాటిని తాము పరిశీలిస్తామని తెలిపారు. అమెరికా షరతులకు అంగీకరిస్తేనే ఏ ఒప్పందమైనా జరుగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. టెహ్రాన్ తమ వద్ద నిల్వ ఉంచిన శుద్ధి చేసిన యురేనియాన్ని వదులుకోవాలని, హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించాలని ట్రంప్ మరోసారి డిమాండ్ చేశారు.

# అత్యాధునిక యుద్ధ విమానం తయారీలో పాకిస్థాన్



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 25:** పాకిస్థాన్ తన రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి అతలాకుతలం అవుతున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్ లో ప్రస్తుతం లాక్ డౌన్ పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినా కూడా పాకిస్థాన్ తన ఎఫ్17 పిఎక్స్ యుద్ధ విమానం తయారీలో మాత్రం వేగం పెంచుతూనే ఉంది. 2028 నాటికి పాకిస్థాన్ ఈ యుద్ధ విమానాన్ని సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు భారత్ తేజస్ యుద్ధ విమానాల తయారీలో జాప్యం జరుగుతోంది. ఓ వైపు భారత్ ఏటా తన రక్షణ వ్యవస్థను మరింతగా బలోపేతం చేసుకుంటూ వెళ్తోంది. ఆ మేరకు రక్షణ రంగ వ్యయం గత పదేళ్లలో భారీగా పెరిగింది. ఈ క్రమంలో భారత్ నుంచి ప్రమాదం పొంచి ఉన్నదన్న భావనతో పాకిస్థాన్ సైతం అప్పు చేసి మరీ తన ఆయుధ సామాగ్రిని పెంచుకుంటోంది. ఈ మేరకు పాకిస్థాన్ అభివృద్ధి చేస్తున్న ఎఫ్16పిఎఫ్ఎక్స్ యుద్ధ విమానం 2028 నాటికి సిద్ధం కానుంది. ఇది 4.5 జనరేషన్ యుద్ధ విమానం అత్యాధునిక ఏసా రాడార్, ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ వ్యవస్థలు, ఇన్ ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ వ్యవస్థలను ఈ యుద్ధ విమానం కలిగి ఉంది. అలాగే చైనాకు చెందిన పిఎల్15 క్షిపణులను సైతం ఈ ఫైటర్ జెట్స్ కు అమర్చనున్నారు. ఇది ఏరియల్ ఫైట్‌లో పాకిస్థాన్‌కు పై చేయిని ఇవ్వగలదని భావిస్తున్నారు. మరోవైపు భారత్ కు చెందిన తేజస్ యుద్ధ విమానంతయారీలో జాప్యం జరుగు తూనే ఉంది. అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ ఎఫ్404 ఇంజిన్ల సరఫరాలో జరుగుతున్న ఆలస్యం కారణంగా భారత్ తేజస్ ప్రోగ్రాంలో ఆలస్యం జరుగుతోంది. భారత్ దాదాపు 180 తేజస్ లీ1తి యుద్ధ విమానాలను ఆర్డర్ ఇచ్చింది. అయితే వీటి ఉత్పత్తిలో మాత్రం జాప్యం జరుగుతోంది. మరోవైపు తేజస్ ప్రాజెక్ట్ లో భారత్ స్వదేశీ సాంకేతికతను ఉపయోగిస్తోంది. ఇదే సమయంలో పాకిస్థాన్ చైనా టెక్నాలజీని వినియోగించుకుని వేగంగా కొత్త వెర్షన్లను అందుబాటులోకి తెస్తోంది. 2028 నాటికి పాకి స్థాన్ ఎఫ్-17 యుద్ధ విమానం రెడీ అయిపోయి అలాగే భారత్ తేజస్ ఫైటర్ జెట్స్ లో ఆలస్యం అయితే ఇండో పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మకంగా ఆందోళనలు పెరిగే ప్రమాదం ఉంది.



# మణిపూర్‌లో మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు

**ఇంఫాల్, ఏప్రిల్ 25:** మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం నివాసం వద్దకు ర్యాలీగా వెళ్లేందుకు నిరసకారులు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులతో ఘర్షణ జరగడంతో బాష్పవాయు ప్రయోగించారు. ఈనెల 7న బిష్ణుపూర్ జిల్లాలో ఒక వ్యక్తి ఇంటిపై మోర్టార్ దాడి జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ దాడిలో ఇద్దరు చిన్న పిల్లలు మరణించగా, వారి తల్లి తీవ్రంగా గాయపడింది. దీంతో మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. శనివారం ఇంఫాల్‌లో మణిపూర్ సమగ్రతా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరు కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించడానికి సీఎం యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిరసనకారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు బాష్పవాయువును ప్రయోగిం చారు. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించారు.

# సహకరించని వారికి శిక్ష తప్పదు: ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, ఏప్రిల్ 25:** పశ్చిమాసియాలో గతంలో అమెరికా చేసిన యుద్ధాలకు సహకరించిన నాటో దేశాలు.. ఇరాన్ యుద్ధంలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. కొన్ని సభ్య దేశాలైతే అమెరికా దాడిని బహిరంగంగానే తప్పుబడుతున్నాయి. ఇది అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో తమకు మద్దతివ్వని నాటో దేశాలపై చర్యలు ఉపక్రమించేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా తమకు అనుకూల, వ్యతిరేక దేశాలతో రెండు జాబితాలను తయారుచేసింది.

**ఏవి అనుకూలం:** ఐరోపాలో అగ్రరాజ్యానికి అత్యంత విధేయంగా వ్యవహరిస్తున్న దేశాల్లో పోలండ్ ఒకటి. దాదాపు 10 వేల మంది అమెరికా సైనికులకు ఆ దేశం ఆశ్రయమిస్తోంది. వీరికయ్యే ఖర్చుల్లో సింహభాగం కూడా భరిస్తోంది. అంతే కాదు, పశ్చిమాసియాలో అమెరికా నిర్వహిస్తున్న సైనిక ఆపరేషన్లకు అవసరమైన లాజిస్టిక్ మద్దతునూ అందిస్తోంది. రుమేనియా కూడా అమెరికాకు పూర్తిగా సహకరిస్తోంది. తమ వైమానిక స్థావరాల్లో అగ్రరాజ్య విమానాలకు దిగేందుకు అనుమతులిచ్చింది. బాల్టిక్ దేశాలైన ఎస్తోనియా, లాత్వియా, లిథువేనియాలు కూడా అగ్రరాజ్యానికి సంపూర్ణ మద్దతు తెలిపాయి.

**వ్యతిరేక దేశాలేంటంటే..** నాటోలో కొన్ని దేశాలు మాత్రం ఇరాన్‌పై యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. స్పెయిన్ అయితే బహిరంగంగానే వాషింగ్టన్ వైఖరిని తప్పుబట్టింది. తమ సైనిక స్థావరాలను వినియోగించుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతివ్వబోమని స్పష్టం చేసింది. యుద్ధం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆ దేశ అధ్యక్షుడు పెడ్రో శాంచెజ్ స్వయంగా ప్రకటించారు. మిత్రదేశమైనా.. చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే సహకరించబో మంటూ కుండబద్దలు కొట్టారు. స్పెయిన్ అంత కఠినంగా కాకాపోయినా, బ్రిటన్ కూడా యుద్ధానికి వ్యతిరేకంగానే తన గళాన్ని వినిపిస్తోంది. పోరు ఆరంభంలో తమ సైనిక స్థావరాల నుంచి ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేయడానికి అంగీకరించలేదు. తర్వాత రక్షణాత్మక చర్యల కెసం వాడుకోవడానికి అనుమతించినా.. హర్మూజ్ జలసంధి తెరవడానికి సహకరించాలన్న ట్రంప్ పిలుపునకు మద్దతివ్వలేదు. దీంతో బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌కు ధైర్యం లేదంటూ ట్రంప్ విమర్శలు చేశారు. అంతటితో ఆగలేదు. బ్రిటన్ విమాన వాహక నౌకలను బొమ్మలతో పోలుస్తూ అవహేళన చేశారు.

# బుజ్జగించాలనుకునేలోగా పార్టీ మారిన ఎంపీలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** అసమ్మతి ఎంపీలను బుజ్జగించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ సిద్ధమవుతుండగానే, ఆయనకు ఊహించని రీతిలో భారీ షాక్ తగిలింది. పార్టీపై గుర్రుగా ఉన్న ఎంపీలతో సమావేశమై, వారిని శాంతింపజేయాలని ఆయన వేసిన ప్రణాళిక కార్యరూపం దాల్చక ముందే, ఏడుగురు కీలక రాజ్యసభ సభ్యులు పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీర్థం పుచ్చుకున్నారు. ఈ నాటకీయ పరిణామం జాతీయ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం పార్టీలో అసమ్మతి పెరుగుతోందని గ్రహించిన కేజ్రీవాల్ తన నివాసంలో కీలక ఎంపీలతో సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వారిని బుజ్జగించి, అవసరమైతే ప్రస్తుతానికి రాజీనామా చేయాలని, తదుపరి టర్మ్‌లో మళ్లీ అవకాశమిస్తానని హామీ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కేజ్రీవాల్ వ్యూహాన్ని పసిగట్టిన అసమ్మతి వర్గం ఆయనకు ఆ అవకాశం ఇవ్వలేదు. గురువారమే పార్టీని వీడాలని రహస్యంగా నిర్ణయించుకుని, శుక్రవారం ఉదయమే బీజేపీ అగ్రనేతలతో మంతనాలు జరిపి, కేజ్రీవాల్ సమావేశానికి కొన్ని గంటల ముందే తమ రాజీనామా నిర్ణయాన్ని బహిరంగపరిచారు. ఈ పరిణామంతో ఆప్ నాయకత్వం పూర్తిగా దిగ్భ్రాంతికి గురైంది. బీజేపీలో చేరిన అనంతరం రాఘవ్ చద్దా మీడియాతో మాట్లాడుతూ ఆప్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకప్పుడు మేమంతా రక్తమాంసాలు ధారపోసి నిర్మించుకున్న పార్టీ ఇది. కానీ, నేడు ఆప్ తన మూల సిద్ధాంతాలను, విలువలను పూర్తిగా విస్మరించింది. అందుకే మేం ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండేందుకే రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం మూడింట రెండొంతుల మంది సభ్యులుగా (10 మందిలో 7) తాము విలీన నిర్ణయం తీసుకున్నామని, దీనికి సంబంధించిన పత్రాలను రాజ్యసభ ఛైర్మన్‌కు అందజేశామని చద్దా స్పష్టం చేశారు. రాఘవ్ చద్దా, హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్, సందీప్ పాఠక్ వంటి ప్రముఖులు పార్టీ వీడిన వారిలో ఉన్నారు. ఈ అనూహ్య పరిణామంపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఇది బీజేపీ కుట్రపూరితంగా అమలు చేసిన "ఆపరేషన్ లోటస్" అని ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ సింగ్ ఆరోపించారు. "పంజాబ్‌లో మా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేకే బీజేపీ ఈ నీచ రాజకీయాలకు పాల్పడుతోంది. మా ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది," అని ఆయన మండిపడ్డారు. మొత్తం 10 మంది రాజ్యసభ సభ్యుల్లో ఏకంగా ఏడుగురు పార్టీని వీడటంతో, 14 ఏళ్ల ఆప్ చరిత్రలోనే ఇది అతిపెద్ద సంక్షోభంగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# అనవసరంగా వివాదంలోకి లాగారు: మాజీ ఆర్మీచీఫ్ నరవణే


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:** పార్లమెంట్ వేదికగా తన పుస్తకంపై తీవ్ర చర్చ జరగడంపై భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె అసహనం వ్యక్తంచేసారు. నరవణె రాసినఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకంపై ఇటీవల తీవ్ర చర్చ జరిగింది. తన పుస్తకం ఇంకా పబ్లిష్ కాకపోయినా అనవసరంగా తనను వివాదంలోకి లాగారని ఓ ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యానించారు. పరోక్షంగా రాహుల్ గాంధీ పై ఆయన విమర్శలు చేశారు. నరవణె రాసిన మరో పుస్తకం ద క్యూరియస్ అండ్ ద క్లాసిఫైడ్ అన్‌ఎర్త్ మిలిటరీ మైత్స్ అండ్ మిస్టరీస్ ఇటీవల విడుదలైంది. ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీని పూర్తిగా పరిశీలించేవరకు ప్రచురణను నిలిపివేయమని రక్షణ మంత్రిత్వశాఖ కోరింది. ఆ విషయం అక్కడితో ముగిసింది.

# కేదార్‌నాథ్‌కు 90వేల మంది భక్తుల రాక



**డెహ్రాడూన్, ఏప్రిల్ 25:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్న తర్వాత భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఈ యాత్రా సీజన్‌లో ఆలయం తెరిచిన మొదటి మూడు రోజుల్లోనే 90వేల మందికి పైగా యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు. ఈ నెల 22న బుధవారం హిమాలయాల్లోని ఈ ఆలయ తలుపులు భక్తుల కోసం తెరుచుకున్న విషయం తెలిసిందే. కేదార్‌పురిలోని యాత్రా ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం రుద్రప్రయాగ్ ఎస్పీ నిహారికా తోమర్ ఈ వివరాలను వెల్లడించారు. ప్రారంభ రోజుల్లో భక్తుల్లో భారీ ఉత్సాహం కనిపించింది. ఇప్పటివరకు 90 వేల మందికి పైగా యాత్రికులు దర్శనం పూర్తి చేసుకున్నారని ఆమె తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం తొలి రోజైన 22వ తేదీ అత్యధికంగా 38వేల మందిభక్తులు స్వామిని దర్శించుకున్నారు. రెండో రోజు 25వేల మందికి పైగా, మూడో రోజైన శుక్రవారం మరో 30వేల మందికి పైగా యాత్రికులు కేదార్‌నాథ్ చేరుకున్నారు. భక్తుల భారీ తాకిడి నేపథ్యంలో ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వివరించారు. జనసందోహాన్ని నియంత్రించేందుకు స్థానిక పోలీసులతో పాటు కేంద్ర పారామిలిటరీ బలగాలను కూడా మోహరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఫైర్ సర్వీస్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు. అంతకుముందు జిల్లా మేజిస్ట్రేట్ విశాల్ మిశ్రా, ఎస్పీ నిహారికా తోమర్‌తో కలిసి ఆలయ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు తీసుకుంటున్న చర్యలను వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారు కీలక సూచనలు చేశారు. ప్రయాణానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం కోసం కేవలం పోలీసులు, జిల్లా యంత్రాంగం తాలూకు అధికారిక సోషల్ మీడియా ఖాతాలను మాత్రమే అనుసరించాలని వారు విజ్ఞప్తి చేశారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి ఇబ్బందులు పడొద్దని సూచించారు.

# ఇరాన్ అణ్వాయుధాల తయారీని ఆపే వరకు హర్మూజ్ దిగ్బంధమే



**వాషింగ్టన్, ఏప్రిల్ 25:** హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా కట్టుదిట్టమైన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఈ విషయంపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మాట్లాడుతూజలసంధిపై నియంత్రణను మరింత కాలం పొడిగిస్తామన్నారు. హర్మూజ్ చుట్టూ అమెరికా నేవీ దిగ్బంధనాన్ని ఉక్కు కవచంతో పోల్చారు. ఇది శాశ్వత దిగ్బంధనంగా మారే అవకాశమూ ఉందని హెచ్చరించారు. టెహ్రాన్ తన అణ్వాయుధాల తయారీని విడనాడే వరకు ఆ దేశంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామన్నారు. అంతర్జాతీయ స్థిరత్వానికి ఇరాన్ నుంచి పొంచి ఉన్న ముప్పును తొలగించడానికే తాము ఈ సాహసోపేతమైన, ప్రమాదకరమైన మిషన్‌ను చేపట్టామన్నారు. తమ అనుమతి లేకుండా హర్మూజ్ లోకి ఏ రవాణా నౌక రాదని, బయటకు వెళ్లదని పీట్ హెగ్సెత్ అన్నారు. జలసంధిలోని నౌకలపై దాడులు చేస్తూ.. టెహ్రాన్ సముద్రపు దొంగల ముఠాలా ప్రవర్తిస్తోందన్నారు. తన చర్యలతో సముద్ర భద్రతను అస్థిరపరుస్తోందని ఆరోపించారు. తమ దిగ్బంధనం గల్ఫ్ దాటి విస్తరిస్తోందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని కాపాడడానికి తాము ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటామన్నారు. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ పరోక్ష చర్చలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో హెగ్సెత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు హర్మూజ్ దిగ్బంధనం ప్రారంభమైనప్పటినుంచి 34 నౌకలను వెనక్కి పంపినట్లు అమెరికా జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ డాన్ కెయిన్ వెల్లడించారు.

# గత ప్రభుత్వంలోని 11 మందికి ఎబివి నోటీసులు



ఎబి వెంకటేశ్వరరావు

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు గత ప్రభుత్వ హయాంలో తనపై జరిగిన చర్యలపై న్యాయపోరాటం ముమ్మరం చేశారు. పలువురు ఐపీఎస్ అధికారులు, కీలక వ్యక్తులకు ఈరోజు ఆయన పంపిన లీగల్ నోటీసులు ఐపీఎస్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తన పరువుకు భంగం కలిచారంటూ ఏకంగా 11 మందికి ఆయన పరువునష్టం నోటీసులు పంపారు. అక్రమ కేసులు బనాయించడం, తప్పుడు సమాచారాన్ని మీడియాకు లీక్ చేయడం ద్వారా తనను మానసిక వేదనకు గురిచేశారని ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు. తన పరువుకు భంగం కలిగించినందుకు గాను రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలని ఏబీవీ డిమాండ్ చేశారు. అప్పట్లో తప్పుడు ఆరోపణలతో తనను సస్పెండ్ చేయడమే కాకుండా, వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన అధికారులే లక్ష్యంగా ఈ నోటీసులు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. నోటీసులు అందుకున్న వారిలో... గౌతమ్ సవాంగ్ (అప్పటి డీజీపీ), పీఎస్ఆర్ ఆంజనేయులు (అప్పటి ఇంటెలిజెన్స్ బాస్), రవిశంకర్ అయ్యనార్ (అప్పటి ఏడీజీ), పూడి శ్రీహరి (అప్పటి సీఎం జగన్ సీపీఆర్వో) తదితరులు.

## చెట్టును ఢీకొట్టిన టాటా ఎసి వాహనం ఇద్దరు వ్యక్తులు మృతి

**మద్దిరాల ఏప్రిల్ 25 ప్రభాత వార్త:** పండగ చేసుకుందామని కుటుంబ సభ్యులతో హైదరాబాద్ నుండి స్వంత గ్రామానికి ప్రైవేట్ వాహనం లో బయలుదేరి కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుతామనుకుంటున్న సమయంలో మృత్యువు వెంటాడి వాహనంచెట్టుకు డీ కొని టాటా ఏసీ వాహనం బోల్తా పడి ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన విషాదకర సంఘటన మండలంలోని చెననేమిల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై వీరన్న తెలిపిన వివరాల ప్రకారం చిననేమిల గ్రామానికి చెందిన సూరారపు శంకర్ హైదరాబాద్ లో కూలీ పని చేసుకుంటూ తన కుటుంబం తో జీవనం సాగిస్తున్నడు. మంగళవారం ఇంటి దగ్గర దేవుడి పండగ చేసుకుందామని తన గ్రామానికి చెందిన దబ్బేటి రామ్మూర్తి కి చెందిన ట్రాలీ వాహనం నెంబర్ టి ఎస్ 29 టి ఎ 0221 గల వాహనం లో కుటుంబ సభ్యులతో బయలుదేరి శనివారం తెల్లవారు జామున సుమారు రెండు గంటల సమయంలో చిననేమిల గ్రా శివారులోని వేగంగా వచ్చి చెట్టుకు బలంగా డీ కొట్టి బోల్తా పడి శంకర్ బంధువైన కొమ్ము బాబా( 18) కు బలంగా గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని శంకర్ భార్య సూరారపు రాద( 30)కు తీవ్ర గాయాలై హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందినదని శంకర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు

## పేద విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

### తిరుపతి అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఆకస్మిక తనిఖీ: మంత్రి డోలా వీరాంజనేయస్వామి



**తిరుపతి విద్య, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదిగి, సమాజంలో మంచి స్థానం సంపాదించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. శనివారం తిరుపతిలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి సౌకర్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మంత్రి నేరుగా మాట్లాడారు. హాస్టల్ వసతి, భోజన నాణ్యత, బోధన విధానం, లైబ్రరీ, స్టడీ మెటీరియల్ వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందిస్తున్న సదుపాయాలు సంతృప్తికరంగా ఉన్నాయని, కోచింగ్ బాగా ఉపయోగపడుతోందని అభ్యర్థులు వెల్లడించారు. కొంతమంది విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం ఇస్తున్న సహాయం ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ, పేద మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, పోటీ పరీక్షల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలోని అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో ప్రస్తుతం 340 మందికి సివిల్స్ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందిస్తున్నామని వివరించారు. అదనంగా, మరిన్ని విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ట్యాబ్‌ల సహాయంతో ఆన్‌లైన్ శిక్షణను కూడా అందిస్తున్నామని చెప్పారు. ఇక నర్సింగ్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జర్మన్ భాషలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ శిక్షణ ద్వారా జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందే మార్గాన్ని ప్రభుత్వం సులభతరం చేస్తోందన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ యువతను గ్లోబల్ స్థాయిలో పోటీకి సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. పేద విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చడం మాత్రమే కాకుండా, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. యువత అభ్యున్నతి రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన బలమని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీ సందర్భంగా అధికారులు, సిబ్బంది మరియు అధ్యాపకులతో కూడా మంత్రి చర్చించి, సౌకర్యాల మెరుగుదల కోసం అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలని

## పుత్తూరువద్ద ప్రమాదంలో వ్యక్తి మృతి

**తిరుపతి,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా పుత్తూరు శివార్లలోని శిరుగు రాజపాలెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. పుత్తూరు మండలం శిరుగు రాజుపాలెం సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో చెన్నై జాతీయ రహదారిపై

తిరుపతి నుండి పుత్తూరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం రోడ్డుదాటుతున్న సమయంలో నాదముని తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించే లోపు అతను ప్రాణాలు కోల్పోయాడు. ద్విచక్ర వాహనదారులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదపు సంఘటనపై ఎస్ఐ బి.వెంకటలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీహరికోట తీరప్రాంత భద్రతపై ఐజీపి గోపినాథ్ జెట్టి సమీక్ష

### - రాయదరువులో జెట్టి నిర్మాణానికి అడుగులు



**శ్రీహరికోట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మెరైన్ పోలీస్ ఐజీపి గోపినాథ్ జెట్టి శనివారం శ్రీహరికోట ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. దేశ రక్షణ రంగంలో అత్యంత కీలకమైన షార్ కేంద్రానికి సమీపంలో ఉన్న తీరప్రాంత భద్రతను మరింత పటిష్టం చేసే లక్ష్యంతో ఈ పర్యటన సాగింది. తొలుత ఆయన శ్రీహరికోట మెరైన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిధిలోని సిబ్బంది పనితీరును, పెట్రోలింగ్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. తీర ప్రాంతంలో అపరిచిత వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, మత్స్యకారులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన రాయదరువు ప్రాంతానికి చేరుకుని, అక్కడ నూతనంగా నిర్మించ తలపెట్టిన మెరైన్ జెట్టి నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీపి మాట్లాడుతూ.. మెరైన్ పోలీసుల బోట్లు నిలపడానికి, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించడానికి సొంత జెట్టి సౌకర్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ స్థల పరిశీలనలో మత్స్యశాఖ అధికారులతో కలిసి సాంకేతిక అంశాలను చర్చించారు. జెట్టి నిర్మాణం వల్ల అటు పోలీసులకు, ఇటు స్థానిక మత్స్యకారులకు చేకూరే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ, శ్రీహరికోట ఎస్ఐ భాను, మెరైన్ ఎస్ఐ, భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీహరికోట భద్రత దృష్ట్యా సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు కూడా ఈ పర్యటనలో పాల్గొని, సముద్ర మార్గం ద్వారా ఎదురయ్యే సవాళ్లు మరియు అంతర్గత భద్రతా అంశాలపై ఐజీపితో చర్చించారు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించాలని ఐజీపి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

## మంత్రి అనిత ఆన్‌లైన్ వేదికగా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష!

**అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసిన హోం మంత్రి**

**(నక్కపల్లి,అడ్డు రోడ్డు, ప్రభాతవార్త )ఏప్రిల్ 25:** వేసవికాలం నేపథ్యంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మార్చి నెలలో హోం మంత్రి అనిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న హోం మంత్రి అనిత, అక్కడి నుంచే పాయకరావుపేట నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. సింగపూర్‌లో అధ్యయన పర్యటనలో ఉన్నప్పటికీ, మంత్రి ఆన్లైన్ వేదికగా మరోసారి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా త్రాగునీటి సమస్య రాకూడదని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఎంపీడీవోలు బాధ్యత తీసుకుని పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా నీటి కొరత సమస్య తలెత్తిన వెంటనే ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని ఆదేశించారు. నాయకులు, అధికారులు పరస్పర సమన్వయంతో సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అనిత పేర్కొన్నారు.

## కోవూరు సిహెచ్‌సిలో అందుబాటులోకి అత్యాధునిక వైద్య పరికరాలు

**కోవూరు, (నెల్లూరు), ఏప్రిల్ 25ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, కోవూరు ప్రజానీకం వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద రోగుల పట్ల ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది మానవతా దృక్పదంతో సేవలు అందించాలన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు పాలనలో వైద్య ఆరోగ్య శాఖలో కూడా ఊహించని విధంగా మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. సీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఆమె లేబొరేటరీ, ఫార్మాసిస్ట్ స్టోర్, వార్డుల్లో స్వయంగా పరిశీలించి బాలింతలకు జిల్లా కలెక్టర్‌తో కలిసి పండ్లు పంపిణీ చేశారు. ఈ పరిశీలనలో జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ పరిమళ, పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, వీరేంద్రనాయుడు, సాయిరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసులు, సురేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, వైద్యులు డాక్టర్ ఎస్‌కే సలావుద్దీన్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ జ్యోతిప్రభ, డాక్టర్ సురేష్ ,డాక్టర్ పద్మావతి, డాక్టర్ సరోజ, డాక్టర్ సంధ్య, స్టాఫ్ నర్సు ప్రసూనలత, తదితరులు ఉన్నారు.

## రైల్వేస్టేషన్‌లను పరిశీలించిన పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



**పార్వతీపురం (మన్యం జిల్లా), ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఈ ఏడాది డిసెంబర్ నెలలోపు పార్వతీపురం, బెలగాం రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా తీర్చి దిద్దడం జరుగుతుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం ఎమ్మెల్యే విజయచంద్ర రైల్వే డిఆర్ఎం లలిత్ బోహ్రాతో కలిసి పార్వతీపురం టౌన్, బెలగాం, నర్సిపురం రైల్వే స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్వతీపురం రైల్వే స్టేషన్లలో ఉన్న సమస్యలపై డిఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ పార్వతీపురంలో గల రెండు రైల్వే స్టేషన్లను యధావిధిగా ఉంచాలని డిఆర్ఎంను కోరడం జరిగిందని అన్నారు. అలాగే త్వరలోనే 60 కోట్ల నిధులతో ఆర్ఓబి బ్రిడ్జిని బెలగాం నుంచి మిగతా గ్రామాలకు కనెక్టింగ్ జరిగే విధంగా నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగిందని, దీనికి డిఆర్ఎం స్పందించారని అన్నారు. పార్వతీపురం రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడానికి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. అలాగే కొత్తవలస రైల్వే స్టేషన్ నుంచి గేటు దాటి వెళ్లడానికి ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి సంబంధించి ఆర్ యు బి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డీఆర్ఎంను ఎమ్మెల్యే కోరారు. తప్పకుండా ఈ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని డిఆర్ఎం హామీ ఇచ్చారు. మన ప్రాంతంలో రైల్వే స్టేషన్‌ను పరిశీలించడానికి రావాలని కోరిన వెంటనే వచ్చిన డిఆర్ఎమ్ కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నర్సిపురం గ్రామస్తులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించడానికి డిఆర్ఎం స్పందించారని, జూన్ నెలకు ఈ సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం చినబోగిలి రైల్వే గేటును పరిశీలించారు. నూతనంగా నేర్పించిన రైల్వే అండర్ బ్రిడ్జిలో లైట్లు లేకపోవడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి లైట్లు ఏర్పాటు చేయడానికి డిఆర్ఎం హామీ ఇచ్చారు. అలాగే రైల్వేపరమైన కొన్ని సమస్యలపై, అలాగే రైల్వే స్టేషన్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే డిఆర్ఎమ్ కు తెలియజేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో ఎమ్మెల్యేతో పాటు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ఎస్టి కమిషన్ చైర్మన్



చెంచులకు పరికరాలు అందజేస్తున్న చైర్మన్

**శ్రీశైలంప్రాజెకు ,ఏప్రిల్25,ప్రభాతవార్త** శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంను శనివారం నాడు ఏపి రాష్ట్ర ఎస్టి కమీషన్ చైర్మన్ సోలా బొజ్జిరెడ్డి శ్రీశైలం మల్లన్న దర్శనార్థమై శ్రీశైల ంకు చేరుకున్నారు. ఆలయ రాజగో పురం వద్ద ఈఓ ఎం. శ్రీనివాసరావు, అర్చక స్వాములు సాదర స్వాగతం పలికారు. తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకోని పూజలు నిర్వహించుకున్నారు. తదుపరి అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేదపండింతులు వేదాశీర్వచనములు వల్లించగా అర్చకస్వాములు తీర్థ ప్రసాదములు అందజేసారు. తదుపరి శ్రీస్వామివార్ల శేషవస్త్రములతో సత్కరించి లడ్డు ప్రసాదములు, శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను ఈఓ శ్రీనివాసరావు అందజేసారు. చెంచుల సమస్యలపై ఐటిడిఏలో సమావేశం:ఏపి ఎస్టి కమీషన్ చైర్మన్ సోలా బొజ్జిరెడ్డి శ్రీశైలం ఐటిడిఏ కార్యలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు జిల్లాలో ఉన్న చెంచుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. తదుపరి చెంచులకు అవసరమైన పరికరాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కాకి లక్ష్మి, మల్లేశ్వరరావు, శ్రీశైలం ఐటిడిఏ ప్రాజెక్టు ఆదికారి పి.వి.ఎస్.నాయుడు, ఏపిఓ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 27న అన్ని జిల్లాల కేంద్రాల్లో నిరసన

### వైఎస్సార్సీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి పిలుపు

**విజయవాడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** పంచాయతీ రాజ్ శాఖలో పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగంరాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు 18 కోట్ల 57 లక్షల పనిదినాలకి సంబంధించి రూ.1059 కోట్లు డిసెంబర్ నుంచి చెల్లించలేదని దీనితో ఉపాధి హామీ కూలీలు పూట గడవక తీవ్రంగా అల్లాడిపోతున్నారని కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణి కారణంగా పంచాయతీ రాజ్ పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని విమర్శించారు. వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## పద్మావతిశ్రీనివాసుల పరిణయ వేడుకలు ఆరంభం



**తిరుమల,ఏప్రిల్ 25పభాతవార్తప్రతినిధి:** కలియుగంలో వేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించిన తొలిరోజుల్లో నారాయణవనంలోని ఆకాశరాజు కుమార్తె పద్మావతిని వివాహమాడిన ఘట్టం నేటికీ తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు నిర్వహిస్తున్నారు. మూడురోజులుపాటుజరిగే ఈ పరిణయోత్సవాలు శనివారం సాయంత్రం కన్నులపండువగా మొదలయ్యాయి. తొలిరోజు సాయంత్రం మలయప్పస్వామి గజవాహనంపై ఆలయం నుండి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనాలు చేరుకోగా శ్రీదేవిభూదేవులు పల్లకీపై మంగళవాయిద్యాల నడుమ చేరుకున్నారు. ఉద్యానవనంలోని కల్యాణవేదికపైకి మంగళవాయిద్యాలనడుమ వేంచేపుచేశారు. కల్యాణవేదిక వద్ద ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా ఫల,పుష్పాలతో తీర్చిదిద్దిన కల్యాణమండపం వేదికపై స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చారు. ఆగమోక్తంగా కల్యాణఘట్టాన్ని జరిపించారు. కొలువు,ఎదురుకోలు, పూలబంతులాట ,నూతన వస్త్రాలు ధరింపజేయడం వంటివి అర్చకులు జరిపించడంతో భక్తులు కన్నులపండువగా వీక్షించి ముగ్ధులయ్యారు. అక్కడ నుండి మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు, అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఇంధన కొరత లేకుండా అన్ని చర్యలు : సిఎం చంద్రబాబు




**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇంధన కొరత లేకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. వ్యవసాయరంగంలో వినియోగించే యంత్రాలకు అవసరాలకు అనుగుణంగా డీజిల్ అందుబాటులో ఉంచుతామన్నారు. రాష్ట్రంలో ఇంధన కొరత అన్నివర్గాలను ఇబ్బందులకు గురిచేస్తోంది. కీలకంగా వ్యవసాయరంగంపై డీజిల్ కొరత ప్రభావం కన్పిస్తుంది. ఉమ్మడి గోదావరి,కృష్ణా జిల్లాల్లో డీజిల్ కొరత వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోంది. రబీ కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో డీజిల్ లభించక వరికోత యంత్రాలకు ఇబ్బంది ఏర్పడిందిఇ అటు ఆక్వా రైతులు, ఇటు వాహనదారులు చమురు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 10 ఎకరాల వరి కోయాలంటే యంత్రం కనీసం 10 నుంచి 15 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. దీనికోసం రోజుకు 100 నుంచి 160 లీటర్ల డీజిల్ అవసరం అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని బంకుల్లో స్టాక్ లేకపోవడంతో యంత్రాలు షెడ్లకే పరిమితమయ్యాయి. ఉన్నచోట కూడా ఒక్కొక్కరికి 50 లీటర్లకు మించి ఇవ్వడం లేదు. పలు జిల్లాల్లో పెట్రోల్ బంకులు మూతపడటంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో రాష్ట్రంలో తలెత్తిన ఇంధన కొరతపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అత్యవరసర సమీక్షను నిర్వహించారు. సమస్యను తక్షణమే పరిష్కరించాల ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సీఎస్ సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. పెట్రోల్ బంకుల యజమానులు, ఆయిల్ కంపెనీలతో మాట్లాడి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. సీఎం ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. పౌరసరఫరాల శాఖ అధికారులు పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్‌తో ఫోన్‌లో చర్చించారు. స్టాక్ లేని బంకుల వివరాలను వెంటనే అందించాలని ఆదేశించారు. దీంతో రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ జిల్లాల అధ్యక్షులకు సమాచారం పంపింది. స్టాక్ సమస్య ఉన్న డీలర్లు టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్‌చేసి వివరాలు నమోదు చేయాలని పౌరసరఫరాల కమిషనర్ కోరారు. కాగా, గత ఏప్రిల్ కంటే 10 శాతం అదనపు ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ఆయిల్ కంపెనీలు అంగీకరించాయి. పెట్రోల్ డీలర్ల నుంచి ఏపీఎఫ్‌పీటీ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి పేరం రవికుమార్ వివరాలు సేకరిస్తున్నారు. ఆయిల్ కంపెనీల సరఫరా తీరుపై క్షేత్రస్థాయి నివేదికను కమిషనర్‌కు సమర్పించేందుకు అసోసియేషన్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో రానున్న రోజుల్లో ఇంధన కొరత ఉండబోదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## టెన్త్ మూల్యాంకనంపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

**విజయవాడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టెన్త్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం, ఫలితాల ప్రాసెసింగ్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు శ్రీనివాసురెడ్డి సూచించారు. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల ప్రక్రియ ప్రతి దశలోనూ పారదర్శకంగా, బాధ్యతాయుత విధానాల్లో చేస్తున్నాం. విద్యార్థుల, తల్లిదండ్రులు ఆన్‌లైన్ వేదికల్లో ప్రచారమవుతున్న వదంతులు, అపోహలు నమ్మొద్దు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఫలితాల విడుదలపై ఇంతవరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు అని తెలిపారు.

## పాడుబడిన కాటేజీని బాగుచేయండి

### - హథీరాంజీ మఠం

**తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:** లక్షమంది వరకు భక్తులు వస్తున్న తిరుమల పుణ్యక్షేత్రంలో హథీరాంజీమఠంకు చెందిన కాటేజీలు పురాతనమయ్యాయి. ఈ మఠాల గదుల్లో భక్తులు ఉండటానికి కూడా వీలులేకపోతోంది. తిరుమలలో ఇప్పటికే టిటిడి కాటేజీల ఆధునికరణలో కాలానుగుణంగా వసతి భవనాలు మరమత్తులు చేసి చక్కగా నిర్వహిస్తోంది. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం పూర్వ పాలానా సంస్థానం హథీరాంజీ మఠం యాజమాన్యం తమ పరిధిలోని అరవై గదులను బాగుచేసి ఆధునీకరించడంలో విఫలమై వైనుకడుగు వేస్తోంది. మఠంకు అనుబంధంగా ఉన్న కాటేజీల్లో ఉన్న గదులను కనీసం మరమత్తులు చేయలేని స్థితిలో ఉంది. దీని వల్ల వర్షం వస్తే పైకప్పు ధారావాహికంగా నీరు గదుల్లోకి ప్రవహిస్తుంది. భక్తులు తలదాచుకోలేని పరిస్థితి తయారైంది. గదుల్లో ఫ్లోర్‌లలో గచ్చులు లేసి గుచ్చుకునేలా మారింది. కొన్ని చోట్ల పెచ్చులు ఊడిపడే విధంగా ఆందోళనకరంగా మారింది. మరీ ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వస్తోంది. రంగమారి రంగులు వేయలేక వెలవెలబోతున్నది. ఎంతో చరిత్ర, ఘనత ఉన్న భవనాలు హాథీరాం బావాజీ మార్గదర్శనంలో కాటేజీలు బాగుచేసి యాత్రికులకు చక్కటి సేవలు అందించాలని భక్తులు కోరుతున్నారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు) ఏప్రిల్ 25ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ,పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఇన్‌చార్జ్ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్,సిబ్బంది పులగల నరసింహా, వెంకటసుబ్బయ్య, పెంచల స్వామి, కోండల రావు,హరీష్, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు. ఈ నెల 27 నుండి జరగనున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబందించిన ఏర్పాట్లను ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్, రాపూరు సిఐ సత్యనారాయణ, ఎస్ఐ వెంకట రాజేష్, యంపీడీఓ మారెళ్ళ భవానిలతో కలసి ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, ఫెస్టివల్ కమిటీ భాద్యులు చెన్ను తిరిపాల్ రెడ్డి,పీర్ల సోమయ్య తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా క్యూలైన్ల ఏర్పాటు, సీసీ కెమెరాలు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు.

## రాష్ట్రంలో పట్టణాల్లో 106 చెరువులకు జలధార పరిధిలో మహర్దశ

**విజయవాడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** దుర్భర స్దితిలో ఉన్న వివిధ పట్టణాల్లోని 106 చెరువులకు మహర్దశ పట్టనున్నది. అమృత్ 2.0 తో రూ.300 కోట్లతో చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పనులను నాలుగు నెలల్లో పూర్తి చేయనున్నారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జలధార-జలహారతి కార్యక్రమానికి వీటిని అనుసంధానించనున్నారు. పట్టణాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగు పరిచేందుకు అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తోంది. . అమృత్ పథకంలో ఈ ఏడాది చెరువుల మరమ్మతు పనులను పురపాలక ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించారు. చెరువుల్లో పూడికలు, పిచ్చిమొక్కల తొలగింపు, చెరువుగట్లను పటిష్ఠం చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. అవకాశం ఉన్న చోట్ల చెరువు గట్లను కాలిబాటలుగా అభివృద్ధి చేయనున్నారు. చెరువుల చుట్టూ మొక్కలు పెంచి పార్కులుగానూ తీర్చిదిద్దనున్నారు. చెరువులో మురుగు నీటిని శుద్ధి చేసేందుకు అన్ని చోట్లా నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో చెరువు పని కోసం రూ.280 కోట్లకుపైగా ఖర్చు చేస్తారు. పట్టణాల్లో 2500 కిలోమీటర్ల పొడవునా పచ్చదనం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. 123 నగరాలు, పట్టణాల్లో రోడ్లకు ఇరువైపులా 10 లక్షల వేప, తురాయి, రావి, వంటి మొక్కలు నాటనున్నారు. నగరాలు పట్టణాల్లో కొత్తగా 204 ఉద్యానాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్వచ్ఛాంధ్ర సంస్థ ఆద్వర్యంలో 100, పుర, నగరపాలక సంస్థల తరపున 184 ఉద్యానాలను అభివృద్ధి చేయనున్నారు. డంపింగ్ యార్డులను పార్కులుగా అభివృద్ధి చేయాలన్న సీఎం ఆదేశాలతో మరో 20 ఉద్యానాలు ఏర్పాటు చేస్తారు

## మద్యం అక్రమ రవాణా, అవకతవకలు కేసులో మాజీ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు ఇంట్లో సిట్ సోదాలు

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాత వార్తప్రతినిధి:** మద్యం అక్రమ రవాణా, అవకతవకలు కేసుకు సంబంధించి హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ లోని మాజీమంత్రి కారుమూరు నాగేశ్వరరావు ఇంట్లో ఏపీ సిట్ సోదాలను నిర్వహిస్తోంది. కారుమూరు నాగేశ్వరరావు వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు. ఈ నెల 30న హాజరుకావాలని కారుమూరు కుమారుడు సునీల్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. మిథున్‌రెడ్డికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థలోనూ ఏపీ సిట్ సోదాలను నిర్వహిస్తుంది.

**బిజినెస్ రిఫార్మర్ అవార్డు సాధించిన చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు**

విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి: బిజినెస్ రిఫార్మర్ అవార్డు సాధించిన చంద్రబాబుకు మంత్రులు శుభాకాంక్షలను తెలియజేశారు. చంద్రబాబుకు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. సంస్కరణల అమలు లక్ష్యంతో ఏపీ వేగంగా దూసుకెళ్తోందని లోకేశ్ అన్నారు. అంతేకాకుండా చంద్రబాబుకు మంత్రులు అచ్చెన్న, సంధ్యారాణి, అనిత, సుభాష్, నిమ్మల, కొల్లు, అనగాని, గొట్టిపాటి, డోలా, జనార్దన్‌రెడ్డి, ఆనం, నారాయణ, పయ్యావుల, భరత్, సవిత, మండిపల్లి మొదలైన వారు శుభాకాంక్షలను తెలిపారు. అదే విధంగా చంద్రబాబుకు దక్కిన అవార్డు యావత్ తెలుగుజాతికి గర్వకారణమని మంత్రులు అభిప్రాయపడ్డారు.

## రైల్వే భద్రత అధికారుల సరిహద్దు సమన్వయ సమావేశం

**గుంతకల్ రైల్వే ఏప్రిల్ 25 ప్రభాత వార్త**

గుంతకల్ రైల్వే డివిజన్ విఐపి లౌంజ్‌లో సరిహద్దుసమన్వయ సమావేశం నిర్వహించారు. డిఎస్ఆర్‌పి /గుంతకల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక రాష్ట్రాల ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీస్ అండ్ ఎక్సైజ్ ఆపరేటింగ్ ,కమర్షియల్ విభాగాల అధికారులతో సరిహద్దు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ప్రధానంగా అంశాలపై చర్చ నిర్వహించారు. ముఖ్యంగా రైలులో నేరాల సమన్వయం మరణ కేసుల దర్యాప్తులో సమన్వయం వర్కింగ్ కోచ్ టీటీడీలతో సమన్వయం మరిన్ని ఎన్నో అంశాలపై చర్చించారు.

## రాష్ట్రంలో అర్ధరాత్రి దాటే వరకు బార్‌లు - ఎక్సైజ్ పోలీసులకు ఊరట

**విజయవాడ,ఏప్రిల్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఎక్సైజ్ పోలీసులకు ఊరట దక్కింది.. బార్‌ల ఫోటోలు తీసి అప్‌లోడ్ చేసే నిబంధనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఎక్సైజ్ పోలీసులు ప్రతి రోజూ అర్ధరాత్రి 12 గంటల తర్వాత బార్‌లు మూసేశారని నిర్ధారించాల్సి ఉంది. ఎక్సైజ్ కానిస్టేబుళ్లు బార్లు మూసివేసినట్లు ఫోటోలను తీసి ఎక్సైజ్ ఐ యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. అయితే ఇకపై ఆ నిబంధనను సడలించినట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది. ఇకపై ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సీసీ కెమెరాల వీడియోలు కానీ, బార్‌లో పనిచేసేవారికి వీడియో కాల్ చేసి కానీ నిబంధనలకు అనుగుణంగా బార్ మూసివేసినట్లు నిర్ధారించుకోవచ్చని తెలిపింది. రాష్ట్రంలోని మద్యం షాపులు, బార్‌లు ప్రతి రోజూ ఓపెన్ చేసే ముందు, రాత్రి మూసివేసే వరకు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు వీటి ఫోటోలను తీసి ఎక్సైజ్ ఐ యాప్‌లో అప్‌లోడ్ చేయాలనే నిబంధన ఉంది. అయితే అర్ధరాత్రి 12 గంటలకు బార్లు మూసివేస్తారు కాబట్టి ఆ సమయంలో వెళ్లి ఫోటోలు తీయడం కానిస్టేబుళ్లకు ఇబ్బందిగా మారింది. శుక్రవారం రోజు విశాఖపట్నం జిల్లాలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సింహాచలం నాయుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. సింహాచలం నాయుడు బార్లు మూసివేసే సమయంలో వెళ్లి ఫోటోలు తీసి అప్‌లోడ్ చేసి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ క్రమంలో ఉద్యోగ సంఘాల వినతి మేరకు బార్‌లు మూసేసే సమయంలో నేరుగా వెళ్లి ఫోటోలు తీయాల్సిన అవసరం లేదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అలాగే సింహాచలం నాయుడు కుటుంబానికి అండగా ఉంటామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సింహాచలం నాయుడు కుటుంబానికి ఎక్సైజ్ శాఖ నుంచి రూ.10 లక్షలు వెంటనే అందించాలని మంత్రి ఆదేశించారు. అలాగే ఎస్‌బీఐ బీమా పథకం ద్వారా రూ1.10 కోట్లు ఆర్థిక సాయం వచ్చేలా చూస్తామన్నారు. హెడ్ కానిస్టేబుల్ కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం (కారుణ్య నియామకం) ఇస్తామని ప్రకటించారు.

## టోల్ ప్లాజా సిబ్బందిపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే వర్గీయులు దాడి సోషల్ మీడియాలో సీసీ పుటేజ్‌లు వైరల్

**అనంతపురం, ఏప్రిల్ 25, (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం జిల్లా కళ్యాణ్ దుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు వర్గీయులు శనివారం టోల్ ప్లాజా సిబ్బందిపై దాడి విషయం వివాదంగా మారింది. ఎమ్మెల్యే వర్గీయులు అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం గండ బోయినపల్లి టోల్ ప్లాజా సిబ్బందిపై దాడి చేసినట్లు కొన్ని సీసీ పుటేజ్ లు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టాయి. టోల్ ప్లాజా మేనేజర్ రవి, అక్కడ పనిచేసే శ్రీలతపై దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీసీ ఫుటేజ్ లో కూడా టోల్ ప్లాజా సిబ్బందిపై దాడి చేస్తున్నట్లు కనిపిస్తోంది.. అయితే టోల్ ప్లాజా మేనేజర్ రవి మాత్రం తమపై ఎవరు మ్యాన్ హ్యాండ్లింగ్ చేయలేదని, ఎమ్మెల్యే వెహికల్ కూడా పంపరా అంటూ గొడవ పడినారని చెబుతున్నారు. పోలీసులు కూడా తమను పిలిస్తే సంఘటన వివరాలు వివరించినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే మద్దతుదారులు టోల్ ప్లాజా సిబ్బందిపై దాడి ఎందుకు చేశారు ? దానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.. ఎమ్మెల్యే సురేంద్రబాబు తన మద్దతు దారులతో కలిసి తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. నాలుగైదు కార్లలో ఎమ్మెల్యే తన మద్దతు దారులతో కలిసి తిరుమల వెళ్లి వచ్చే సమయంలో ఈ సంఘటనని జరిగినట్లు తెలియ వచ్చింది.. ఎమ్మెల్యే కారుకు ముందుగా రెండు మూడు కార్లు ఉన్నాయని, ముందరున్న కార్లకు టోల్ ప్లాజా వద్ద బిల్ ఇచ్చేందుకు కొంత లేట్ అయిందని దీంతో వివాదం జరిగిందని టోల్ ప్లాజా సిబ్బంది చెబుతున్నారు. ఎమ్మెల్యే కారులో ఉన్నాడు త్వరగా వెళ్లాలి అని టోల్ ప్లాజా సిబ్బందికి చెప్పినా ఎమ్మెల్యే ఉంటే ఏమి కొద్దిగా ఆగండి అంటూ టోల్ ఫ్రీ సిబ్బంది నిర్లక్ష్యంగా మాట్లాడాలని, అందుకు వాదులాడాల్సి వచ్చిందని ఎమ్మెల్యే మద్దతుదారులు చెప్తున్నారు.. ఇదే సమయంలో టోల్ ప్లాజా మహిళా సిబ్బందిపై, ఇతర టోల్ ప్లాజా ఇతర సిబ్బందిపై ఎమ్మెల్యే మద్దతు దారుల దాడి వివాదంగా మారింది. సీసీ ఫుటేజ్‌లు లీక్ కావడం , అవి సోషల్ మీడియాలో వైరల్ కావడం విమర్శలకు తావిస్తోంది..



## 27న అన్నవరం స్వామికి పట్టువస్త్రాల సమర్పణ

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఈ నెల 27వ తేదీ (సోమవారం), వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ ఉత్సవానికి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి అమ్మవార్ల తరపున చైర్మన్ / ఈవో మరియు అధికారులు/ధర్మకర్త మండలి సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

- మే 2న హుండీల లెక్కింపు:

దుర్గమ్మవారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు మే 2వ తేదీన (శనివారం) మహామండపం 6వ అంతస్తులో నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

- దుర్గమ్మవారి సేవలో అడవి శేషు:

దుర్గమ్మవారిని సినీ హీరో అడవి శేషు శనివారం దర్శించుకున్నారు.

- నిత్యాన్నదాన పథకానికి విరాళం:

దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రు. పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, దిగమర్రు గ్రామానికి చెందిన శ్రీ అన్నం వంశీకృష్ణ మరియు శ్రీమతి కిన్నెర దంపతులు శనివారం విరాళం అందించారు.

- వేద పరిరక్షణ ట్రస్ట్‌కు మరియు ఉచిత మజ్జిగ పంపిణీకి విరాళం:

దుర్గమ్మవారి ఆలయం నిర్వహిస్తున్న వేదపరిరక్షణ ట్రస్టుకు రూ. 1,16,,000లు, వేసవిలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కోసం రూ. 23,000/ విరాళాన్ని నవీ ముంబై నివాసితులు జి. హరికృష్ణ రెడ్డి మరియు ఆశా కృష్ణ దంపతులు ఆలయ అధికారులకు అందజేశారు.

- అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న "ధర్మపథం" సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌కు చెందిన కళాకారిణి పి. శ్రీలత బృందం ఈ ప్రదర్శన చేశారు. ఈ క్రింది అంశాలను ప్రారంభం చేసారు.

కూచిపూడి మరియు భరత నాట్య ప్రదర్శనలు: కళాకారులు తమ అద్భుత అభినయంతో భక్తులను అలరించారు.


- ఇంద్రకీలాద్రి అభివృద్ధి పనులు పరిశీలించిన అధికార బృందం25 ఏప్రిల్ 2026శ్రీ దుర్గామల్లేశ్వరులు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధిపనులను శనివారం సాయంత్రం అధికార బృందం పరిశీలించింది.మొదట దేవస్థానం న్ని గారి కార్యాలయంలో ఎస్ఐఆర్ఎం బెంగుళూరు బృందం, ఎస్‌పిఏ,

విజయవాడ అధికారులు,దేవస్థానం ఈవో శీనా నాయక్,శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలు ప్రధాన సలహాదారు, ఇంజనీరింగ్ నిపుణులు శ్రీ కొండలరావు, దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీ శేఖర్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ శ్రీ కోటేశ్వరరావు, శ్రీమతి రమాదేవి వార్ల సమావేశం అయి పలు విషయాలు పై సమగ్రంగా చర్చించారు.అనంతరం ప్రసాదం పోటు, అన్న ప్రసాద భవనం తదితర నిర్మాణాలు పూర్తి కావడం గురించి చర్చించారు. ఘాట్ రోడ్ పరిశీలన చేశారు.

## ఆర్టీసీ చరిత్రలో పిఆర్‌సి 11 శాతం ప్రకటించడం మైలురాయి

### రాష్ట్రవ్యాప్తంగా కార్మికులతో కలిసి కాంగ్రెస్‌శ్రేణుల సంబురాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** ఆర్టీసీ చరిత్రలో పిఆర్‌సి 11శాతం ప్రకటించడం ఒక మైలురాయిగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభివర్ణించారు. ఆర్టిసి కార్మికులతో కలిసి కాంగ్రెస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా శనివారం సంబరాలు జరుపుకొన్నాయి. రవాణా శాఖ మంత్రి పొన్నం జూమ్ మీటింగ్ ఆదేశాలను అనుసరించి అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, అధికార ప్రతినిధులత ఆర్‌టిసి జెఎసితో జరిగిన వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులతో జరిగిన చర్చలు సఫలమవడంతో తెలంగాణ వ్యాప్తంగా



ఆర్టిసి ఉద్యోగులు, కాంగ్రెస్ శ్రేణులు ఉమ్మడిగా బస్టాండ్ల వద్ద, డిపోల వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, కూడలిలలో మిఠాయిలు పంచి బాణసంచాను పేల్చిసంబరాలు జరుపుకొన్నారు. గాంధీభవన్‌లో హైదరారాబాద్ సెంట్రల్ ఖైరతబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్మికుల జీవితాల్లో వెలుగునింపిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు, ఎంపిలు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సి లు, కార్పొరేషన్ చైర్మన్ లు, అధికార ప్రతినిధులు ఆర్టీసి కార్మికులతో కలిసి పండుగ సంబరాలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులను ఆదేశించారు. రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి కార్మికుల చిరకాల స్వప్నం ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని హామి ఇచ్చామని తెలిపారు. కార్మికులతో మనకు శతృత్వం లేదు, వారు మన కుటుంబ సభ్యులని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామి ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ ఉద్యోగులకు 2013 బాండ్స్, 2017 పీఆర్సీ, డీఏలు ప్రకటన జరిగిందని తెలుపాలని కోరారు.

# ఆర్థిక స్థిరత్వంలో ఆర్టీసీ

### భారీగా నియామకాలు చేపట్టాం

### అభివృద్ధి దిశగా పయనిస్తున్నాం: టిజిఎస్‌ఆర్టీసీ

**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** ప్రస్తుత ప్రజా ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్‌ఆర్‌టీసీ)లో సమగ్ర అభివృద్ధి, ఆర్థిక పునరుద్ధరణ జరుగుతోందని ఆర్‌టీసీ సంస్థ తెలిపింది. ఉద్యోగవకాశాల పెరుగుదల, సేవల విస్తరణ, సేవల విస్తరణ స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొంది. గతంతో పోలిస్తే ప్రస్తుత కాలం అభివృద్ధి దిశగా గణనీయమైన మలుపు తీసుకుందని వెల్లడించింది. 2014 నుంచి 2023 వరకు ఉన్న పరిస్థితిని.. 2023 డిసెంబర్ నుంచి 2026 ఏప్రిల్ వరకు ఉన్న పరిస్థితిని వివరిస్తూ ప్రకటనను ఆర్‌టీసీ సంస్థ విడుదల చేసింది. 2014 నుంచి 2023 వరకు సీసీఎస్ బకాయిలు(వడ్డీతో కలిపి) రూ.1096.90 కోట్లు(నవంబర్ 2023 నాటికి), పిఎఫ్ బకాయిలు రూ.2108.15 కోట్లు, ఎస్‌ఆర్‌బిఎస్ అండ్ ఎస్‌బిటీ బకాయిలు రూ.513.00 కోట్లు ఉండగా బ్యాంకు రుణాలు రూ.1480 కోట్ల నుంచి (జూన్ 2014 నాటికి) పెరుగుతూ 2023 నవంబర్ నాటికి రూ.2215 కోట్లకు చేరిందని తెలిపింది. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత 2023 నుంచి 2026 వరకు బకాయిలను తగ్గిస్తూ వస్తోందని తెలిపింది. సీసీఎస్ బకాయిలను గణనీయంగా తగ్గంచి రూ.862 కోట్లకు చేర్చిందని తెలిపింది. పిఎఫ్ బకాయిలను తగ్గించి రూ.1714.39 కోట్లకు నియంత్రణ చేసిందని తెలిపింది. ఎస్‌ఆర్‌బీఎస్ అండ్ ఎస్‌బిటి బకాయిలను తగ్గంచి రూ.493.02 కోట్లకు పరిమితం చేసిందని ప్రకటించింది. బ్యాంకు రుణాలను 2026 మార్చి నాటికి రూ.2685.02 కోట్లకు తగ్గించిందని పేర్కొంది. ఆర్థిక నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యల ద్వారా స్థిరత్వం సాధించినట్టు ఆర్‌టీసీ తెలిపింది. 2014 నుంచి 2023 వరకు కేవలం 12 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే నియామకం జరిగినట్టు ప్రకటించింది. 2023 నుంచి 2026 మారినచ వరకు 4538 పోస్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అందులో మెడికల్ ఆఫీసర్లు ఇప్పటికే నియమించద్దారని, ట్రాఫిక్ మెకానికల్ సూపర్‌వైజర్ల రాత పరీక్షలు పూర్తయ్యాయని, ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతోందని తెలిపింది. శ్రామికుల నియామక ప్రక్రియ కూడా వెరిఫికేషన్ దశలో ఉన్నట్టు తెలిపింది. డ్రైవరు, కండక్టర్ నియామక ప్రక్రియ వేగవంతం చేయనున్నట్టు తెలిపింది. 2014 నుంచి 2023 వరకు 2556 బస్సులను రూ.700.51 కోట్లతో కొనుగులు చేసినట్టు తెలిపింది. నవంబర్ 2023 నాటికి ఆర్‌టీసీలో 9,074 బస్సులు ఉన్నాయని ప్రకటించింది. 2023 నుంచి 2026 వరకు 2815 బస్సులను కొనుగోలు చేయడానికి రూ.1078.04 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపింది. 2026 మార్చి నాటికి రాష్ట్రంలో 10,100 బస్సులు ఉన్నాయని ఆర్‌టీసీ తెలిపింది. 2014 నుంచి 2023 వరకు తొలగించబడిన ఒక్క ఉద్యోగిని పునర్నియామకం చేయలేదని.. కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలగించబడిన 244 మందిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నట్టు ఆర్‌టీసీ సంస్థ పేర్కొంది.

## అటల్ పెన్షన్ యోజనలో 9 కోట్ల మంది చేరిక

### చరిత్రాత్మక మైలురాయిని సాధించిన పథకం

**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక సామాజిక భద్రతా పథకమైన అటల్ పెన్షన్ యోజనకు భారీ స్థాయిలో దరఖాస్తులు వస్తున్నాయి. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీచే నిర్వహించబడుతున్న ఈ అటల్ పెన్షన్ యోజన-2026 పథకంలో ఇప్పటి వరకూ 9 కోట్ల మంది చందాదారులుగా చేరారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారవర్గాల సమాచారం ప్రకారం ఈ చందాదారులతో మొత్తం స్థూల నమోదులను అధిగమించి పెన్షన్ యోజన పథకం ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించింది. ఈ పథకం యొక్క పెరుగుతున్న విస్తరణ, ప్రభావానికి మరో నిదర్శనంగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం నమోదులు 1.35 కోట్ల చందాదారులను దాటాయి. ఇది పథకం ప్రారంభమైనప్పటి నుండి ఒకే ఆర్థిక సంవత్సరంలో నమోదైన అత్యధిక నమోదులను సూచిస్తుంది. దేశంలోని పౌరులందరికీ సార్వత్రిక సామాజిక భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలనే దార్శనికతతో 2015 మే 9న ప్రారంభించబడిన అటల్ పెన్షన్ యోజన పథకం ప్రధానంగా పేదలు, అణగారిన వర్గాలు, అసంఘటిత రంగ కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా అమలు చేస్తున్న వాటా ఆధారిత పింఛను పథకం. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు, ప్రత్యేక ఆర్థిక బ్యాంకులు, సహకార బ్యాంకులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థలు, స్థానిక ప్రభుత్వ అనుబంధ సంస్థలు, స్థానిక అభివృద్ధి సంస్థలు, తపాలా శాఖ యొక్క నిరంతర కృషి, కేంద్ర ప్రభుత్వం నుండి లభించిన నిరంతర మద్దతుతో ఈ పథకం గణనీయమైన వృద్ధిని సాధించిందని అధికారులు తెలిపారు. విస్తృతమైన ప్రచార కార్యక్రమాలు, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, బహుభాషా అవగాహన సామగ్రి, మీడియా ప్రచారాలు మరియు క్రమమైన పనితీరు సమీక్షల ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలు మరియు జిల్లాలకు ఈ పథకం పరిధిని విస్తరించడంలో చురుకైన పాత్ర పోషించింది. ప్రధానంగా ఈ పథక మూడు రకాల ప్రయోజనాలను అందించడం ద్వారా సంపూర్ణ సురక్షా కవచ్ (పూర్తి భద్రతా కవచం) కల్పించడానికి రూపొందించబడింది. చందాదారులు 60 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత వారికి నెలకు రూ. వెయ్యి నుండి రూ.5 వేల వరకు హామీతో కూడిన పింఛను చెల్లించనుంది. అలాగే చందాదారు మరణానంతరం అదే పింఛను జీవిత భాగస్వామికి కొనసాగిస్తుంది. ఇక ఈ ఇద్దరూ మరణించిన తర్వాత 60 సంవత్సరాల వయస్సు వరకు పోగుపడిన మూలధనాన్ని నామినీకి తిరిగి చెల్లించడం విశేషం. ఆదాయపు పన్ను చెల్లించే వారు మినహా, 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల భారత పౌరులందరికీ ఈ పథకం అందుబాటులో ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## మోడీ ప్రభుత్వంలో మారని పేదల స్థితిగతులు

### అంబానీ, అదానీ ఆస్తులు పెరిగాయి

### కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ ఇర్ఫాన్ అలీ ప్రమాణస్వీకారంలో మహేశ్‌కుమార్


**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మోడీ ప్రభుత్వంలో పేదవాడు పేదవాడిగానే ఉన్నారనీ, అంబానీ, అదానీ ఆస్తులు అమాంతం పెరిగిపోయానీ టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. టిపిసిసి మైనారిటీ విభాగం చైర్మన్‌గా కొత్తగా నియామకమైన మహమ్మద్ ఇర్ఫాన్ అలీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గాంధీ భవన్, ప్రకాశం హాల్‌లో శనివారం జరిగింది. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ , మైనారిటీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జ్ షకీల్ నవాజ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన నున్నారు. టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మైనారిటీ ల నుంచి ఎమ్మెల్యే గా గెలవకపోవడం శోచనీయమనీ ఆవేదన చెందారు 2028 లో మెజార్టీ మైనారిటీ మెంబెర్స్ కి టికెట్స్ ఇస్తామని తెలిపారు

రూరల్ ఏరియా నుంచి మైనారిటీ చైర్మెన్ తీసుకురావాలని అనుకున్నామనీ చెప్పారు. మైనారిటీ విభాగాన్ని సంస్థాగతంగా బలోపేతం చేయాలనీ ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మక మైన పార్టీ అని సిక్కు, కిసాన్ ,క్రిస్టియన్ మైనారిటీ ,ముస్లిం మైనార్టీ.. భారత ప్రధాని మోడీ అనేక అమలు ఇచ్చారనీ అధికారంలోకి వచ్చాక వాటిని ఏవి అమలు చేయలేదని విమర్శించారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ దేశాన్ని సమూలంగా చదివారనీ తెలిపారు. తెలంగాణలో ప్రజా స్వామ్యబద్ధంగా మహిళా సెంట్రిక్ గా ప్రజాపాలన జరుగుతోందని చెప్పారు. ఎనిమిది మంది మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్లు నియమించామని,విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెడుతామని తెలిపారు.

మహ్మద్ ఇర్ఫాన్ అలీ జిల్లాల్లో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేసి మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయాలని హితవు చెప్పారు. బిఆర్ఎస్ హయంలో అనేక మంది ఆర్టీసీ కార్మికులను పొట్టన పెట్టుకున్న పాపం కెసిఆర్‌దే అని అన్నారు.. ఆర్టీసీ కార్మికుల గురించి మాట్లాడటానికి ఏం అర్హత ఉందనీ ప్రశ్నించారు. కార్మికుల తో సామరస్య పూర్వంకంగా చర్చలు జరిపి పరిష్కరించడం ప్రజాస్వామ్య పాలన లక్షణమనీ అన్నారు.

## ఉక్రెయిన్‌పై రష్యా ముప్పేట దాడి

**క్యీవ్ ఏప్రిల్ 25:** రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం మరోసారి అత్యంత భీకరంగా మారింది. 24, 25 తేదీల్లో రష్యా జరిపిన భారీ వైమానిక దాడి ఉక్రెయిన్‌ను అతలాకుతలం చేసింది. నిజానికి ఈ దాడి రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఊహించని మలుపు తిప్పింది. గడిచిన 24 గంటల్లో ఉక్రెయిన్‌లోని కీలక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా రష్యా మునుపెన్నడూ లేని విధంగా అతిపెద్ద వైమానిక దాడికి పాల్పడింది. ఏకంగా 666 క్షిపణులు, డ్రోన్లతో ఉక్రెయిన్ గగనతలాన్ని రష్యా గడగడలాడించింది. ఉక్రెయిన్ వాయుసేన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 6 గంటల నుంచి రష్యా ఈ విధ్వంసాన్ని ప్రారంభించింది. ఈ దాడిలో రష్యా మొత్తం 47 మిసైళ్లను ప్రయోగించింది. ఇందులో 12 బాలిస్టిక్ క్షిపణులు క్రూయిజ్ మిసైళ్లు, 5 కాలిబర్ మిసైళ్లు ఉన్నాయి. డ్రోన్ల విషయానికి వస్తే ఏకంగా 619 డ్రోన్లను రష్యా ఉక్రెయిన్ వైపు పంపింది. వీటిలో ఎక్కువ భాగం ఇరాన్ తయారీ షహీద్ రకానికి చెందిన కామికాజ్ డ్రోన్లే కావడం గమనార్హం. ఇవి నేరుగా లక్ష్యాన్ని ఢీకొని పేలిపోతాయి. ఇంతటి భారీ దాడిని ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సమర్థంగా ఎదుర్కొంది. కీవ్ వాయుసేన దాదాపు 610 లక్ష్యాలను గాలిలోనే కూల్చివేసింది. ఇందులో 30 మిసైళ్లు, 580 డ్రోన్లు ఉన్నాయి. ముఖ్యంగా 26 సి101 మిసైళ్లను, 4 కాలిబర్ మిసైళ్లను పేల్చివేయడం ద్వారా పెను ప్రమాదాన్ని తప్పించామని ఉక్రెయిన్ ప్రకటించింది. అయితే ఉక్రెయిన్ తన రక్షణ వ్యవస్థతో రష్యా దాడులను అడ్డుకున్నప్పటికీ, కొన్ని మిసైళ్లు లక్ష్యాలను తాకాయి. సుమారు 13 మిసైళ్లు, 36 డ్రోన్లు ఉక్రెయిన్ గడ్డపై పడ్డాయి. దీనివల్ల దేశవ్యాప్తంగా 23 ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. మరో 9 చోట్ల కూల్చివేసిన డ్రోన్ల శిథిలాలు పడి ఆస్తులు ధ్వంసమ య్యాయి. ఈసారి రష్యా తన వ్యూహాన్ని మార్చి భూమి, సముద్రం, గగనతలం నుంచి ముప్పేట దాడులు చేసింది. రష్యాలోని మిల్లెరోవో, కుర్స్క్, బ్రయాన్స్క్ ప్రాంతాల నుంచి భూమి ద్వారా, కాస్పియన్ సముద్రం, క్రిమియా నుంచి సముద్రం ద్వారా క్షిపణులను ప్రయోగం చింది. రష్యా అనుసరిస్తున్న ఈమల్టీ డైమెన్షనల్ అటాక్ వ్యూహం ఇప్పుడు ఉక్రెయిన్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.



## గ్యాస్ పైపులైన్ లీకేజీ

**గీసుకొండ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కీర్తినగర్(కట్ట మల్లన్న)కాలనీ వద్ద శుక్రవారం రాత్రి గ్యాస్ పైప్ లైన్ లీకేజ్ ఏర్పడటంతో మంటలు చెలరేగాయి. వరంగల్ నగరానికి గ్యాస్ సరఫరా చేయడం కోసం మెగా కంపెనీ కొద్ది రోజుల క్రితం పైపు లైన్ ఏర్పాటు చేసింది.కీర్తినగర్ కాలనీలో పైపు లైన్ లీకేజీ ఏర్పడ టంతో మంటలు ఎగసిపడ్డాయి.స్థానికులు వరంగల్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. అయిన మంటలు ఎగిసిపడుతుండడం తో జాన్ పాక్ వద్ద మెగా కంపెనీ నిర్వాహకులు గ్యాస్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం.

## పిఎం ఇ బస్ సేవా పథకంలో రాష్ట్రానికి 151 బస్సులు

### కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ మరో కీలక అడుగు

**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ పరిధిలోని కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్(సీఈఎస్ఎల్) మరో కీలక అడుగు వేసింది. పీఎం ఈబస్ సేవా పథకం కింద 3,604 ఎలక్ట్రిక్ బస్సుల కోసం శనివారం టెండర్ విడుదల చేసింది. వీటిని 17 రాష్ట్రాల్లోని 45 నగరాలకు పంపిణీ చేయనున్నారు. ఇందులో తెలంగాణలోని వరంగల్‌కు 100, నిజామాబాద్‌కు 51 బస్సులు రానుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి 300 బస్సులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్ వాహనాల వాడకాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని రక్షించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2023 ఆగస్టులో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పీఎం ఈబస్ సేవా పేరిట ఓ పథకాన్ని తీసుకొచ్చింది. 3 లక్షల నుండి 40 లక్షల జనాభా కలిగిన పట్టణాల్లో రవాణా అవసరాలను తీర్చడానికి పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ఈ సేవా పథకాన్ని ప్రారంభించింది.

## రెండేళ్లలో 50 శాతం ప్రభుత్వ సేవలన్నీ ఎఐతోనే!

### ఎమిరేట్స్ సర్కారు నిర్ణయం

**అబుదాబి, ఏప్రిల్ 25:** గల్ఫ్ దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇకపై 50 శాతం ప్రభుత్వ సేవలు, కార్యకలాపాలు ఏఐతోనే నడుస్తాయని ప్రకటించింది. ఏజెంటిక్ ఏఐ వినియోగాన్ని విస్తరించనున్నట్లు వెల్లడిం చింది. 2028 నాటికి ఈ మార్పులు తీసుకురానున్నట్లు యూఏఈ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తుమ్ వెల్లడిం చారు. ప్రపంచంలోనే ఈ స్థాయిలో కృత్రిమ మేధ ను వినియోగించే తొలి దేశంగా యూఏఈ నిలవ నుంది. ఇక్కడ ఏఐ ఓ సపోర్ట్ టూల్‌గా మాత్రమే కాకుండా ఒక ఎగ్జిక్యూటివ్ పార్ట్‌నర్‌గా మారనుందని యూఏఈ ప్రధాని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను మెరుగుపర్చడానికి, నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియను వేగవంతం చేయడానికి ఈ సాంకేతికతను ఉపయోగిస్తామని తెలిపారు. ఏజెంటిక్ ఏఐ అంటే ఇప్పటివరకూ ఉపయోగిస్తోన్న ఏఐ వ్యవస్థలు సాధారణంగా మనం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తాయి.

కానీ ఏజెంటిక్ ఏఐ అంతటితో ఆగదు. ఒక లక్ష్యం ఇస్తే దాన్ని సాధించడానికి అవసరమైన దశలను తానే నిర్ణయించుకుని, అవసరమైన చర్యలు తీసుకుని, పని పూర్తయ్యేవరకు ముందుకుసాగుతుంది. అంటే ఇది కేవలం సమాధానం చెప్పే ఏఐ కాదు. ఇప్పటివరకూ ఏఐ ఒక సాధనంలా పనిచేసింది. మనకు అవసరం ఉంటే ఉపయోగించుకునేలా ఉండేది. కానీ ఇప్పుడు ఏజెంటిక్ ఏఐ మనతో కలిసి పనిచేసే సహచరుడిలా మారుతున్నది. ఇది అవసరాన్ని అర్థం చేసుకుని, అనేక దశల్లో పనిచేసి, కొంతవరకు నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకుంటోంది. కాగా ఇది చిన్న మార్పు కాదని, సహాయక టెక్నాలజీ నుంచి సహకార టెక్నాలజీకి ప్రయాణమని టెక్ నిపుణులు చెబుతున్నారు.



రాహుల్ క్యాచ్ జారవిడిచిన శశాంక్

# క్యాచ్ జారిందో..
# మ్యాచ్ పాయే!

*క్యాచ్ డ్రాపయిందో.. మ్యాచ్ గోవిందా. క్రికెట్‌లో ఇది సరిచేయలేని పొరపాటుగా చాలాసార్లు రుజువైంది. ముఖ్యంగా టీ20ల్లో అయితే కాస్లీగా మారుతోంది. ఇక ఐపీఎల్‌లో చిన్న పొరపాటు కూడా మ్యాచ్ దిశను పూర్తిగా మార్చగలదు. ఆరంభంలోనే క్యాచ్ వదిలేస్తే, అందునా విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ లాంటి మేటి బ్యాట్స్‌మెన్ ఇచ్చిన లడ్డూ లాంటి క్యాచ్‌లు వదిస్తే ఫలితం ఎలా ఉంటుందో ఆర్సీబీ-గుజరాత్ టైటాన్స్, నిన్నటి ఢిల్లీ క్యాపిటల్స్-పంజాబ్ కింగ్స్ మ్యాచ్ రిజల్ట్ చూస్తే అర్థమవుతుంది.*

(వార్త క్రీడా విభాగం)

అరుణ్ జైట్లీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఇన్నింగ్స్ మూడో ఓవర్లో అర్షదీప్ సింగ్ వేసిన షార్ట్ డెలివరీని కేఎల్ రాహుల్ పుల్ షాట్ ఆడాడు. డీప్ స్క్వేర్ లెగ్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న శశాంక్ సింగ్ వైపు ఆ బంతి నేరుగా వెళ్ళింది. అత్యంత సులభమైన ఆ క్యాచ్‌ను పట్టుకోవడంలో శశాంక్ విఫలమయ్యాడు. క్యాచ్ వదలడమే కాకుండా ఆ బంతి కాస్తా బౌండరీకి వెళ్లడంతో పంజాబ్ జట్టుకు డబుల్ షాక్ తగిలింది. ఈ తప్పు చూసిన అర్షదీప్ తీవ్ర నిరాశకు గురవ్వగా, స్టాండ్స్‌లో ఉన్న ప్రీతి జింటా ముఖం కూడా వాడిపోయింది. డగౌట్‌లో కోచ్ రిక్కీ పాంటింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు.

శశాంక్ ఇచ్చిన లైఫ్ లైన్‌తో కేఎల్ రాహుల్ ఏకంగా 152 రన్స్ చేశాడు. గుజరాత్ బౌలర్లను చెడామడా బాదుతూ 67 బంతుల్లోనే ఈ స్కోరు చేశాడు. నితీష్ రాణాతో కలిసి 220 రన్స్ భాగస్వామ్యంతో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఏకంగా 264 రన్స్ సాధించిపెట్టాడు. గత లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లో కూడా శశాంక్ ఏకంగా మూడు క్యాచ్‌లు వదిలేశాడు.



కోహ్లీ క్యాచ్ డ్రాప్ చేసిన వాషింగ్టన్

గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లోనూ ఇలాగే జరిగింది. విరాట్ కోహ్లీ.. మహ్మద్ సిరాజ్ వేసిన తొలి ఓవర్లో ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను మిడాన్‌లో వాషింగ్టన్ సుందర్ వదిలేయడం మ్యాచ్ ఫలితాన్నే మార్చేసింది. అప్పటికి కోహ్లీ పరుగుల ఖాతా కూడా తెరవలేదు. క్యాచ్ పట్టి వుంటే కోహ్లీ గోల్డెన్ డకౌట్ అయ్యేవాడు. సుందర్ ఇచ్చిన లైఫ్ లైన్‌తో విరాట్ కోహ్లీ ఆ తర్వాత చెలరేగిపోయాడు. 44 బంతుల్లోనే 81 రన్స్ సాధించాడు. 206 పరుగుల లక్ష్య ఛేదనలో కోహ్లీకి దొరికిన ఈ లైఫ్.. ఆర్సీబీకి 5 వికెట్ల విజయాన్ని అందించింది. సాయి సుదర్శన్ సెంచరీ వృధా అయ్యింది. కోహ్లీ వంటి కీలక ఆటగాడి క్యాచ్ డ్రాప్ చేయడం వల్ల మ్యాచ్ ఓడిపోతారని సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. క్యాచ్ డ్రాప్ మ్యాచ్‌ను మలుపు తిప్పిందని శుభ్‌మన్ గిల్

# పరుగుల తుఫాన్‌లో పంజాబ్ రారాజు

**ఢిల్లీ:** 265 రన్స్ టార్గెట్... ఇక పంజాబ్ కింగ్స్‌కు తొలి ఓటమి ఖాయమని అంతా భావించారు. కానీ ఛేజింగ్‌లో 265 రన్స్‌ను ఉఫ్‌మనిపించింది. మొదట ప్రభ్ సిమ్రాన్‌సింగ్ (76; 26 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లు), ప్రియాంశ్ ఆర్య (43; 17 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) విధ్వసంకు శ్రేయాస్ అయ్యర్(36 బంతుల్లో 71నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ తోడవడంతో అసాధ్యం సుసాధ్యమైంది. ప్రత్యర్థి 265 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినా.. ఏ మాత్రం బెదరకుండా 7 బంతులు మిగిలుండగానే టార్గెట్‌ను పూర్తి చేసింది. ఐపీఎల్ చరిత్రలో ఇదే రికార్డు ఛేదన. ఆరు వికెట్ల తేడాతో గెలుపొందిన పంజాబ్ కింగ్స్.. ఈ సీజన్‌లో ఓటమి ఎరుగని జట్టుగా కొనసాగుతోంది.

పంజాబ్‌కు ప్రభ్‌సిమ్రాన్, ప్రియాంశ్ అదిరే ఆరంభం ఇచ్చాడు. ఎడాపడా సిక్స్‌లతో విరుచుకుపడడంతో పవర్‌ప్లేలో ఏకంగా 116 రన్స్ వచ్చాయి. ఇన్నింగ్స్ తొలి బంతికే ప్రియాంశ్ సిక్స్ బాదితే.. చివరి బంతికి ప్రభ్‌సిమ్రాన్ స్టాండ్స్‌లోకి ఆడాడు. తొలి ఓవర్లో 15, రెండో ఓవర్లో 21, మూడో ఓవర్లో 20, నాలుగో ఓవర్లో 27, అయిదో ఓవర్లో 9 రన్స్, ముకేషన వేసిన ఆరో ఓవర్లో పభ్ర్ సిమ్రాన్ ఆరు ఫోర్లు బాది 24రన్స్.. ఇలా పరుగుల వరద పారించారు. ఇక్కడే పంజాబ్ కింగ్స్ విజయానికి బాటలు పడ్డాయి. ఆ తర్వాత శ్రేయాస్ కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో 18.5 ఓవర్లలోనే4 వికెట్లు కోల్పోయి బిగ్ టార్గెట్ అందుకుంది.




**67 బంతుల్లో 152; 16 ఫోర్లు, 9 సిక్స్‌లు**
**29 బాల్స్ తొలి ఫిఫ్టీ, 18 బాల్స్ రెండో ఫిఫ్టీ**
**19 బంతుల్లో మూడో ఫిఫ్టీ**

ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్ విశ్వరూపం ప్రదర్శించాడు. పంజాబ్ బౌలర్లను రఫ్ఫాడించాడు. బౌండరీలు, సిక్స్‌ల వరం కురిపించాడు. అతడు బ్యాటింగ్ ధాటికి పంజాబ్ ఫీల్డర్లు కేవలం ప్రేక్షక పాత్ర మాత్రమే పోషించాల్సి వచ్చింది. రాహుల్‌ను ఔట్ చేయడం ఎవరి తరం కాలేదు. ఈ క్రమంలో రాహుల్ కేవలం 47 బంతుల్లోనే ఆరో ఐపీఎల్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఈఐపీఎల్ సీజన్‌లో రాహుల్‌కు తొలి సెంచరీ. ఓవరాల్‌గా కేవలం 67 బంతుల్లో 152 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ విధ్వంసకర సెంచరీతో రాహుల్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించాడు. ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన భారత క్రికెటర్‌గా రాహుల్ నిలిచాడు. ఈ క్రమంలో అభిషేక్(141)ను అధిగమించాడు. క్రిస్ గేల్(175 నాటౌట్), బ్రెండన్ మెకల్లమ్(158) ముందున్నారు. ఓపెనర్ నిశ్శంక 11 పరుగులకే ఔటైన దశలో క్రీజులోకి వచ్చిన నితీష్ రాణా(44 బంతుల్లో 91)తో కలిసి కేఎల్ రెండో వికెట్‌కు ఏకంగా 204 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. పవర్‌ప్లేలో 68 రన్స్ చేసిన ఈ జోడీ, ఆ తర్వాత కేవలం 9 ఓవర్లలోనే 189 పరుగులు పిండుకున్నారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 2వికెట్లకు 264రన్స్ చేసింది. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇదే అత్యధిక స్కోరు.

## ఐపీఎల్‌లో నేటి మ్యాచ్‌లు

| చెన్నై చిదంబరం స్టేడియం | | లక్నో ఏకనా స్టేడియం | |
|---|---|---|---|
| చెన్నై సూపర్ కింగ్స్ V/S గుజరాత్ టైటాన్స్ | మధ్యాహ్నం 3.30 గం.లకు | లక్నో సూపర్ జెయింట్స్ V/S కోల్‌కతా నైట్‌రైడర్స్ | రాత్రి 7.30 గం.లకు |



# వైభవ్ సెంచరీ మోత

**జైపూర్:** సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జైపూర్ వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 103 రన్స్; 5 ఫోర్లు, 12 సిక్స్‌లు) విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. మరోసారి విశ్వరూపాన్ని చూపుతే ఎస్ఆర్‌హెచ్ బౌలర్లను ఉతికారేశాడు. హింజ్ వేసిన తొలి ఓవర్లోనే సిక్స్‌ల మోత మోగించాడు. డీప్ మిడ్‌వికెట్ మీదుగా సిక్స్ బాది పరుగుల ఖాతా తెరిచిన వైభవ్.. ఆ తర్వాత మూడు బంతుల్ని కూడా స్టాండ్స్‌లోకి పంపాడు. ప్యాట్ కమిన్స్‌కు సైతం చుక్కలు చూపించాడు. అతని తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. ఆ తర్వాత సకిబ్ బంతిని సిక్స్ బాది 15 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. వైభవ్ ఈ ఏడాది సీజన్‌లో హాఫ్ సెంచరీ కేవలం 15 బంతుల్లో పూర్తి చేయడం ఇది మూడోసారి.

ఆ తర్వాత కడా అదే జోరు కొనసాగిస్తూ ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. 14వ ఓవర్లో 6, 4, 6తో శతక్కొట్టాడు. 36 బంతుల్లో మెరుపు సెంచరీ సాధించాడు. సవాయి మాన్‌సింగ్ స్టేడియంలో సిక్సర్ల వర్షం కురిపించాడు. ఈ క్రమంలో వైభవ్ పలు అరుదైన రికార్డులు తన పేరిట లిఖించుకున్నాడు.

ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 50 సిక్సర్లు బాదిన ప్లేయర్‌గా వైభవ్ రికార్డు సృష్టించాడు. టీ20 ఫార్మాట్‌లో 1000 పరుగుల మైలురాయిని అందుకున్న అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఐపీఎల్‌లో అత్యధిక సార్లు 15 లేదా అంతకంటే తక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా వైభవ్ రికార్డులకెక్కాడు. అదేవిధంగా ఇది ఐపీఎల్‌లో మూడో ఫాస్టెస్ట్ సెంచరీ.

# ఆర్బీఎల్ డిపాజిట్లు 1.39 లక్షల కోట్లు

## నికరలాభం 234శాతం హైక్

**ముంబయి, ఏప్రిల్ 25:** ప్రైవేటు రంగంలోని ఆర్బీఎల్ బ్యాంకుశనివారం త్రైమాసిక ఫలితాలుప్రకటించింది. నాలుగో త్రైమాసికంలో బ్యాంకు నికర లాభం రూ.230 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. అదే గత ఏడాది ఇదే కాలంలో 69 కోట్లుమాత్రమే ఆర్జించిన బ్యాంకు ఈసారి 234శాతం లాభాలు పెంచుకోగలిగింది. బ్యాంకు నికరవడ్డీ ఆదాయం ఈ త్రైమాసికంలో ఏడు శాతం పెరిగి రూ.1671 కోట్లకు చేరింది.

నికరవడ్డీ మార్జిన్ కూడా 4.41 శాతంగా ఉంది. అదే గత ఏడాది నాలుగో త్రైమాసికంతో పోలిస్తే తగ్గింది. గత ఏడాది 4.89శాతంగా ఉంది. మూడో త్రైమాసికంలో అయితే 4.63శాతంగా నమోదయింది. బ్యాంకు కేటాయింపులు కూడా 14శాతం తగ్గాయి. రూ.639 కోట్లకు చేరినట్లు బ్యాంకు ఈడీ జైదీప్ ఐయ్యర్ తెలిపారు. ఇక బ్యాంకు డిపాజిట్లు 25శాతం పెరిగి రూ.1.39 లక్షలకోట్లుగా ఉంది. కరెంటుఖాతా, సేవింగ్స్ ఖాతా డిపాజిట్లు కూడా 23శాతం పెరిగి 46,723కోట్లుగా ఉంటే కాసా నిష్పతి 33.6 శాతంగా ఉంది. అడ్వాన్సులు కూడా 23శాతంపెరిగి రూ.1.14 లక్షల కోట్లుగా ఉన్నాయి. రిటైల్ అడ్వాన్సులు 20శాతంపెరిగి రూ.67,119 కోట్లు వరకూ ఉన్నాయి. హోల్‌సేల్ అడ్వాన్సులు 28శాతంపెరిగి రూ.47,112 కోట్లు కాగా రిటైల్ నుంచి హోల్‌సేల్ వరకూ మిశ్రమంగా 59.41శాతం ఉన్నట్లు తెలిపింది. ఇక బ్యాంకు నిరర్ధక ఆస్తులుపరంగా జిఎన్‌పిఎలు 1.45శాతంగా ఉంటే నికర నిరర్ధక ఆస్తులు 0.39శాతంగా ఉన్నాయి.




బ్యాంకు క్యాపిటల్ అడక్వసీ రేషియో 14.25శాతంగా ఉంది. బ్యాంకులో ఎమిరేట్స్ ఎన్బీడీ వాటా కొనుగోలుతో బ్యాంకు ఆర్థికపరిపుష్టిపెరిగింది. మూలధనం పెరగడంతో విలువలు, పరిమాణం పరంగా కూడా ఆస్తి అప్పులపట్టీ మరింత స్థిరంగా కొనసాగిందని ఎండిస ఇఇఒ ఆర్ సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు

# పేటీఎం లైసెన్సు రద్దు చేసిన ఆర్బీఐ

**ముంబయి, ఏప్రిల్ 25:** ఫిన్‌టెక్ సంస్థ పేటీఎంకు చెందిన పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను రిజర్వ్ బ్యాంక్ రద్దు చేసింది. కస్టమర్ల వివరాల సేకరణలో లోపాలు, నిబంధనల ఉల్లంఘనల కారణంగా రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఆంక్షల ప్రక్రియ చివరికి లైసెన్స్ రద్దుతో ముగిసింది. డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా బ్యాంక్ కార్యకలాపాలు సాగాయని ఆర్బీఐ ఈ నిర్ణయానికి గల కారణాలను స్పష్టం చేసింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్బీఐ ఆంక్షలు 2022లోనే మొదలయ్యాయి. తొలుత కొత్త కస్టమర్లను చేర్చుకోవడాన్ని నిషేధించింది. ఈ ఏడాది జనవరిలో ఆంక్షలను మరింత కఠినతరం చేస్తూ కొత్త డిపాజిట్లు, క్రెడిట్ లావాదేవీలు, వ్యాలెట్ టాప్‌అప్‌లను పూర్తిగా నిలిపివేసింది. బ్యాంకింగ్ కార్యకలాపాలు దాదాపుగా స్తంభించి పోయాయి. అప్పటి నుంచి కేవలం ఖాతాల్లో ఉన్న నగదును విత్‌డ్రా చేసుకునేందుకు మాత్రమే అనుమతి ఉంది. బ్యాంక్ యాజమాన్యం తీరు ప్రజా ప్రయోజనాలకు, డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకును కొనసాగించడానికి అనుమతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వన్97 కమ్యూనికేషన్స్, పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లో వరుసగా 51:49 వాటాలు ఉన్నాయి. 2015 ఆగస్టులో ఈ బ్యాంక్‌కు లైసెన్స్ లభించింది. నిబంధనల ప్రకారం ఈ బ్యాంక్ చిన్న మొత్తంలో డిపాజిట్లు స్వీకరించగలదు కానీ రుణాలు ఇవ్వలేదు. పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దు తమ వ్యాపారంపై ఎలాంటి ఆర్థిక ప్రభావం చూపదని పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ స్పష్టం చేసింది. ఆర్బీఐ ఆంక్షల తర్వాత పేటీఎం తన ప్రధాన చెల్లింపుల సేవలను బ్యాంకింగ్ విభాగం నుంచి వేరు చేసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుమతితో భాగస్వామ్య బ్యాంకుల ద్వారా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను కొనసాగించడానికి అనుమతి పొందింది. పేటీఎం తన యూపీఐ హ్యాండిల్‌ను యెస్ బ్యాంక్ నేతృత్వంలోని మల్టీబ్యాంక్ వ్యవస్థకు మార్చింది. కస్టమర్ల యూపీఐ చెల్లింపులు, క్యూఆర్ కోడ్ లావాదేవీలు, బిల్లు చెల్లింపులు వంటి రోజువారీ సేవలు యథావిధిగా కొనసాగుతాయి.






# రహేజా డెవలపర్లపై ఇడి దాడులు

## 13ప్రాంతాల్లో సమగ్ర తనిఖీలు

**ముంబయి, ఏప్రిల్ 25:** ఇళ్లకొనుగోలు దారులనుంచి వసూలుచేసిన సొమ్ముకు సంబంధించి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రహేజా డెవలపర్స్ రియల్ ఎస్టేట్ కంపెనీపై ఈడీ అధికారులు దాడులు సమగ్ర సోదాలునిర్వహించారు. మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తుచేపట్టింది. ఢిల్లీ, ఎన్సీఆర్ పరిధిలోని కంపెనీ కార్యాలయాలు బోర్డుసభ్యుల ఇళ్లు కార్యాలయాల్లో ఓదాలునిర్వహించింది. ఇళ్లకొనుగోలుదారులనుంచి సొమ్ములు తీసుకుని వారికి ఫ్లాట్లు కేటాయించలేదని రహేజా రేవంత నిర్మాణాలపై స్పష్టత లేదన్న ఆరోపణలు ఫిర్యాదులు రావడంతో ఢిల్లీ జోన్ ఈడీ తనిఖీలుప్రారంభించింది. మొత్తం ఏడు నివాసాల్లో ఈడీ తనిఖీలుజరిపింది. రహేజా డెవలపర్లు, డైరెక్టర్లు, అనుబంధ సంస్థలపైనా దాడులునిర్వహించారు. అయితే ఈ జాప్యానికి సంబంధించి రహేజా ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వపరమైన మౌలికవసరుల కొరతతో కొంతమేర జాప్యం జరిగిందని తెలిపింది. రేవంత ప్రాజెక్టులో ఎలాంటి అవినీతిలేదని కస్టమర్లనుంచి వచ్చిన వసూళ్లకంటే ఎక్కువే కంపెనీ పెట్టుబడులుపెట్టిందని రెరా పర్యవేక్షణతో కూడిన ఫోరెన్సిక్ ఆడికూడా నిర్వహించినట్లు తెలిపింది. 61 అంతస్తుల రేవంత ప్రాజెక్టులో మంచినీరు, విద్యుత్; సీవరేజి, ఫైర్‌ఫైటింగ్ వ్యవస్థలు పూర్తిస్థాయిలో కాలేదని అధికారులు ఇందుక సంబంధించి మౌలికవసరులు అందించాలని కోరింది. మౌలికవసరులు లేకుండా కస్టమర్లకు ఫ్లాట్లు అందించలేమని రహేజా వెల్లడించింది. అంతకుముందు కూడా ఈడీ ఢిల్లీలో 13 చోట్ల, ఎన్సీఆర్, మొహాలిల్లోను పలు ప్రాంతాల్లో తనిఖీలుచేసి పలు డాక్యుమెంట్లు, డిజిటల్ డివైజ్‌లు, రికార్డులు మొత్తం స్వాధీనంచేసుకుంది.

# ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంక్ లాభం 319 కోట్లు




**ముంబయి, ఏప్రిల్ 25:** ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు 4వ త్రైమాసికంలో నికరలాభాలు 4.9శాతంపెరిగి రూ.319 కోట్లకు చేరింది. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో రూ.304 కోట్లనుంచి గణనీయంగా పెంచుకోగలిగింది. దీనికి తోడు పన్నుల రీఫండ్‌రూపంలో బ్యాంకుకు రూ.130 కోట్లవరకూ అందాయి. పన్నుల చెల్లింపులు రూ.57 కోట్లుమాత్రమేనని బ్యాంకు తెలిపింది. నికరవడ్డీ ఆదాయం 15.7శాతంపెరిగి రూ.4907 కోట్లనుంచి రూ.5677 కోట్లకుచేరింది. రుణాలపంపిణీ, రికవరీల్లో స్థిరత్వం కనిపించింది. వాహన రుణాలు, వినియోగరంగ రుణాలు, బిజినెస్ బ్యాంకింగ్, హోల్‌సేల్ బ్యాంకింగ్ వంటివి ఎక్కువ ఉన్నాయి. స్థిరాస్థిప్రమాణాలు కూడా మెరుగుపడానడయి. స్థూల నిరర్ధక ఆస్తులు 1.61శాతంగా ఉన్నాయి. అలాగే నికర నిరర్ధక ఆస్తులుకూడా 0.48శాతంకు చేరాయి. కేటాయింపులు కూడా రూ.869 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలోరూ.1450 కోట్లు తక్షణ కేటాయింపులకు చేసింది. నిర్వహణ లాభం 416శాతంక్షీణించి 1059 కోట్లుగా ఉంది. ఇక సమస్యాత్మక ఇంధన ఆస్తులు విక్రయించడంవల్లరూ.274 కోట్లు నష్టం చవిచూసింది. క్రెడిట్ కార్డులు 4.5 మిలియన్ల మార్కును దాటాయని, ప్రైవేటు వెల్త్‌మేనేజ్‌మెంట్ బిజినెస్ 23శాతంపెరిగి రూ.57 వేలకోట్లకు చేరిందనిఎండి సిఇఒ వి వైద్యనాథన్ తెలిపారు.

# 9శాతం క్షీణించిన యాక్సిస్ బ్యాంకు లాభం




**ముంబయి, ఏప్రిల్ 25:** దేశంలోని మూడో అతిపెద్ద ప్రైవేటు బ్యాంకుగా నిలిచిన యాక్సిస్‌బ్యాంకు నికర లాభాల్లో క్షీణించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.7117 కోట్లు ఆర్జించిన బ్యాంకు ఈ త్రైమాసికంలో రూ.7071 కోట్లు సాధించి 9 శాతం క్షీణతను నమోదు చేసింది. బ్లూంబర్గ్ వంటి సంస్థల అంచనాలను మాత్రం బ్రేక్‌చేసింది. రూ.6958 కోట్లు రాగలదని ఈ సంస్థ అంచనావేసింది. ఈ త్రైమాసికంలో పన్నుల చెల్లింపులు కూడా తగ్గాయని, రూ.2193.2 కోట్లు తగ్గినట్లు బ్యాంకు ప్రకటించింది. నికరవడ్డీ మార్జిన్ ఐదుశాతంపెరిగి రూ.14,457 కోట్లకు చేరితే గత త్రైమాసికం కంటే స్వల్పంగా తగ్గి 3.62గా నమోదయింది. బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.23శాతంగా ఉన్నాయి అలాగే నికర నిరర్ధక ఆస్తులు కూడా 0.37శాతంగా ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. బ్యాంకు తక్షణ కేటాయింపులకింద గత ఏడాది రూ.1359 కోట్లుకేటాయిస్తే ఈసారి రెట్టింపు మొత్తం అంటే రూ.3522 కోట్లు కేటాయించింది. బ్యాంకు అడ్వాన్సులు కూడా రూ.12,33,570 కోట్లుగా ఉన్నాయి.




# 8750 మంది ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో కూడా లేఆఫ్‌లు భయపెడుతున్నాయి. అమెరికా ఉద్యోగుల్లో వేలాదిమందికి స్వచ్ఛంద సివరెన్స్‌లు ప్రకటించింది. అమెరికా వర్క్‌ఫోర్స్‌లో ఏడుశాతం మందిపై లేఆఫ్ ఉంటుందని ప్రకటించింది. మొత్తం అమెరికాలో 1.25 లక్షలమంది ఉద్యోగులుంటే సుమారు 8750 మంది లేఆఫ్‌లతో వదిలి వెళ్లాల్సి వస్తోంది. గడచిన ఆరునెలలుగా మైక్రోసాఫ్ట్ స్టాక్ ధరలు పడిపోతున్నాయి. 25 నుంచి 30శాతం వరకూ క్షీణించాయి. కృత్రిమ మేధపై భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతుండటంతో కంపెనీ మార్జిన్లు క్షీణించాయి.

అంతకుముందు కూడా మైక్రోసాఫ్ట్ వ్యయనియంత్రణలో బాగంగా 15వేల మందిపై వేటువేసింది. సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజి కమిషన్ లెక్కలప్రకారం మొత్తం 2.28 లక్షలమంది ఉద్యోగులు ఉంటే వారిలో గత ఏడాది జూన్‌నాటికి అమెరికాలోనే 1.25 లక్షలమంది ఉన్నారు. రిటైర్‌మెంట్లు, బై ఔట్‌లరూపంలో మూడు పద్దతులు ప్రకటించింది. మైక్రోసాఫ్ట్‌లో మీ సర్వీసు, మీ వయసుకు అనుగుణగా ఉంటుంది. 52 ఏళ్ల వ్యక్తి 18 ఏళ్లపాటు సర్వీసు ఉంటే మొత్తంగా ఆయనకు 70ఏళ్లవయసు వస్తుంది. జాబ్ స్థాయి హోదాతో పనిలేకుండా సీనియర్‌డైరెక్టర్ స్థాయిలో ఉన్నవారికి 67ఏళ్ల వయసుకుపైబడి ఉంటే వారికి ఈ లేఆఫ్ వర్తిస్తుంది. వయసు, సర్వీసుతో నిమిత్తంలేకుండా వెళ్లిపోయే ఉద్యోగులకు సేల్స్ ప్రోత్సాహకాలు కూడా రూపొందిస్తోంది. మే ఏడవ తేదీ ఉద్యోగుల వివరాలు వెల్లడిస్తామని, 30రోజులు గడువు ఇచ్చి నిర్ణయించుకోవాలని చెఉతామని కంపెనీ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.